


www.prajapaksh2am.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 303 | గురువారం | 03-10-2024 | ఖమ్మం    Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar**    పేజీలు: 12+8 | వెల రూ. 5.00


గర్వకారణమైన కమ్యూనిస్టు కామ్రేడ్ బర్ధన్

యుద్ధం అంచున మధ్య ప్రాచ్యం

లోపలి పేజీల్లో

## ఆర్‌టిసిలో ఇక అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలే

ఫ్యూయల్ సెల్ పరిశ్రమల ఏర్పాటుకు జపాన్ కంపెనీలకు ఆహ్వానం

తోషిబా పరిశ్రమ సందర్శన, పెట్టుబడులకు, ఉమ్మడి భాగస్వామ్యానికి ఆహ్వానం

ప్రజా రవాణాలో జపాన్ బుల్లెట్ రైళ్లు ప్రపంచానికే ఆదర్శం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం / హైదరాబాద్:** రాష్ట్రంలో ఫ్యూయల్ సెల్ పరిశ్రమల ఏర్పాటుకు జపాన్ కంపెనీలకు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆహ్వానం పలికారు. తోషిబాతో ఉమ్మడి భాగస్వామ్యంతో పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. ప్రజా రవాణాలో జపాన్ బుల్లెట్ రైళ్లు ప్రపంచానికే ఆదర్శమని, ఈ తరహా రవాణా వ్యవస్థను తెలంగాణలో కూడా అభివృద్ధి చేయాలని భారత రైల్వే శాఖను కోరనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాష్ట్రంలోని ఆర్‌టిసి బస్సులు అన్నీ ఎలక్ట్రిక్ వాహనాలుగా రూపుదిద్దాలని భావిస్తున్నామని, ఈ నేపథ్యంలో తోషిబా సేవలు అవసరమవుతాయన్నారు. సింగరేణి సంస్థ తన వ్యాపార విస్తరణ చర్యల్లో భాగంగా బొగ్గుతో పాటు లిథియం వంటి ఇతర ఖనిజ తవ్వకాల లోకి ప్రవేశించనున్నదని, లిథియం బ్యాటరీల ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న తోషిబా సింగరేణితో కలిసి ముందుకుపోవచ్చని సూచించారు. జపాన్ దేశంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం తోషిబా ప్రధాన కార్యాలయం, పరిశ్రమల సందర్శన, ఫ్యూయల్ సెల్ విభాగాల ఏర్పాటు, తదితర అంశాలపై సమావేశాలతో బిజీ బిజీగా గడిపారు. టోక్యో నగరం నుండి 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రముఖ బహుళ జాతి ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ ఉత్పత్తుల దిగ్గజ కంపెనీ తోషిబా వారి ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, భారత రాయబార కార్యాలయ అధికారులు బన్సల్, దేవజాని సందర్శనలో పాల్గొన్నారు. తోషిబా ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సొల్యూషన్స్ ఉన్నతాధికారి హిరోషి కనేట, వైస్ ప్రెసిడెంట్ షిగే రిజో కవహర, కనేట తదితర ఉన్నతాధికారులు తరువాయి 2లో

## ఎంగిలిపూల బతుకమ్మ ఉయ్యాలో...





రాష్ట్రవ్యాప్తంగా ఎంగిలిపూలతో బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పలుచోట్ల వర్షం కురిసినప్పటికీ లెక్కచేయకుండా మహిళలు కోలాహలంగా ఆడుతూ పాడుతూ సందడి చేశారు. మంత్రి కొండా సురేఖ వరంగల్‌జిల్లా పోచమ్మ మైదానంలో జరిగిన వేడుకల్లో బతుకమ్మ ఆడారు.

## పేదల ఇళ్ళ జోలికి వెళ్ళొద్దు

పేదలకు 58, 59 జిఒ ప్రకారం క్రమబద్ధీకరించాలి : కూనంనేని సాంబశివరావు

అమీన్‌పూర్‌లో హైడ్రా కూల్చిన ఇండ్ల పరిశీలన



**ప్రజాపక్షం / హైదరాబాద్** హైడ్రా పేరుతో పేదల ఇళ్ళను కూల్చవద్దని, దొంగలను మంచివారిని ఒకే పద్ధతిలో చూడవద్దని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్ పుర , పటేల్ గూడా, బిఎస్ఆర్ కాలనీలో హైడ్రా కూల్చివేసిన పేదల ఇళ్ళను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట తరువాయి 2లో

## కూలిన హెలికాప్టర్

ఇద్దరు పైలట్లు, ఇంజనీర్ మృతి

**పుణె :** మహారాష్ట్రలో ఓ ప్రైవేటు విమాన యాన సంస్థకు చెందిన హెలికాప్టర్ పుణె జిల్లాలో బుధవారం కూలిపోయింది. వెంటనే దగ్ధమైంది. ఈ ఘటనలో ఇద్దరు పైలట్లు, ఒక ఇంజినీర్ మృతి చెందినట్లు పోలీసులు చెప్పారు. తమ పార్టీ అద్దెకు తీసుకున్న అదే హెలికాప్టర్‌లో బుధవారం ముంబయి నుండి రాయ్‌గఢ్‌కు వెళ్లాల్సి ఉన్నదని లోక్‌సభ సభ్యుడు, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ తట్కరే పిటిఐకి చెప్పారు. ఢిల్లీలోని హెరిటేజ్ తరువాయి 12లో

## పిడుగుపాటుకు ముగ్గురు మృతి



**ప్రజాపక్షం/ఆత్మకూరు/రేగొండ** ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం పడింది. దీనికి తోడు పిడుగులు పడ్డాయి. ఈ ఘటనల్లో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వివరాల్లోకి వెళితే... హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం చౌళ్లపల్లి గ్రామంలో పంట చేలలోకి కూలి పనులకు వెళ్లిన ఇద్దరు మహిళలపై పిడుగు పడింది. దీంతో వారు అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. చౌళ్లపెల్లి గ్రామానికి చెందిన ఇటికాల నిర్మల, సోలంకి రమలు మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో వారి కుటుంబాలలో తీవ్ర విషాదం తరువాయి 2లో

## మత స్వేచ్ఛ, హక్కులను కాలరాసేందుకే

వక్ఫ్ సవరణ బిల్లు : సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా



**ప్రజాపక్షం/హైదరాబాద్** భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ, హక్కులను కాలరాసేందుకే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు 2024 ను తీసుకొచ్చిందని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. మోదీ ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలో వక్ఫ్ బోర్డులను నియంత్రించే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, తరువాయి 2లో

## బిఆర్ఎస్ ప్రజాప్రతినిధులు 800 చెరువులు కబ్జా

అందుకే హైడ్రా అంటే జంకుతున్నారు

రాహుల్ గాంధీకి, హైడ్రాకు ఏమిటి సంబంధం?

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్ గౌడ్



**ప్రజాపక్షం /హైదరాబాద్** గత పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ ఎంఎల్ఎలు, ఎంఎల్‌సిలు 800 చెరువులను కబ్జా చేశారని, అందుకే వారు హైడ్రా కూల్చివేతలకు భయపడుతున్నారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఇప్పుడు చెరువులు, కుంటల ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లోని నిర్మాణాలనే హైడ్రా కూల్చివేస్తోందని ఆయన స్పష్టం చేశారు. గాంధీ భవన్‌లో బుధవారం మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. బిఆర్ఎస్ నేతలు కెటిఆర్, ఇతర నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అసలు రాహుల్ గాంధీకి, హైడ్రాకు సంబంధం ఏమిటి? అని మహేష్‌కుమార్ గౌడ్ నిలదీశారు. హైడ్రాకు, తరువాయి 2లో

## కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితమా?



ప్రమాదవశాత్తు మరణించిన కార్మికునికి పరిహారం చెల్లించని రాణి అండ్ కో యాజమాన్యం

కాంట్రాక్టర్ పేరే తెలియదంటున్న కార్మిక శాఖ అధికారులు

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి** కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితమవుతున్నాయి అనడంలో అతిశయోక్తి లేదు కార్మిక శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరితో కార్మికులు తమ హక్కులను కోల్పోతున్నారు.పని ప్రదేశాలలో ప్రమాదం జరిగి మరణించినా పరిహారం మాత్రం అందడం లేదు. నెల రోజుల క్రితం సుల్తానాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలోని రాణి అండ్ కో గోదాంలో ప్రమాదవశాత్తు బిహార్ వలస కార్మికుడు మృతి చెందగా విషయం బయటకు తెలియకుండా సంబంధిత అధికారుల అండదండలతో శవపంచనామా ఇక్కడే నిర్వహించారు. మృతదేహాన్ని వారి సొంత రాష్ట్రానికి పంపించకుండా ఇక్కడే ఖననం చేసి యాజమాన్యం చేతులు దులుపుకున్నా కార్మిక శాఖ అధికారులు మాత్రం ఆ గోదాం పై చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. సంఘటన జరిగిన నాలుగు రోజులకు తూతూ మంత్రంగా రాణి అండ్ కో గోదాములకు ఓ కార్మిక సంఘం నాయకునితో కలిసి వెళ్లిన పెద్దపల్లి కార్మిక అధికారి వలస కార్మికుని మృతి వివరాలు అడిగి తెలుసుకుని పని ప్రదేశాలన్నీ కలియ తిరిగారు. కనీస సౌకర్యాలు కల్పించకుండా కట్టు బానిసల్లా పనులు చేయిస్తున్న సంబంధిత గోదాం యజమానిపై ఎలాంటి చర్యలు తీసుకోపోవడం పట్ల పలువురి నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాణి అండ్ కో వద్దనుండి కార్మిక శాఖ అధికారులకు,మధ్యవర్తికి (ఓ సంఘం నాయకుడు) ముడుపులు ముట్టినందునే మౌనంగా ఉన్నారా అని స్థానికులు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. ఈ ప్రమాద సంఘటన వెలికి తీసి 'ప్రజాపక్షం' ప్రచురించిన కథనాలపై పలు కార్మిక సంఘాల నాయకులు రాణి అండ్ కో తరువాయి 12లో








గాంధీ జయంతి సందర్భంగా బుధవారం బీజింగ్‌లోని జిన్‌తాయ్ మ్యూజియం వద్ద మహాత్ముడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న భారత రాయబారి కుమార్ రావత్, ఆయన సతీమణి శృతి రావత్. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గాంధీ సూక్తులను వినిపిస్తున్న విద్యార్థులు. అనంతరం జరిగిన కళా ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# యుద్ధం అంచున మధ్యప్రాచ్యం?







**జెరూసలేం:** నిన్నమొన్నటి వరకు లెబనాన్ కేంద్రంగా పనిచేస్తున్న హిజ్బొల్లా మిలీషియాకు పరోక్షంగా మద్దతు ప్రకటించిన ఇరాన్ ఇప్పుడు ప్రత్యక్షంగా రంగంలోకి దిగడంతో, మధ్యప్రాచ్యం యుద్ధం అంచున నిలిచింది. మంగళవారం క్షిపణులతో ఇజ్రాయెల్‌పై ఇరాన్ విరుచుకుపడిన నేపథ్యంలో, బుధవారం సరిహద్దుల వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏ క్షణమైనా ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య పూర్తిస్థాయి యుద్ధం మొదలయ్యే ప్రమాదం లేకపోలేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఇరాన్ క్షిపణుల వర్షం కురుపించిన ఒక రోజు తర్వాత, మధ్యప్రాచ్యం దీర్ఘకాలంగా భయపడుతున్న ప్రాంతీయ యుద్ధం దాదాపుగా మొదలైనట్టేనని అంటున్నారు. హిజ్బొల్లా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నట్టు ఇజ్రాయెల్ పలు సందర్భాల్లో ప్రకటించినప్పటికీ, లెబనాన్ రాజధాని బీరూట్‌లోని జనావాసాలు కూడా బాంబు దాడులకు గురయ్యాయి. కాగా, ఒకవైపు గాజా స్ట్రిప్‌లో హమాస్‌పై లెబనాన్‌లో హిజ్బొల్లాపై దాడులకు తెగబడుతున్న ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ప్రతిపాదనలకు స్పందించడం లేదు. కాగా, హిజ్బొల్లా చీఫ్ సయ్యద్ హసన్ నస్రల్లా, కీలక నేత నిల్ఫోరూషన్, హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనిషియా మృతికి ప్రతీకారంగానే ఇజ్రాయెల్‌పై క్షిపణులతో దాడులు జరిపినట్టు ఇరాన్ అధికారకంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్‌కు తగిన సమాధానం చెప్తామని ఇజ్రాయెల్ ప్రకటించగా, ఇరాన్ సైన్యం కూడా తీవ్రంగానే స్పందించిది. మౌలిక సదుపాయాలపై విస్తృత దాడులు చేస్తామని హెచ్చరించింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి బుధవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించింది.

అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువగడనప్పటికీ, ఇజ్రాయెల్‌ను కాల్పుల విరమణకు ఒప్పించి, శాంతి చర్చలను పునరుద్ధరించేందుకు ప్రయత్నించాలని నిర్ణయించినట్టు సమాచారం. అయితే, హమాస్‌తొ చర్చలకు నిరాకరించిన ఇజ్రాయెల్, ఇప్పుడు హిజ్బొల్లాతో శాంతికి సుముఖత వ్యక్తం చేస్తుందా అన్నది అనుమానమే. అంతేగాక, ఇజ్రాయెల్ దళాలు లెబనాన్‌లోకి ప్రవేశించినట్టు బీరుట్ నుంచి తొలి అధికారిక ప్రకటన వెలువడింది. భూతల యుద్ధానికి కూడా ఇజ్రాయెల్ సిద్ధమైనట్టు ఈ పరిణామలు స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్‌ను నిలువరించే ప్రయత్నం చేస్తూనే, లెబనాన్‌ను ధ్వంసం చేయాలన్నది ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు వ్యూహంగా కనిపిస్తున్నది. ఎట్టి పరిస్థితుల్లోనూ హిజ్బొల్లాను విడిచిపెట్టేది లేదని ఐక్యరాజ్య సమితి వేదికగా ఆయన చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ సరిహద్దుల్లోకి చొరబడుతున్నాయని హిజ్బొల్లా అధికార ప్రతినిధి మహమ్మద్ ఆసిఫ్, ఈ చర్యను అడ్డుకుంటామని అన్నారు. ఇరాన్ ప్రత్యక్షంగా ఇజ్రాయెల్‌పై దాడికి దిగడాన్ని హిజ్బొల్లా స్వాగతిస్తున్నది. ఇజ్రాయెల్‌పై ముప్పేట దాడి ఖాయంగా కనిపిస్తున్నందున, మధ్యప్రాచ్యంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్, లెబనాన్‌లతో ఇజ్రాయెల్ పూర్తిస్థాయి యుద్ధానికి దిగితే, ఆస్తి, ప్రాణ నష్టాలు తప్పవు.

## గాజాస్ట్రిప్‌లో ఆగని దాడులు...తాజాగా 51 మంది మృతి



**డేర్ అల్ బలా:** గాజా స్ట్రిప్‌పై ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తునే ఉన్నాయి. కాల్పుల విరమణ అంశాన్ని పట్టించుకోని ఇజ్రాయెల్, తాజాగా జరిపిన దాడుల్లో 51 మంది మృతి చెందారని పాలస్తీనా మెడికల్ అధికారి ఒకరు తెలిపారు. ఖాన్ యూనిస్ నగరంలో ఇజ్రాయెల్ భూపోరాటాన్ని మొదలు పెట్టిందని, ఫలితంగా బాంబుల మోతతో ఆ ప్రాంతం దద్దరిల్లుతున్నదని సమాచారం. హమాస్ ఉగ్రవాదులను ఏరి వేస్తామంటూ, భూపోరాటానికి దిగిన ఇజ్రాయెల్ దళాలు జనావాసాలపై దాడులకు ఉపక్రమిస్తున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. వరుస దాడుల్లో భారీగా ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవిస్తున్నాయి. పాలస్తీనియన్లు మౌలిక సదుపాయాలు కూడా లేక అల్లాడుతున్నారు. ఈ పరిస్థితిలో జనావాసాలను కూడా ఇజ్రాయెల్ లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగడాన్ని అంతర్జాతీయ సమాజం ఖండిస్తున్నది. హమాస్‌తో శాంతి చర్చలు జరపాలని సూచిస్తున్నది. అయితే, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు పోరాటం కొనసాగుతుందని ప్రకటించడం తో, శాంతి ఆశలు ఆవిరవుతున్నాయి.

## అమెరికా–చైనా మధ్య మరో వాణిజ్య యుద్ధం






**వాషింగ్టన్/ బీజింగ్:** అమెరికా, చైనా దేశాల మధ్య మరోసారి వాణిజ్య యుద్ధం మొదలైంది. ఒక దేశం నుంచి దిగుమతయ్యే వస్తువులపై మరో దేశం భారీగా పన్నులు విధింస్తూ, ఆంక్షలు అమలు చేస్తూ, ఆధిపత్యానికి గండికొట్టడానికి జరిపే ప్రయత్నాలనే 'వాణిజ్య యుద్ధం'గా పేర్కొంటారు. మైక్రోచిప్స్ విభాగంతోపాటు ఎలక్ట్రిక్ వాహనాల రంగంలోనూ చైనా పూర్తి ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. అత్యధిక దేశాలు వీటి కోసం చైనాపైనే ఆధారపడాలిన పరిస్థితిని కల్పించింది. అయితే, దేశీయంగా ఉత్పత్తులను పెంచడమేగాక, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించమే లక్ష్యమని పేర్కొంటూ, చైనా నుంచి దిగుమతి అవుతున్న ఎలక్ట్రిక్ వాహనాలపై సుంకాన్ని అమెరికా ఏకంగా 100 శాతం పెంచింది. భారత్ కూడా అమెరికా మార్గాన్నే అనుసరించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మన దేశంలో కొన్ని పరిమితులు ఉన్నప్పటికీ, చైనా నుంచి దిగుమతులు పెరుగుతునే ఉన్నాయి. 2019–2020 ఆర్థిక సంవత్సరంలో 70 బిలియన్ డాలర్లుగా ఉన్న దిగుమతులు 2023– 24 ఆర్థిక సంవత్సరాంతానికి 101 బిలియన్ డాలర్లకు పెరిగాయి. భారత్ దిగుమతి చేసుకుంటున్న వస్తువుల్లో సౌరశక్తికి సంబంధించినవే ఎక్కువ. పునరుత్పాదక శక్తి వనరులను పెంచాలన్న లక్ష్యాలను ఇప్పటికే ప్రకటించిన భారత్, అందుకు అవసరమైన 80 శాతం వస్తువులు, ప్రత్యేకించి సౌర ఘటాలను చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నది. ఉక్కు దిగుమతులు కూడా పెరుగుతున్నాయి. మొబైల్ ఫోన్ల తయారీ రంగంలో ఉత్పత్తి పెరిగినప్పంటికీ, కీలకమైన విడిభాగాల కోసం భారత్ ఇప్పటికీ చైనాపైనే ఆధారపడింది. దేశీయంగా ఉత్పత్తి రంగంపై దృష్టి పెట్టకుండా, మౌలిక సదుపాయాలను పెంచకుండా, కేవలం అమెరికాను ఆదర్శంగా తీసుకొని చైనా వస్తువులపై దిగుమతి సుంకాలను పెంచినంత మాత్రాన భారత్‌కు ఒరిగేది ఏమీ ఉండదు.

## ఒక కమాండర్ మృతి : అధికారికంగా ప్రకటించిన ఇజ్రాయెల్

**ఉజెరూసలేం:** లెబనాన్‌పై దాడులు ప్రారంభించిన తర్వాత, తమ సైనికుడి మరణ వార్తను ఇజ్రాయెల్ తొలిసారి ప్రకటించింది. కమాండో బ్రిగేడ్‌కు చెందిన 22 ఏళ్ల సైనికుడు లెబనాన్‌లో జరుగుతున్న పోరుతలో ప్రాణాలు కోల్పోయాడని తెలిపింది. హిజ్బొల్లాతో జరుగుతున్న పోరులో అతను మృతి చెందాడని వివరించింది. హిజ్బొల్లా, ఇరాన్, లెబనాన్ దాడుల్లో తొలిమరణాన్ని ఇజ్రాయెల్ ఈ ప్రకటన ద్వారా ధ్రువీకరించింది.

## ఇరాన్ చర్య సరికాదు.. అమెరికా,యుకె ఖండన

**వాషింగ్టన్/ లండన్:** ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులు చేయడం సమంజం కాదని అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) వ్యాఖ్యానించాయి. ఈ దాడులను ఖండిస్తున్నట్టు తెలిపాయి.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన మంత్రి వర్గ సహచరులతో అత్యవసర సమావేశం నిర్వహించిన తర్వాత, విడుదల చేసిన ఒక ప్రకటనలో మధ్యప్రాచ్యంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను గమనిస్తున్నట్టు చెప్పారు. పరిస్థితులను సమీక్షిస్తున్నామని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు తమ మద్దతు కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. ఇరాన్ ఏకపక్షంగా వ్యవహరించిందని తప్పుబట్టారు. యుకె ప్రధాని కైర్ స్టార్మెర్ కూడా దాదాపు ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ భూభాగంపై ఇరాన్ క్షిపణులతో విరుచుకపడడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇరు దేశాలు సంయమనం పాటించాలని సూచించారు.

## యుఎన్ చీఫ్‌ను రానియ్యం

### ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి స్పష్టీకరణ

**జెరూసలేం:** ఐక్యరాజ్య సమితి (యుఎన్) చీఫ్ ఆంటానియో గుటెర్స్‌ను తమ దేశంలోకి రానియ్యబోమని ఇజ్రాయెల్ విదేశాంగ మంత్రి ఇజ్రాయెల్ కజ్ స్పష్టం చేవారు. యుఎన్ సెక్రెటరీ జనరల్ పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నట్టు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. తమ దేశ ప్రయోజనాలకు విరుద్ధంగా గుటెర్స్ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయనను 'పర్సనా నాన్ గ్రేటా'గా అభివర్ణించారు.



## పిడుగుపాటుకు ముగ్గురు మృతి

**(మొదటి పేజీ తరువాయి)**

నెలకొంది. అదే విధంగా భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన కరట్లపల్లి లక్ష్మి (45) భర్త నగేష్‌తో కలిసి తనకున్న వ్యవసాయ భూమిలో మిరప తోటకు ఎరువులు వేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుపడింది. అయితే లక్ష్మి దగ్గరలో పిడుగు పడడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆమె భర్త నగేష్ తెలిపాడు. మృతురాలి మెడలో ఉన్న పుస్తెలతాడు ముక్కలై పిడుగు పడినప్పుడు వచ్చిన వేడితో కరిగిపోయినట్లు స్థానికులు గుర్తించారు. మృతురాలికి ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. పిడుగుపాటుకు గురై మహిళ రైతు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు పలుముకున్నాయి. పిడుగుపాటుతో మహిళ మృతి చెందిన విషయం తెలుసుకున్న భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హుటాహుటినా రంగయ్యపల్లికి చేరుకొని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

## పేదల ఇళ్ళ జోలికి వెళ్ళొద్దు

**(మొదటి పేజీ తరువాయి)**

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. బాల మల్లేశ్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నరసింహ, సంగారెడ్డి జిల్లా కార్యదర్శి జల్లాలుద్దీన్, రాష్ట్ర సమితి సభ్యులు వి.ప్రకాశ్ రావు ఉన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఫామ్ హౌస్ లు, విల్లాలు కట్టుకున్న పెద్ద పెద్ద వారి అక్రమ కట్టడాలను హైడ్రా కూల్చడాన్ని తాము ఏమి తప్పు పట్టడం లేదని, పేదల జోలికి రావద్దని ప్రభుత్వాన్ని కోరారు. బిల్డర్ల వద్ద నెల నెలా జీతభత్యాలనుండి పోగుచేసిన డబ్బుతో కొనుగోలు చేసిన ఇండ్లను కూల్చడం అన్యాయమన్నారు. దాదాపు 26 ఏళ్ల నుండి ఉన్న ఇళ్ళను కూల్చివేశారని, వాటిలో ఇటీవలనే గృహప్రవేశం చేసిన ఇళ్ళు కూడా ఉన్నాయని తెలిపారు. గత 40 సంవత్సరాల నుండి ఈ భూములు క్రయ విక్రయాలు జరుగుతున్నాయని, వాటికి సంబంధించిన ఈసీలు కూడా రిజిస్టర్ ఆఫీసులలో ఉన్నాయని కూనంనేని అన్నారు. ఒకవేళ హైడ్రా చెప్తున్న ప్రకారం ఈ ఇండ్లు ప్రభుత్వ భూమిలో నిర్మించి ఉంటే 58, 59 జీవో ద్వారా పేదలకు క్రమబద్ధీకరించవచ్చు అన్నారు. ఆ ఇండ్లు చెరువు ఎఫ్ టి ఎల్ లెవెల్, బఫర్ జోన్లలో లేవని వారు తెలిపారు. 100 మంది దోషులు తప్పించుకున్న ఒక్క నిర్దోషి కూడా శిక్ష పడకూడదని చట్టం చెబుతుందని, ఇప్పుడు పేదలను శిక్షించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. తప్పుడు సర్వే నెంబర్లతో సమాచారం తెలుసుకొని కూల్చివేతలు చేపడితే పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించి, పూర్తిగా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, ఒకవేళ ప్రభుత్వ భూమి అయితే క్రమబద్ధీకరించాలని వారన్నారు. ఒకవేళ ఉపయోగపడే చెరువులు, కుంటలలో పేదలు గుడిసెలు వేసుకుంటే ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని, తెలియక భూములు కొనుక్కున్న వారికి నష్టపరిహారం ఇవ్వాలని అన్నారు. నిజంగా అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యక్తుల మీద, అనుమతులు ఇచ్చిన అధికారుల మీద చర్యలు తీసుకోవచ్చని సాంబశివరావు తెలిపారు.

# 'సీవరేజ్ ఓవర్‌ఫ్లో ఫ్రీ సిటీ'గా హైదరాబాద్

### పోస్టర్ ఆవిష్కరించి, ప్రారంభించిన సిఎం రేవంత్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణంపై జలమండలి చేపట్టిన 90 రోజుల స్పెషల్ డ్రైవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మెహిదీపట్నంలోని బాపూఘాట్ వద్ద గాంధీకి నివాళులు అర్పించిన అనంతరం స్పెషల్ డ్రైవ్‌కు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించి, లాంఛనంగా ప్రారంభించారు. అంతకుముందు సరోజిని దేవి ఆస్పత్రి ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణం కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రతి వర్షపు చుక్కను భూగర్భ జలంగా మార్చాలన్నారు. వర్షపు నీటిని వృథా చేయకుండా, పునర్వినియోగించు కోవాలన్నారు. ఇందుకోసం ప్రజలు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలన్నారు. భవిష్యత్తులో నీటి కరవు రాకుండా ఖాళీ ప్రదేశాల్లో వీటిని నిర్మించుకోవాలన్నారు. నగరంలో ఉన్న మ్యాన్ హోళ్లలో మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం కలి గించకుండా వాటిల్లో ఎలాంటి వ్యర్థాలు వెయ వద్దన్నారు. హైదరాబాద్ నగరాన్ని సీవరెజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలన్నారు.

**సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా హైదరాబాద్ : అశోక్ రెడ్డి**

ఎం.డి. అశోక రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు హైదారాబాద్‌ను సీవరెజ్ ఓవర్ ఫ్లో ఫ్రీ సిటీగా మార్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ప్రధానంగా దీర్ఘకాలికంగా ఉన్న సివరెజ్ సమస్యల నివారణ, ఇంకుడు గుంతల నిర్మాణం అంశాలపై దృష్టి పెట్టామన్నారు. వాటర్ ట్యాంకర్ డిమాండ్ తగ్గించడానికి వినియోగదారులు తమ ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ స్పెషల్ డ్రైవ్ ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి. అనిల్ కుమార్ యాదవ్, ఎంఎల్ఎ మహ్మద్ మాజిద్ హుస్సేన్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జలమండలి ఈడి మాయంక్ మిట్టల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలరాసేందుకే (మొదటి పేజీ తరువాయి)

ఈ బిల్లు అమలవుతే దేశంలోని పేద ముస్లిం ప్రజలకు ప్రస్తుతం అందుతున్న కొద్దిపాటి సంక్షేమం, సహాయం కూడా అందకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్ సవరణ బిల్లు 2024 ను తక్షణమే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ 'తంజీమ్ ఏ ఇన్సాఫ్' రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్, ఇందిరాపార్క్‌లోని ధర్నా చౌక్ వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా 'వక్ఫ్‌సవరణ బిల్లు'ను వెంట నే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇన్సాఫ్ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశా రు.

అనంతరం సయ్యిద్ అజీజ్ పాషా మాట్లాడుతూ లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశ పెట్టిన సందర్భంగా ప్రతిపక్షం నుండి గట్టి ఎదురుదెబ్బ తగలడంతో ,ఈ బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి మోదీ ప్రభుత్వం ప్రతిపాదించడం సిగ్గుచేటన్నారు. వక్ఫ్‌చట్టంలో మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణలు ముస్లిం సమాజ ప్రయోజనాలకు పూర్తిగా విరుద్ధమన్నారు. దేశంలోని వక్ఫ్ ఆస్తులు ముస్లిం సమాజ ప్రయోజనాల కోసం,అణగారిన వర్గాలకు సహాయం చేయడానికి అంకితం చేసిన వ్యక్తిగత ఆస్తులు అని వివరించారు. ప్రస్తుతం ఉన్న వక్ఫ్‌బోర్డులు అన్ని ముస్లిం వర్గాలను కలుపుకుని వారి సంక్షేమానికి వక్ఫ్ వనరులను అత్యధికంగా వినియోగించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు.

వక్ఫ్ బోర్డుల ఆస్తులను నిర్వహించే అధికారాన్ని పరిమితం చేయడం, ఏదైనా వక్ఫ్ ఆస్తికి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ తప్పనిసరి చేయాలని నిబంధనలు విధించడం, మత స్వేచ్ఛ హక్కును హరించడమేనని అజీజ్‌పాషా మండిపడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లు2024లోని నోట్ 1, క్లాజ్ 9,11 ప్రకారం ప్రతి వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతర సభ్యులను తప్పనిసరిగా చేర్చాలనే నిబంధన విధించడం ఏమిటని, ఇతర మతపరమైన బోర్డుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇదే వైఖరిని అవలంబిస్తుందా అని అయన నిలదీశారు. బిజెపి తన మార్ద్‌కోర్ మద్దతుదారులైన ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ శక్తులను సంతృప్తి పరిచేందుకు, ఈ బిల్లును తీసుకొచ్చిందని విమర్శించారు.

వివాదాస్పద బిల్లును ప్రవేశపెట్టి పౌరుల విశ్వాసాన్ని, మత స్వేచ్ఛపై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడులు చేయడం దుర్మార్గమని, ఇది భారత రాజ్యాంగం పైనే దాడి అని అన్నారు. వక్ఫ్ సవరణ బిల్లు, 2024 వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంవరించుకోవాలని,లేదంటే దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని అజీజ్ పాషా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తంజీమ్ ఏ ఇన్సాఫ్ రాష్ట్ర కార్యదర్శి మునీర్ పటేల్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎండి. అఖీల్ తదితరులు పాల్గొన్నారు.

## 800 చెరువుల కబ్జా

**(మొదటి పేజీ తరువాయి)**

మూసీ ప్రక్షాళనకు సంబందం లేదని, ఇంకా డిపిఆర్ రూపొందించని మూసీ ప్రక్షాళన ప్రాజెక్టులో అవినీతి ఎలా జరుగుతుందో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. మూసీని ప్రక్షాళన చేస్తామని గతంలో మాజీ సిఎం కెసిఆర్ కూడా చెప్పారని, ఇప్పుడు మాత్రం బిఆర్ఎస్ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని మహేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ కనిపించడం లేదని, ఆయన ఎక్కడ ఉన్నారో చెప్పాలని కెటిఆర్‌ను మహేష్‌కుఎమార్ ప్రశ్నించారు. బిఆర్ఎస్ వారు అడ్డగోలుగా సంపాదించిన డబ్బుతో సోషల్ మీడియా నడిపిస్తున్నారని, హైడ్రా కూల్చివేతలపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం జరుగుతోందని, ఈ తప్పుడు ప్రచారం చేసేవారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. హైదరాబాద్‌లోని చెరువులకు పూర్వవైభవం తీసుకు వస్తామన్నారు. మూసీ చుట్టూ ఉన్న ఒక్క ఇల్లును కూడా ఇప్పటి వరకు తొలగించలేదని, మూసి చుట్టూ ఉన్న వారికి చట్టబద్ధంగా ప్రభుత్వం నష్ట పరిహారం ఇస్తుందని ఆయన చెప్పారు. మధు యాష్కీ మాట్లాడిన మాటలలో తప్పు లేదన్నారు. హైడ్రా పేరుతో ఒక్క రూపాయి వసూలు చేశామని నిరూపిస్తే తాను పూరాణపుల్ బ్రిడ్జిపై నుండి మూసిలో దూకుతానని, నిరూపించకపోతే కెటిఆర్ పురాణపుల్ బ్రిడ్జిలో దూకుతావా అని సవాల్ చేశారు. రాష్ట్రాన్ని చెట్ల పేరుతో, లిక్కర్, ఇరిగేషన్ పేరుతో బిఆర్ఎస్ నాయకులు దోచుకున్నారని, వారు రాష్ట్రాన్ని మొత్తం లూటీ చేశారని మహేష్ కుమార్ విమర్శించారు. తీన్మార్ మల్లన్న మాటలు అభిప్రాయం వ్యక్తిగతమన్నారు.

మంత్రి కొండా సురేఖపై సోషల్ మీడియాలో వచ్చిన వ్యాఖ్యలపై మూడు రోజుల కింద కెటిఆర్ ఎందుకు ఖండించలేదని ఆయన ప్రశ్నించారు. హరీష్‌రావుకు ఉన్న సామాజిక స్పృహ కెటిఆర్‌కు లేదన్నారు.హైడ్రా ఉండాలని అందరూ కోరుకుంటున్నారని మహేష్‌కుమార్ చెప్పారు. బిఆర్ఎస్ ఎంఎల్ఎలు తమకు టచ్‌లో ఉన్నారని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మూసీ చుట్టూ ఉన్న వారిని గుర్తించి వారికి డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చిన తరువాతనే వారిని ఖాళీ చెయిస్తామన్నారు. మూసీ చుట్టూ ఉన్న వాళ్ళ ఇళ్లను కూలగొట్టక ముందే వారిని బిఆర్ఎస్ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారను. బిఆర్ఎస్‌లో బొడిగే శోభ, రేఖా నాయక్‌తో పాటు తనకు ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదని ప్రశ్నించారు. మహిళలను బిఆర్ఎస్‌లో ఎదగనివ్వరని ఆమె విమర్శించారు. తనపై సోషల్ మీడియాలో చేసిన ప్రచారాన్ని మహిళా కమిషన్ సుమోటాగా తీసుకున్నదన్నారు. తాము బిఆర్ఎస్ నేతల మాదిరిగా సోషల్ మీడియాను దుర్వినియోగం చేయడంలేదన్నారు. బతుకమ్మ పండుగకు మహిళలకు ఏమి ఇవ్వాలనేది ఇంకా నిర్ణయం తీసుకోలేదని ఆమె ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు.

## ఎలక్ట్రిక్ వాహనాలే (మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర డిప్యూటి సిఎంకు, అధికారులకు ఘనస్వాగతం పలికారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తోషిబా ఉత్పత్తుల సేవలను వారు వివరించారు. ప్రధానంగా ఎలక్ట్రానిక్ వస్తువుల ఉత్పత్తి కంపెనీ అయిన తోషిబా ఇప్పుడు పర్యావరణహిత సోలార్ ఉత్పత్తులలో అగ్రగామిగా ఉందని వివరించారు. ముఖ్యంగా, సోలార్ విద్యుత్తులో వినియోగించే ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ, ఫ్యూయల్ సెల్, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ టెక్నాలజీ, శక్తివంతమైన జనరేటర్లు, జీరో కార్బన్ ఎమిషన్ టెక్నాలజీలను వృద్ధి చేశామని సంబంధిత వివరాలను తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణలో పెద్ద ఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నామని, దీనికి ఫోటో వోల్టాయిక్ మాడ్యూల్స్ కూడా పెద్ద సంఖ్యలో కావలసి ఉందని, అలాగే రానున్న కాలంలో ఫ్యూచర్ సిటీలో ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ వినియోగం ఎక్కువగా ఉంటుందని, రాష్ట్రంలో సంబంధిత యూనిట్‌లను ఉమ్మడి భాగస్వామ్యంతో ఏర్పాటు చేయడానికి ముందుకు రావాలని కోరారు. విద్యుత్ ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించే ఆధునిక జనరేటర్లు, విద్యుత్ పొదుపు, నిల్వ ఉత్పత్తులు, విద్యుత్ వాహనాల బ్యాటరీలు, సంబంధిత సేవలు తెలంగాణలో అవసరమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పెట్టుబడులతో తరలిరావాలని ఆయన సూచించారు. తెలంగాణను ఎలక్ట్రానిక్ హబ్ గా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఎలక్ట్రికల్ వెహికల్స్ కి అగ్రస్థానం ఉంటుందని పేర్కొన్నారు.

**తెలంగాణలో తోషిబాను మరింతగా విస్తరిస్తాం**

రాష్ట్ర డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క సూచన మేరకు తోషిబా అధికారులు స్పందిస్తూ భారతదేశంలో కేవలం మూడు రాష్ట్రాల్లో మాత్రమే తాము తమ యూనిట్లను ప్రారంభించామని, దీనిలో తెలంగాణ ప్రముఖమైందన్నారు. తెలంగాణ రాష్ట్రం పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ఎంతో అనుకూలంగా ఉన్నందున స్వయంగా కానీ రాష్ట్ర ప్రభుత్వంతో ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ తెలంగాణలో తమ పరిశ్రమలను విస్తరించేందుకు సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుత ఈవీ వెహికల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని మరింతగా పెంచుతామని, ప్లాంట్ విస్తరణకు ప్రయత్నిస్తామని తోషిబా అధికారులు తెలిపారు. అనంతరం భట్టి విక్రమార్క ఇతర అధికారుల బృందం బుల్లెట్ ట్రెయిన్ ద్వారా అక్కడికి సుమారు 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒసాకా పట్టణానికి వెళ్ళి అక్కడ ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ పానాసోనిక్ ప్రధాన కార్యాలయాన్ని, పరిశ్రమలను సందర్శించనున్నారు.

**ప్రజా రవాణాలో జపాన్ బుల్లెట్ ట్రైన్ ప్రపంచానికే ఆదర్శం**

ప్రజా రవాణా వ్యవస్థలో జపాన్ ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుందని శ్రీ భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. టోక్యో నగరం నుంచి ఆయన బుల్లెట్ ట్రైన్ లో మధ్యాహ్నం ఒసాకా పట్టణానికి బయలుదేరారు. 700 కిలోమీటర్ల పొడవైన ఈ రైలుమార్గాన్ని కేవలం 2 గంటల 20 నిమిషాలలో బుల్లెట్ ట్రైన్ ద్వారా చేరుకున్నారు. ప్రయాణం ఎంతో సౌకర్యవంతంగా సాగిందని, ట్రైన్ లో సౌకర్యాలు ఎంతో బాగున్నాయని ఈ తరహా రవాణా వ్యవస్థను తెలంగాణలో కూడా అభివృద్ధి పరచడానికి పూనుకోవాలని రైల్వే శాఖను కోరనున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు.

# బాపూఘాట్ వద్ద గాంధీకి సిఎం ఘన నివాళి

ప్రజాపక్షం /హైదరాబాద్ : జాతిపిత మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా ఆయనకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళ్లు అర్పించారు. లంగర్‌హౌజ్ లోని బాపుఘాట్ వద్దగల మహాత్మాగాంధీ సమాధి వద్ద మంగళవారం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ దంపతులు, ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, తుమ్మల నాగేశ్వర రావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, జూపల్లి కృష్ణారావు, కొండ సురేఖ, ప్రభుత్వ సలహాదారులు కేశవ రావు, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపి రఘువీర్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు, ఎంఎల్‌సి బి.మహేష్ కుమార్‌గౌడ్, ఎంఎల్‌సి మహేందర్‌రెడ్డి మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి ,మాజీ ఎంపి హనుమంత రావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డిజిపి డాక్టర్ జితేందర్, జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి ఉన్నతాధికారులు, జిహెచ్‌ఎంసి, వివిధ శాఖల అధికారులు, మహాత్మాగాంధీకి నివాళులు అర్పించారు.అనంతరం గాంధీ మ్యూజియంలో ఏర్పాటు చేసిన సర్వమత ప్రార్థనలో సిఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులు పాల్గొన్నారు.



**గాంధీభవన్‌లో :** మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం గాంధీభవన్‌లో ఆయనకు చిత్రపటానికి పలువురు కాంగ్రెస్ నేతలు నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాకి ముఖ్యఅతిథలుగా విచ్చేసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదాన కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎంపిలు, ఎంఎల్‌ఎలు, రాష్ట్రసేవాదళ్ కార్యవర్గం జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు పాల్గొన్నారు.

**బిజెపి రాష్ట్ర కార్యాలయంలో :** జాతిపిత మహాత్మాగాంధీకి బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం బిజెపి శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి నివాళులర్పించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి అహింస మార్గాన్ని చూపించి, ఆచరించి ప్రపంచానికే శాంతి దూతగా నిలిచిన మహాత్మగాంధీ సిద్ధాంతాలు, ఆదర్శాలు దేశ ప్రజలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని గాంధీజీని గుర్తుచేసుకున్నారు.

**తెలంగాణ భవన్‌లో :** మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా వారికి బిఆర్‌ఎస్ నేతలు నివాళ్లు అర్పించారు. బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యాలయం తెలంగాణ భవన్‌లో మంగళవారం గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రిల చిత్రపటాలకు బిఆర్‌ఎస్ కార్యనిర్వహక అధ్యక్షులు కె.తారక రామారావు,మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, ఎంఎల్‌సిలు,ఎంఎల్‌ఎలు, పార్టీ సీనియర్ నాయకులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# వయోవృద్ధులు మానవ వనరులకు సంకేతాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



ప్రజాపక్షం / హైదరాబాద్ : భారత జాతి పిత మహాత్మా గాంధీ 155వ జయంతి సందర్భంగా హైదరాబాద్ కొండాపూర్ లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా గాంధీ చిత్రపటానికి సిఆర్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్‌ఎ పల్లా వెంకటరెడ్డి, చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి. సిఆర్ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వర రావు ఆకాంక్షలకు అనుగుణంగా 1999 అక్టోబర్ 2వ తేదీన సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రాజకీయాలకు అతీతంగా మహాత్మా గాంధీ జయంతిన వృద్ధాశ్రమం ప్రారంభించు కొని నేటికి 25 ఏళ్ల పూర్తి చేసుకుందన్నారు. వయోవృద్ధులు అంటే అమూల్యమైన మానవ విలువలకు, మానవ వనరులకు సంకేతమని, వారిని కాపాడుకోవటమే గొప్ప సందేశమని పేర్కొన్నారు. సిఆర్ ఫౌండేషన్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో సమాజంలో పలు రూపాల్లో, వివిధ రంగాలలో సేవలందించినవారు అశ్రయం పొందడం సంతోషకరమన్నారు.సిఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న నిర్వాహకులకు, సహకరిస్తున్న అందరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.సి ఆర్ ఫౌండేషన్ కోశాధికారి, వృద్ధాశ్రమం డైరెక్టరు వి. చెన్నకేశవరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె రజిని ,వృద్ధాశ్రమం సలహామండలి సభ్యులు డాక్టర్ మండవ గోపీచంద్ , రాజేందర్‌రావు, తమ్మారెడ్డి తాన్యా ,వృద్ధాశ్రమ వాసులుసీనియర్ జర్నలిస్టు ఎ.బి.కె. ప్రసాద్, డాక్టర్ సరస్వతి , మల్లంపాటి వెంకటేశ్వర రావు , హోమ్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు మహాత్మా గాంధీకి పుష్పాంజలి ఘటించి ఘనమైన నివాళులు అర్పించారు.

# హైడ్రాను నడిపిస్తున్న రాహుల్‌గాంధీ

### కొండా సురేఖ దొంగ ఏడుపులు దేనికి : కెటిఆర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : తమ పార్టీ తరపున మంత్రి కొండా సురేఖపై ఎవ్వరు మాట్లాడలేదని, ఆమె దొంగ ఏడుపులు, పెడబొబ్బలు దేనికని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. హీరోయిన్ల ఫోన్లను ట్యాపింగ్ చేశారని గతంలో కొండా సురేఖ చేసిన ఆరోపణలతో తమ ఇంట్ల మహిళలు బాధపడ లేదా? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం జర్నలిస్టులతో కెటిఆర్ ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తమపైన కూడా సోషల్ మీడియాలో ట్రోలింగ్ పేరుతో దాడి చేశారన్నారు. కొండా సురేఖ గతంలో మాట్లాడిన బూతు మాటలను గుర్తు తెచ్చుకోవాలన్నారు. మంత్రి వెంకట్ రెడ్డికి మూసీ గురించి అవగాహన లేదని, ఆయనకు ఏం తెలువదని ఎద్దేవాచేశారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి దమ్మంటే మూసీ పరివాహాక ప్రాంతాల్లో పర్యటించి, ప్రజలను ఒప్పించాలని సూచించారు. ఎస్‌టిపిలు పూర్తయిన తర్వాత మూసీలో మురికి నీళ్ల ప్రక్షాళణ అవుతాయన్నారు. డబ్బుల సంచుల కోసమే రాహుల్‌గాంధీ మూసీప్రాజెక్ట్ నిర్మాణానికి అనుమతినిచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో హైడ్రాను నడిపిస్తున్నది సిఎం రేవంత్ రెడ్డి కాదని, ఢిల్లీలోని రాహుల్ గాంధీ అని అన్నారు. డబ్బుల కోసమే రాహుల్ గాంధీ మూసీ ప్రాజెక్టు చేపట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ అధిష్టానానికి మూసీ నోట్ల కట్టలు కావాలి. కానీ మూసీ బాధితులు కష్టాలు పట్టవా? అని ప్రశ్నించారు. మూసీ ప్రాజెక్ట్‌ను ఏ కాంట్రాక్టర్‌కు ఇస్తారో తమకు తెలుసని, ఆ వివరాలను కూడా తాము త్వరలోనే బయటపెడుతామని చెప్పారు. ఇది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, మూసీ లూటీఫికేషన్ అని ఎద్దేవా చేశారు.

**సురేఖ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి: సత్యవతిరాథోడ్**

బిఆర్‌ఎస్, కెటిఆర్‌ను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను బిఆర్‌ఎస్ మహిళా నాయకులు ఖండించారు. ఆమె తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, లేదంటే కొండా సురేఖ ఇలాంటి వ్యాఖ్యలు మానుకోవాలి పరువు నష్టందావా వేస్తామని హెచ్చరించారు.హైదరాబాద్‌లోని తెలంగాణభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సత్యవతిరాథోడ్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ అధికారంలో వుంటే మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేసేవారిమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలపై జరుగుతున్న దాడులపై మంత్రులు కొండా సురేఖ, సీతక్క ఎందుకు మాట్లాడం లేదని ప్రశ్నించారు. కొండా సురేఖపై జరిగిన ట్రోల్ పైన మాజీ మంత్రి హరీష్ రావు ఖండించారని గుర్తు చేశారు. మాజీ ఎంపి మాలోత్ కవిత మాట్లాడుతూ సినీనటుడు నాగార్జున,సమంతను ఎన్ని సార్లు రోడ్డుకు ఈడుస్తారని ప్రశ్నించారు. హైడ్రాతో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్‌ను పడిపోకుండా కాపాడేందుకే మంత్రులు కొండా సురేఖ,సీతక్కతో మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ మాట్లాడుతూ కొండాసురేఖపైన ట్రోల్ చేసిన వారిపైన రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.

# కెటిఆర్ వల్లే నాగచైతన్య, సమంత విడాకులు

ప్రజాపక్షం/హైదరాబాద్ : కెటిఆర్ కారణంగానే సినీహిరో నాగచైతన్య, సమంత విడాకులు తీసుకున్నారని అటవీశాఖ మంత్రి కొండా సురేఖ ఆరోపించారు. కెటిఆర్ తీరుతోనే సినీ పరిశ్రమలో కొంతమంది ఇబ్బంది పడ్డారని, మరి కొందరు హీరోయిన్లు సినిమా ఫీల్డ్ నుంచి తప్పుకుంటే, ఇంకోందరు త్వరగా పెళ్లి చేసుకున్నారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం మంత్రి కొండాసురేఖ మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ మత్తు పదార్థాలకు అలవాటు పడి, వారిని కూడా మత్తు పదార్థాలకు అలవాటు చేసి,'రేవ్'పార్టీలు నిర్వహించి, వారి జీవితాలతో ఆడుకున్నారని, వారిని బ్లాక్ మెయిలింగ్‌కు పాల్పడ్డారని ఆరోపించారు. సినీ పరిశ్రమలో ఇది బహిరంగ రాహస్యమని వ్యాఖ్యానించారు. "నేను ఎందుకు దొంగ ఏడుపు ఏడుస్త..బిఆర్‌ఎస్ ,మీ ఫోటోలు ఉన్న సోషల్‌మీడియాలో నాపైన నామీద అసభ్యకరమైన పోస్టులు పెడుతరు..కామెంట్లు ఉంటాయి. దీనిపైన హరీశ్‌రావు స్పందించారు.. కానీ ..బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కెటిఆర్ ఎందుకు స్పందించలేదు..కామెంట్లు చేసిన వారి పైన చర్యలు తీసుకోవాల్సిన అసవరం ఉంది..దుబాయ్ నుంచి మూడు ఖాతాల ద్వారా ఈ కామెంట్లు చేస్తున్నారు...విజయలక్ష్మి, సీతక్క పైన,ఇప్పుడు నాపైన కామెంట్లు చేశారు. మీకు మనుషుల గురించి, అనుబంధాల గురించి ఏమైనా అవగాహన ఉన్నదా?" అని మంత్రి కొండాసురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**మహిళలను కించపర్చడం కెటి-ఆర్‌కు ఫ్యాషన్ : మంత్రి సీతక్క**



ప్రజాపక్షం/హైదరాబాద్ : పండగల పూట మహిళలు, మహిళా మంత్రులను కించపర్చడం కెటిఆర్‌కు ఫ్యాషన్‌గా మారిందని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) విమర్శించారు. ఎంగిలిపూల బతుకమ్మ రోజే కెటిఆర్ గలీజ్ మాటలు వినాల్సి రావడం తమ దురదృష్టకరమని, బతుకమ్మ మొదటి రోజు చిట్ చాట్ పేరుతో కెటిఆర్ తమ గురించి చులకనగా మాట్లాడారని, ఇదే విషయాన్ని మీడియా ద్వారా బహిరంగంగా చెబితే, మహిళలే ఆయనకు బుద్ధి చెప్పేవారని సీతక్క బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాఖీ పండగ రోజు బస్సుల్లో మహిళలు బ్రేక్ డాన్సులు చేసుకోవచ్చని కెటిఆర్ వ్యాఖ్యలు చేశారని, మహిళా మంత్రులను కూడా ఆయన పదే పదే కించపరుస్తూ తన దొర, దురహంకారాన్ని చాటుకున్నారని మండిపడ్డారు. చాటుమాటుగా నాలుగు గోడల మధ్య మాట్లాడటం కాదని, ధైర్యముంటే బహిరంగంగా మాట్లాడాలని డిమాండ్ చేశారు. తానేప్పుడూ వ్యక్తిగతంగా ఎవరిని దూషించలేదని, దూషణలకు, భూతులకు బ్రాండ్ అంబాసిడరే 'మీరు' అని అన్నారు. తాను కెటిఆర్‌ను వ్యక్తిగతంగా దూషించినట్లు ఆధారాలు చూపిస్తావా అని ప్రశ్నించారు. రాజకీయాల్లో తాము ఉండకూడదన్న లక్ష్యంతోనే బిఆర్‌ఎస్ సోషల్ మీడియా ద్వారా తమపైన పదే పదే అభ్యంతరకర కామెంట్స్ చేయిస్తున్నారని, కనీసం సొంత సోషల్ మీడియాను కట్టడి చేయాలన్న సభ్యత కెటిఆర్‌కు లేదని మండిపడ్డారు. కెటిఆర్ ఇలాగే రెచ్చిపోతే భవిష్యత్‌లో కుటుంబ సభ్యులు తలదించుకోవాల్సి వస్తుందని మంత్రి సీతక్క హెచ్చరించారు.

# అన్నదాతలను రుణవిముక్తి చేసిన ఘనత కాంగ్రెస్‌దే



ప్రజాపక్షం /హైదరాబాద్ : దేశానికి అన్నం పెడుతున్న అన్నదాతలను రుణ విముక్తి చేసినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బిజెపికి లేదని టిపిసిసి కార్యనిర్వహాక అధ్యక్షులు జగ్గారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో బిజెపికి రాజకీయంగా ఉనికి పెంచుకునేందుకు కాంగ్రెస్ మీద బురద జల్లె ప్రయత్నం చేస్తోందని, అందులో భాగమే ధర్నా చౌక్ వద్ద రైతు దీక్ష చేశారని అన్నారు. మంగళవారంఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్.. రాహూల్ గాంధీ ఇచ్చిన రుణ మాఫీ హామీ ప్రకారం అధికారం చేపట్టిన 8 నెలల కాలంలోనే ఆర్థికంగా ప్రభుత్వం ఇబ్బందుల్లో ఉన్నా... సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రూ.31 వేల కోట్ల రుణమాఫీకి తీర్మానం చేసి ఇప్పటికే రూ.18 వేల కోట్లు బ్యాంకుల ఖాతాలో వేశారన్నారు. మిగిలినవి డాటా సరిగా లేక ఆలస్యం అవుతోందని, దీంట్లో దాచుకునేది ఏముందని ప్రశ్నించారు. ప్రధాన నరేంద్ర మోదీ ఎన్నికల సమయం లో నల్లధనం వెనక్కి తెచ్చి ప్రతీ పేదవాడి అకౌంట్ లో వేస్తా అని చెప్పలేదా? మరి 11 ఏళ్లుగా అధికారంలో ఉన్నా పేదల అకౌంట్ లోకి చిల్లి గవ్వ వేశారా చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పారని, దీని ప్రకారం 22 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండే మరి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలన్నారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్నారు, చేశారా ? దేశ రైతుల నడ్డి విరిచేలా నల్ల చట్టాలు తెచ్చింది నిజం కాదా..? దీక్షలు చేస్తున్న రైతులను తొక్కి చంపిన చరిత్ర మీది కాదా అని ప్రశ్నించారు. ధరలు తగ్గిస్తామని చెప్పి.. డబుల్ చేశారు నిజం కాదా..?మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు తులం బంగారం రూ.28 వేలు..మోడీ అధికారంలోకి వచ్చాకా.. లక్ష తులం అయ్యింది.వీటికి తెలంగాణా బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.బిజెపి నేతలు నటనలో పుట్టి..నటనలోనే పెరిగరాని, సినిమా వాళ్ళు మేకప్ వేస్తారు..కానీ బిజెపి నేతలు ఏం వేయని డ్రామా ఆర్టిస్టులని ఎద్దేవా చేశారు.

**అసలే కొండా సురేఖ ఫైర్..**

అసలే కొండా సురేఖ ఫైర్ అని, ముట్టుకోకుంటే ఆమె ఎవరి జోలికి పోదు, తెలిసి కూడా అమె జోలికి ఎందుకు వెళ్లావు కెటిఆర్..అని జగ్గారెడ్డి అన్నారు. కొండా సురేఖ ది తప్పే లేదని, కెటిఆర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. మీ పార్టీలో కేసీఆర్,కేటీఆర్ లకు దండలు వేసిన ఆడవాళ్ళను అలాగే చూస్తారా..?ఇంత పరిజ్ఞానం కూడా బిఆర్‌ఎస్‌కి లేక పోవడం బాధ కారమన్నారు.

# ఈ ఏడాది 842 ఎక్సైజ్ కేసులు

### '1445 మంది అరెస్ట్'

### ఎక్సైజ్ శాఖ అంటేనే నిందితుల వెన్నులో వణుకు పుట్టాలి -అధికారుల సమీక్ష సమావేశంలో : విబి కమలాసన్‌రెడ్డి





ప్రజాపక్షం/హైదరాబాద్ : చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి ఎక్సైజ్ శాఖ అంటేనే వెన్నులో వణుకు పుట్టేలా తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి.కమలాసన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని ఆబ్కారీభవన్‌లో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో సెప్టెంబర్ నెల జరిగిన క్రైమ్, నమోదు చేసిన కేసులు, పట్టుకున్న గంజాయి, డ్రగ్స్‌పై ఉన్నతాధికారులతో ఆయన సమీక్షించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మొత్తం 842 ఎక్సైజ్ కేసులు నమోదు కాగా అందులో 1445 మంది నిందితులను అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబరు మాసంలోనే దూల్‌పేటలో 43 కేసులు నమోదు చేసి అందులో 134 మందిని అరెస్టు చేశామని, 715 కేజీల గంజాయిని, 364 వాహనాలు సీజ్ చేశామని వివరించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టడానికి నిరంతరం పట్టు బిగిస్తూ క్రమంగా పైచేయి సాధిస్తున్న ఎక్సైజ్ శాఖ, ఒకే నెలలో భారీ మొత్తంలో గంజాయి, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకోవడం, దూల్‌పేట్‌లో గంజాయి మూలాలను తుద ముట్టించడం, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ రవాణాకు కళ్లెం వేయడం పట్ల తమ శాఖ సిబ్బందిని, అధికారులను కమలాసన్‌రెడ్డి అభినందించారు. ఖమ్మం, దూల్‌పేట్‌తో పాటు వివిధ జిల్లాల్లో భారీగా గంజాయి పట్టుబడడం, హైదరాబాద్ మహానగరంలో పలు ప్రాంతాల్లో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల పనితీరును పరిశీలించారు. సెప్టెంబరు నెలలో ప్రధానంగా పెద్ద అంబర్‌పేట్‌లో 170 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకోవడం, బంజారా హీల్స్, మాదాపూర్ ప్రాంతాల్లో ఉన్న పబ్బుల్లో తనిఖీలు నిర్వహించి, పబ్బుల్లో డ్రగ్ వినియోగించిన నలుగురిని గుర్తించారు. ఢిల్లీ, హర్యానా, గోవా ప్రాంతాలకు చెందిన మద్యం అంటు ఖరీదైన మద్యం బాటిళ్లలో కల్తీ మద్యం నింపి అమ్మకాలు జరుపడం, పసుపు పాకెట్లలో గంజాయి అమ్మకాలు చేపట్టడం లాంటి కేసులను పట్టుకోవడం పట్ల డైరెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. మరో వైపు ట్రిబుల్ ఐటి చదువుతున్న విద్యార్థులు, ఐటి ఉద్యోగం చేస్తున్న వ్యక్తి డ్రగ్స్‌కు బానిసగా మారి, చివరకు డ్రగ్స్ అమ్మకందారుడిగా మారి ఎక్సైజ్ పోలీసులకు చిక్కడం, ముగ్గురు వ్యక్తులు మూడు రకాల డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ పట్టుబడడం, రాజస్థాన్‌కు చెందిన వ్యక్తి హైదరాబాద్‌లో స్థిరపడి, వ్యాపారం చేస్తూ, ఆ వ్యాపారంలో కలిసి రాకపోవడంతో బెంగూళూరు నుంచి డ్రగ్స్ తీసుకవచ్చి హైదరాబాదులో అమ్మకాలు చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడడంతో పాటు, జూబ్లీహిల్స్ లోని ఒక కేఫ్‌లో ఐస్ క్రీమ్ తయారీలో విస్కీ కలుపుతూ పట్టుపడడం కొస మెరుపుగా నిలిచాయి. వీటన్నంటితో పాటు గోవాకు టూరిస్టులుగా వెళ్లి తిరుగు ప్రయాణంలో మూడు విమానాల్లో రూ.12 లక్షల విలువ చేసే 415 ఖరీదైన మద్యం బాటిళ్లను తీసుకు రాగా రాజీవ్ గాంధీ విమానాశ్రయం లో జరిపిన తనిఖీల్లో వారిని పట్టుకున్నట్లు అధికారులు వివరించారు.

# భవిష్యత్ తరాల ఆరోగ్యానికే 'పోషణ్ మహ్ 24'

### పిల్లలకు బాలామృతం ప్లస్ తప్పకుండా అందించాలి -రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు




ప్రజాపక్షం/మంథని:భవిష్యత్ తరాల ఆరోగ్యం కోసమే పోషణ మహ్ 24ను కట్టుదిట్టంగా అమలు చేయాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని శివకిరణ్ గార్డెన్స్‌లో నిర్వహించిన పోషణ్ మహ్ 24 ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. పుట్టిన పిల్లల నుంచి ఆరు ఏండ్ల వయస్సు వరకు పౌష్టికాహారం అందించడం ద్వారానే ఆరోగ్యవంతమైన పిల్లలుగా తయారవుతారని అన్నారు. పిల్లలకు మంచిపోషకాలు అందించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. జిల్లాలోని అర్బన్ గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీ మహిళలకు సేవలు అందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అనేక కార్యక్రమాల అమలులో అంగన్‌వాడీలు, సహాయాకులు కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో దేశమంతా లాక్‌డౌన్ విధిస్తే క్షేత్రస్థాయిలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌లా పని చేసి కరోనా పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఇంటింటికి ప్రచారం చేశారని ఆయన కొనియాడారు.రాబోయే రోజుల్లో అంగన్‌వాడీ టీచర్లకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన చెప్పారు. ఐసీడీఎస్‌లో ఎక్కడైనా అంగన్‌వాడీ టీచర్లు,సహాయకుల పోస్టులు ఖాళీగా ఉంటే వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు.అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారం నాణ్యతలో ఎక్కడా లోపం జరుగవద్దని, అందరికి పౌష్టికాహారం సమగ్రంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.అంగన్‌వాడీ టీచర్లు, సహాయకుల ఆరోగ్య పరిస్థితులను చెక్ చేసేందుకు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతపై సదస్సుల నిర్వహణ, ఎటువంటి ఆహారంలో ఏ పోషకాలు ఉంటాయనే విషయాలపై అవగాహన కల్పించాలని, అదే విధంగా పోషక లోపం ఉన్న పిల్లలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను పూర్వ విద్యా కేంద్రాలుగా మారుతున్నాయని, కరదీపిక, ప్రియ దర్శిని ప్రకారం పిల్లలకు ఆట పాటలతో పాటు బోధన అందించాలన్నారు. ప్రతి రోజు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం బోధన జరుగాలని ఆయన అన్నారు.ప్రతి బుధవారం పోషక లోపం ఉన్న పిల్ల తల్లిదండ్రులకు పిల్లలకు అందించాల్సిన పోషకాహారం, పాటించాల్సిన శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో అనాథ పిల్లలు, సెమీ అర్బన్ పిల్లల జాబితా ఉంటే సేకరించి సమర్పించాలన్నారు.పిల్లల ఎదుగుదలను రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని, ప్రతి పిల్లవాడి ఎత్తు, బరువు పరిశీలించి సరైన వివరాలు నమోదు చేయాలని, పోషక లోపాలు ఉంటే బాలామృతం తప్పనిసరిగా అందించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు అనేమియా ఉంటే అవసరమైన పోషకాహారం, మందులు అందజేయాలన్నారు.అంతకు ముందు గార్డెన్‌లో ఏర్పాటు చేసిన అన్నప్రాసన, అక్షరాభ్యాసం,శ్రీమంతం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ పెండ్రి రమా సురేష్‌రెడ్డి, ఆర్డీఓ హనుమానాయక్, జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్‌ఖాన్‌తో పాటు స్థానిక కౌన్సిలర్‌లు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశాన్ని అతలాకుతలం చేస్తున్న అతిపెద్ద 'దుష్ట శక్తి' బిజెపిః సంజయ్ సింగ్



ప్రజాపక్షం/హైదరాబాద్ : ప్రజల బాగోగులను పట్టించుకోకుండా తన స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్రిక్తతలను రెచ్చగొడుతూ దేశాన్ని అతలాకుతలం చేస్తున్న బిజెపి అతిపెద్ద 'దుష్ట శక్తి' అని, లౌకిక ప్రజాతంత్ర వాదులందరు ఏకమై బిజెపిని తరిమికొట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ పార్లమెంట్ సభ్యులు సంజయ్ సింగ్ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని లిబర్టీ ఆప్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర వ్యాప్త వాలంటీర్ల సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఆప్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అధ్యక్షత వహించగా ఆప్ తెలంగాణ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా. సోలొమన్ రాజ్, ఎంఏ. మజీద్ తదితరులు వేదికపై ఆసీనులైనారు. రాజ్యాంగ విరుద్ధంగా కార్పొరేట్ లకోసమే పాలనా కొనసాగిస్తూ, పేదల బాధలు పట్టించుకోకుండా బీజేపీ దేశాన్ని నాశనం చేస్తుందని, దేశానికి ప్రమాదకరంగా మారిన బీజేపీ ను అంతమొందించడానికి దేశవ్యాప్తంగా బలమైన ఉద్యమాలు నిర్మించాలని అయన కోరారు. భారతదేశ చరిత్రలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాజకీయ పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ అని, ఢిల్లీ, పంజాబ్ లలో ఇప్పటికే పాలనా కొనసాగిస్తుందని, ఆప్ తన రెక్కలను ఇతర రాష్ట్రాలకు విస్తరించేందుకు తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఆప్ బలమైన శక్తిగా ఎదగడానికి క్షేత్ర స్థాయి నుండి కృషి చేయాలనీ సంజయ్ సింగ్ ఆప్ శ్రేణులకు పిలుపునిచ్చారు.




రవీంద్ర భారతిలోని భాష, సాంస్కృతిక శాఖ కార్యాలయములో బుధవారం'బతు-కమ్మ ఫోటోగ్రఫీ పోటీలు - 2024 ' గోడ పత్రికను శాఖ సంచాలకులు మామిడి హరి కృష్ణ తో కలిసి సిగ్మా అకాడమీ చైర్మన్ ఎం.సి.శేఖర్, అకాడమీ సెక్రటరీ కె.జనార్ధన్ పత్రికలకు విడుదల చేశారు.

# మహాత్మాగాంధీకి ముగ్ధూం భవన్‌లో సిపిఐ నాయకులు ఘననివాళి



ప్రజాపక్షం /హైదరాబాద్ : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యాలయంమగ్ధూంభవన్‌లో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ ఘనంగా నివాళ్లు అర్పించింది. సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, పశ్య పద్మ, జాతీయ కౌన్సిల్ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు,సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కలపల్లి శ్రీనివాసరావు,సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పశ్య పద్మ, కలవేణు శంకర్, భాగం హేమంతరావు, వి.ఎస్.బోస్, ఈటి నరసింహులు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# భద్రతలేని సిపిఎస్‌ను రద్దు చేయాలి

### తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం




ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో ఉద్యోగ భద్రత లేని సి.పి.ఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా లింగమొల్ల దర్శణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో సీపీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా లింగమొల్ల దర్శణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ భాస్కర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులుగా లింగమొల్ల దర్శణ్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా విజయ్ భాస్కర్ మాట్లాడారు. రాష్ట్రంలోని రెండు లక్షల 50 వేల పై చిలుకు సి.పి.ఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్ష సి.పి.ఎస్ విధానాన్ని రద్దుచేసి,పాతపెన్షన్ పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రాజస్థాన్ ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలలో సి.పి.ఎస్ విధానం రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించారని గుర్తు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రాగానే సి.పి.ఎస్ విధానాన్ని రద్దు చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టడం హర్షనీయమన్నారు.

# ఫోకస్

## హాస్య నటుడి కష్టాల గాథ..


చార్లీ చాంప్లిన్‌తో జాకీ కూగన్



చార్లీ చాప్లిన్‌తో కలిసి పలు చిత్రాల్లో నటించిన బాల నటుడు, ఆ తర్వాత హాస్య నటుడిగా స్థిరపడి, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న జాకీ కూగన్ జీవితం మొత్తం పూలపానుమేమీ కాదు. ఎంతటి పేరుప్రఖ్యాతులు, డబ్బు, ఆస్తులు సంపాదించినా, నా అనుకున్న వారే మోసం చేయడంతో మానసికంగా కుంగిపోయాడు. లాస్ ఏంజిల్స్‌లోని 'ఓర్ఫియం' థియేటర్‌లో ఓ కళాప్రదర్శనలో పాల్గొన్న బాలుడు కూగన్ నటన ప్రఖ్యాత హాస్యనటుడు చార్లీ చాప్లిన్‌ను విపరీతంగా ఆకట్టుకుంది. ఆ పిల్లవాడు అద్భుతంగా టాన్స్ చేసేవాడు. అనుకరించడంలో దిట్ట. చాప్లిన్ అతనికి 'ఎ డేస్ ప్లెజర్' (1919) చిత్రంలో ఒక చిన్న పాత్ర ఇచ్చాడు. అనంతరం మూకీ హాస్య చిత్రం 'ది కిడ్' (1921)లో కీలక పాత్రకు ఎంపిక చేశాడు. ట్రాంప్ అనే పాత్ర పర్యవేక్షణలో పెరిగి, క్రమశిక్షణ కోల్పోయిన బాలుడిగా కూగన్ అద్భుతంగా నటించాడు. 1922లో, ఫ్రాంక్ లాయిడ్ దర్శకత్వం వహించిన 'ఆలివర్ ట్విస్ట్'లో కూగన్ టైటిల్ పాత్రలో నటించాడు. ఆ తర్వాత అతనికి వెనుదిగిరి చూసుకోవాల్సిన అవసరం లేకపోయింది. బాల నటుడిగానేగాక, హాస్య నటుడిగానూ పేరుప్రఖ్యాతులు ఆర్జించాడు. ఆ రోజుల్లోనే 3 నుంచి 4 మిలియన్ డాలర్లు సంపాదించాడంటే, కూగన్ ఎంత తీరిక లేకుండా నటించాడో ఊహించుకోవచ్చు. కేవలం పది సంవత్సరాల వయసు వరకూ చదువును కొనసాగించిన అతను, ఆ తర్వాత సినిమానే ప్రపంచంగా జీవించాడు. శారీరకంగా, మానసికంగా ఎంతటి శ్రమకు గురైనప్పటికీ, నటనే ఊపిరిగా ముందుకు సాగుతున్న అతను తన 22 ఏట తండ్రి, రంగస్థల నటుడు జాన్ హెన్రీ కూగన్‌ను కోల్పోయాడు. 1933 నవంబర్‌లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో తండ్రితోపాటు తన స్నేహితుడు, తోటి నటుడు జూనియర్ దర్కిన్, నటుడు, రచయిత రాబర్ట్ జూనియర్ హోమర్, ఉద్యోగి చార్లెస్ జోన్స్‌ను కూడా కూగన్ పోగొట్టుకున్నాడు. ఆ ప్రమాదం నుంచి అతనొక్కడే బయటపడ్డాడు. తండ్రి మృతి చెందాడన్న బాధను మరచిపోకముందే, తల్లి లిలియన్ రీటా మరో పెళ్లి చేసుకుంది. సవతి తండ్రి ఆర్థర్ బార్న్‌స్టైయిన్ పూర్తి పెత్తనం తన చేతుల్లోకి తీసుకున్నాడు. కూగన్ సంపాదించిన మొత్తాన్ని ఇష్టానుసారంగా ఖర్చు చేసేవాడు. జల్సాలకు అలవాటుపడి, సంపదను హరించివేయడం మొదలు పెట్టాడు. జరుగుతున్న తంతును అర్థం చేసుకొని కూగన్ అతనిపై కోర్టులో కేసు వేశాడు. పోయిందిపోగా, అతను 1,25,000 డాలర్లు మాత్రమే దక్కించుకోగలిగాడు. అయితే, 1939లో తీర్పునిచ్చిన కోర్టు పలు అంశాలను చర్చించింది. ముఖ్యంగా బాల నటుల పనివేళలు, వారు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు, వారి సంపాదన గురించి కూడా పరిశీలించింది. బాల నటుల సంపాదనలో కనీసం 15 శాతాన్ని ట్రస్టు కింద ఉంచి, వారు పెద్దయిన తర్వాత తిరిగి ఇవ్వాలని తీర్పునిచ్చింది. కోర్టు తీర్పు ఫలితంగా 'కాలిఫోర్నియా చైల్డ్ యాక్టర్స్ బిల్లు అమల్లోకి వచ్చింది. దీనినే కూగన్స్ యాక్ట్ అని కూడా పిలుస్తారు. బాల నటుల జీవితాలకు భద్రత కల్పించే ఈ చట్టం కూగన్ కారణంగా వచ్చింది. 1914 అక్టోబర్ 26న జన్మించిన అతను, 1984 మార్చి ఒకటో తేదీన, తన 69వ ఏట మరణించాడు. భౌతికంగా దూరమైనప్పటికీ, కూగన్స్ చట్టం రూపంలో అతను ఎప్పటికీ కళాకారుల మధ్యలోనే ఉంటాడు. ఎంతటి పేరుప్రఖ్యాతులు ఆర్జించినా, ఎన్ని ఆస్తులను కూడబెట్టినా, హితం కోరేవారు లేకపోతే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో, మానసికంగా ఎంతగా కుంగతీస్తుందో చెప్పడానికి కూగన్ జీవితమే నిదర్శనం.

## నాటకానికే కాదు.. సినిమాకూ బ్రహ్మరథమే

కళారంగం

'చిల్లరకొట్టు చిట్టెమ్మ' నాటకానికేకాదు.. సినిమాకు కూడా ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 47 సంవత్సరాల క్రితం, 1977, అక్టోబర్ 7న మురళీమోహన్, జయచిత్ర, గోకిన రామారావు ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా విడుదలైంది. ఇందులో ట్రాన్స్ జెండర్ పాత్రధారికి వచ్చిన పేరుప్రఖ్యాతుల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'మాడా'గా అందరికీ సుపరిచితుడైన మాడా వెంకటేశ్వరరావు ఆ పాత్రకు ప్రాణప్రతిష్ఠ చేశాడు. ఇప్పటికే ట్రాన్స్ జండర్ అనే పదానికి పర్యాయపదంగా మారిపోయాడు. ఇప్పటికీ 'మాడా' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారంటే, ఆ పాత్రను అతను ఏ విధంగా పండించాడో ఊహించుకోవచ్చు. అప్పట్లో ఇది గొప్ప హిట్ సినిమా. 'చూడు పిన్నమ్మా పాడు పిల్లడు.. పైనపైన పడతనంటడు' అంటూ సాగే పాట నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అంతటా మారుమోగింది. బాలసుబ్రహ్మణ్యం ప్రతిభ ఈ పాటతో మరోసారి రుజువైంది. ఇంతటి ప్రజాదరణ పొందిన 'చిల్లర కొట్టు చిట్టెమ్మ' నిజానికి ఓ నాటకం. దాసం గోపాల కృష్ణ రాసిన ఈ నాటకాన్ని ఎన్నో వేదికలపై ప్రదర్శించిన రత్నకుమారి గొప్ప పేరు సంపాదించుకుంది. 'కళాభినేత్రి' వాణిశ్రీగా సినిమా ప్రేక్షకులకు దగ్గరయింది. 'చిల్లర కొట్టి చిట్టెమ్మ' సినిమాకి దాసరి నారాయణ రావు దర్శకత్వం వహించారు. సహజంగా తన చిత్రాలకు ఆయన స్వయంగా మాటలు, వీలైతే పాటలు కూడా రాసుకుంటారు. కానీ, ఈ నాటక సృష్టికర్త దాసం గోపాలకృష్ణకే సినిమాలోనూ పాటల బాధ్యతను అప్పచెప్పారు. స్టేజీ పైన వాణిశ్రీ పోషించిన చిట్టెమ్మ పాత్రకు జయచిత్ర న్యాయం చేయగలదా? అనే సందేహాలు తెరపైకి వచ్చాయి. వాణిశ్రీ దరిదాపుల్లోకి కూడా జయచిత్ర రాదని కొంత మంది జోశ్యం కూడా చెప్పారు. కానీ, అందరి అంచనాలను తారుమూరు చేస్తూ జయచిత్ర ఆ పాత్రను అత్యద్భుతంగా పోషించారు. ఆమె తప్ప ఈ పాత్రను మరెవరూ పోషించలేరని విమర్శకులు సైతం జయచిత్రకు కితాబునిచ్చారు. చిత్రంలో 'చూడు పిన్నమ్మ పాడు పిల్లడు'తోపాటు, 'ఏంటబ్బాయా.. ఇదేంటబ్బాయా', 'చీటికి మాటికి చిట్టెమ్మంటే చీపురు దెబ్బలు తింటవురో', 'సువ్వీ కస్తూరి రంగా.. సువ్వీ కావేటి రంగా' పాటలను దాసం గోపాల కృష్ణ రాశారు. మిగతా మూడు పాటలు, 'సుక్కల్లో పెద సుక్క చందమామా', 'తాటిచెట్టు తల్లీ కాదు.. తాగినోడు మొగుడూ కాదు', 'తల్లిగోదారికే ఆటుపోటుంటే తప్పుతుందా మనిషికి' పాటలు డాక్టర్ సి. నారాయణ రెడ్డి రాశారు. స్వరకర్త రమేష్ నాయుడు 'తల్లి గోదారికే..' పాటను తానే పాడాడు. నంది అవార్డును అందుకున్నాడు. రంగస్థలంపైన, ఆ తర్వాత సినిమాగా ప్రజాదరణ పొందిన నాటకాలల్లో 'కన్యాశుల్కం' మాదిరిగానే 'చిల్లరకొట్టు చిట్టెమ్మ' కూడా చరిత్ర సృష్టించింది. అక్టోబర్ మొదటివారంలో ఆ గొప్ప నాటకాన్ని, దాని ఆధారంగా తీసిన సినిమాను గుర్తుచేసుకోకతప్పదు.





దాసం గోపాలకృష్ణ



చార్లీ చాప్లిన్ తర్వాత ఆ స్థాయిలో గొప్ప కామెడీ కళాకారులుగా గుర్తింపు పొందిన ఘనత లారెల్–హార్డీ జోడీకి మాత్రమే దక్కుతుంది. నిన్నటి తరం వారికి వీరి పేరు సుపరిచితం. లారెల్ (పూర్తిపేరు స్టాన్ లారెల్) సన్నగా ఉంటే, హార్డీ (పూర్తి పేరు ఆలివర్ హార్డీ) ఊబకాయం. వీరిద్దరూ తెరపై పండించిన హాస్యం అనన్యసామాన్యం. 1932లో తీసిన ఈ అరుదైన ఫొటోలో (ఎడమ నుంచి కుడికి) హార్డీ, లారెల్‌తోపాటు మరో ఇద్దరు సుప్రసిద్ధ హాస్య నటులు జిమ్మీ డ్యూరాంటే, బస్టర్ కీటన్ కూడా ఉన్నారు. ఆ నలుగురూ ఒక్క చోట చేరితే, హాస్యానికి కొదువేముంటుంది? నవ్వులకు కొరతేముంటుంది?

## పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- ఎవరి పాలన కాలంలో మెగస్తనీస్ ఇండియాను సందర్శించాడు?
  చంద్రగుప్త మౌర్య
- దీన్‌ఇలాహి మతాన్ని స్థాపించినది?
  అక్బర్
- ఆహార పదార్థాలలో, సబ్బుల తయారీలో, నూలు వస్త్ర పరిశ్రమల్లో ఉపయోగించునది
  ఆలివ్ నూనె
- దిల్లీకి ఉత్తరంగా ప్రవహించుచున్న నది:
  యమున
- ఉష్ణవికిరణాన్ని ఈ పరికరంతో గుర్తించవచ్చు:
  థర్మోస్కోప్
- పక్షులను గురించి తెలియజేయు శాస్త్రము:
  ఆర్నిథాలజి
- విద్యుద్దీపము బల్బులో గాలిని తొలగించి దీనిని నింపుతారు:
  నైట్రోజన్
- లౌకికతత్వాన్ని ప్రబోధించే బాధ్యత?
  ప్రభుత్వానిది
- పరమత సహనాన్ని ప్రదర్శించిన చక్రవర్తి?
  అశోకుడు
- ఆసియా రాజ్యాల మొదటి సభ ఈ నగరంలో జరిగింది?
  న్యూఢిల్లీ
- రాజ్యాంగ పరిషత్ ఏర్పాటును గూర్చి మొట్టమొదటగా ప్రతిపాదించినది?
  క్రిప్సు మిషన్
- తల్లిపాలను స్రవించడానికి ఉపయోగపడే హార్మోను పేరేమిటి?
  లాక్టోజనిక్ హార్మోన్
- మొదటి పంచవర్ష ప్రణాళిక ఏ సంవత్సరంలో ప్రారంభించబడెను?
  1951
- దీనికి రంగు, రుచి ఉండదు. దీన్ని పీలిస్తే మరణం సంభవించును?
  కార్బన్ మోనాక్సైడ్
- వానపాములతో తయారయ్యేది?
  వర్మికంపోస్ట్
- సముద్రపు మొక్కలు దీనిని నిక్షిప్త చేసుకుంటాయి?
  అయోడిన్
- హృదయంలో గదుల సంఖ్య?
  4
- మానవుడు మొట్ట మొదటిసారిగా చంద్రుడు మీద కాలు మోపిన సంవత్సరం ఏది?
  1969
- ప్రభుత్వానికి గల నియమ నిబంధనలే....
  రాజ్యాంగ చట్టాలు
- కోల్కతా ప్రధాన కేంద్రంగా కలిగిన రైల్వే మండలం:
  ఆగ్నేయ రైల్వే
- శ్రేణులు అనగా :
  వృత్తి సంఘాలు
- Poverty in India (భారతదేశంలో పేదరికం) అను గ్రంథాన్ని వ్రాసినవారు?
  దండేకర్, నీలకంఠరథి
- పెల్లగ్రా చర్మవ్యాధి దీని లేమి వల్ల వస్తుంది?
  నియాసిన్
- మనదేశంలో బ్యాంకుల జాతీయాకరణ ఎప్పుడు జరిగింది?
  1969



## గ్రామస్వరాజ్యంతోనే గాంధీకి నిజమైన నివాళి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** నగరంలోని గాంధీచౌక్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి సిపిఐ ఆధ్వర్యంలో పి.సుధాకర్, వై.రాజిరెడ్డి, కె.రాజన్న, సురేష్ కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే గ్రామ స్వరాజ్యం ఏర్పాటవుతుందని గ్రామాలు బలంగా ఉంటేనే గ్రామ స్వరాజ్యం ఏర్పాటు అవుతుందని గ్రామాలు బలంగా ఉంటేనే దేశం ఆర్థికంగా పురోగతి చెందుతుందని గాంధీజీ కలలు గన్నారన్నారు. పాలక పార్టీలు వీటిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల అభివృద్ధికి గ్రామాల్లో ఉండే వారికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు

## నిత్యావసరాల ధరలపై నియంత్రణేది?

సిపిఐ పూర్వ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి గౌతం గోవర్ధన్



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు పైపైకి వెళితే, ధరల పెరుగుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రణ చర్యలు తీసుకోకపోవడం వల్ల పండుగ పూట నిత్యావసర వస్తువులైన నూనేలు, పప్పులు, ఉల్లిగడ్డ, వెల్లిగడ్డ, కూ రగాయలు ధరలు విపరీతంగా పెరిగి, పేద, మధ్య తరగతి ప్రజలు వాటిని కోనుగోలు చేయలేని పరిస్థితి నెలకొందని, ధరల పెరుగుదలపై ప్రభుత్వం, అధికారుల నియంత్రణ చర్యలు లేక పోవడం మూలంగా ఇట్టి పరిస్థితి ఏర్పడిందని సిపిఐ పెద్దపల్లి జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా గోదావరిఖని, ఇతర మార్కెట్‌లోకి ప్రజలు నిత్యావసర వస్తువుల కోసం వెళితే ధరలు విపరీతంగా పెరిగాయని ఆయన పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సంబంధిత అధికారులు స్పందించి ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, లేనిచో సిపిఐ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## కార్మిక కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుతుంది:దుబాస్ రాములు

**ప్రజాపక్షం / బాన్సువాడ :** కార్మిక కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికీ యూనియన్ ద్వారా లబ్ధి చేకూరుతుందని ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని కొత్తబాద్ గ్రామంలో నిర్మాణ రంగ కార్మికులు, తాపీ మేస్త్రీలకు ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్ రాములు యూనియన్ యొక్క ఆవశ్యకతను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐటియుసి పోరాటాల ద్వారానే భవన నిర్మాణ రంగాల కార్మికులకు వెల్ఫేర్ బోర్డును సాధించామని, పోరాడి సాధించుకున్న వెల్ఫేర్ బోర్డును ప్రయివేటు ఇన్సురెన్సు కంపెనీకి కట్టబెట్టి ఆలోచన ప్రభుత్వం విరమించుకోవాలని లేని పక్షంలో కార్మికులచే ఆందోళన చేస్తామని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులు దుబాస్ రాములును శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సాయిలు, శ్రీనివాస్, నారాయణ, కార్మికులు తాపీ మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.



# పెండింగ్ స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలి

● పాలక ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి ● ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లను తక్షణమే ప్రభుత్వం విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. బుధవారం షాద్‌నగర్ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో ఎఐఎస్ఎఫ్ షాద్‌నగర్ నిర్మాణ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతోపాటు పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్లను విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎఐఎస్ఎఫ్ ఏర్పాటై 88వసంతాలు పూర్తి చేసుకుందని వివరించారు. దేశానికి స్వాతంత్రం రావాలని అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని ప్రోత్సహించడంతోపాటు అధిక నిధులు కేటాయించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యను కాషాయికరణ, ప్రైవేటీకరణ, కార్పోరేటీకరణ చేసే విధంగా నూతన జాతీయ విద్య విధానాన్ని తీసుకువచ్చిందని వివరించారు. నీట్ పేపర్ లీకేజీ జరిగి దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అన్యాయం జరిగినా కేంద్ర ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదని అన్నారు. విద్యారంగాన్ని బిజెపి ప్రభుత్వం పూర్తిగా విస్మరిస్తుందని, తెలంగాణ విభజన హామీలు అమలు చేయకుండా ఈ ప్రాంత విద్యార్థుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ విద్యారంగాన్ని అభివృద్ధి చేయకుండా నిర్లక్ష్యం చేసిందని, విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్లాడుతుంటే పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని మండిపడ్డారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయడంతోపాటు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలకు రెగ్యూలర్ విసిలను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

### షాద్‌నగర్ నూతన కౌన్సిల్ అధ్యక్షుడు నరేష్

ఎఐఎస్ఎఫ్ కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కౌన్సిల్ నూతన అధ్యక్షుడిగా నరేష్, కార్యదర్శిగా విజయ్, ఉపాధ్యక్షులుగా రమేష్, పూజ, సహాయ కార్యదర్శులుగా తరుణ్, నందిని, కోశాధికారులుగా సాయిలతోపాటు 11మంది కార్యవర్గ సభ్యులను, 21 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వంశీవర్ధన్‌రెడ్డి, పవన్ చౌహాన్, జిల్లా ఆఫీస బేరర్స్ ఆకాష్, అరుణ్, శివలు ఉన్నారు.

## మహనీయుల ఆశయాలు సాధించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి :** అహింసా మార్గాన్ని ఎంచుకొని ఎంతటి విజయాలనైనా సాధించవచ్చని నిరూపించిన జాతిపిత మహాత్మాగాంధీ ప్రపంచానికే ఆదర్శమని సిపిఐ జిల్లా కార్యదర్శి షేక్ సాబీర్ పాషా అన్నారు. సిపిఐ జాతీయ, రాష్ట్ర సమితి లపిలుపులో భాగంగా సిపిఐ ఆధ్వర్యంలో శేషగిరి భవన్‌లో బుధవారం గాంధీ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామా టాకీస్ రోడ్డులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో సాబీర్‌పాషా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను పనంగా పెట్టి పోరాడిన నాటి మహనీయులను మరువద్దని, వారి ఆశయాలను సాధించేందుకు భారత పౌరులుగా పునరంకితం కావాలన్నారు. దేశ హస్తాల నుంచి దేశానికి విముక్తి కలిగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల జమలయ్య, కొమారి హన్మంతరావు, భూక్యా శ్రీనివాస్, మాచర్ల శ్రీనివాస్, పోగుల కోటేశ్వర రావు, గోనె మని, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయకుమార్, పి.సత్యనారాయణచారి, గుత్తుల శ్రీనివాస్, లక్ష్మీ నారాయణ, ధనలక్ష్మి, సర్వేశ్వరరావు, మిర్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

### జై జవాన్, జై కిసాన్ అని నినదించిన శాస్త్రి

**ప్రజాపక్షం/భద్రాచలం :** దేశంలోని ప్రతీ పౌరుడు స్మరించుకోవాల్సిన మహా నాయకుడు లాల్‌బహుదూర్ శాస్త్రి అని సిపిఐ జిల్లా కార్యదర్శి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. స్వతంత్ర సమరయోధులు, భారత మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని బుధవారం రామవరం సెంటర్లో శాస్త్రి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గాంధీజీ తర్వాత భరత మాత కన్న మరో మహనీయుడు లాల్ బహుదూర్ శాస్త్రి అని, దేశ స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటాలు చేశారని , స్వాతంత్రం అనంతరం దేశాన్ని చక్కదిద్దేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. రాజనీతిజ్ఞునిగా , రాజకీయ నేతగా, కేంద్రమంత్రిగా ఆయన చేపట్టిన సంస్కరణలు దేశాన్ని ఉన్నత స్థాయికి చేర్చిందన్నారు. స్వంతంత్రం అనంతరం పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం తర్వాత చిన్నాభిన్నమైన సైనిక వ్యవస్థను , రైతు వ్యవస్థను చక్కదిద్దేందుకు జై జవాన్ జై కిసాన్ అని నినదించి విజయం సాధించారన్నారు. ప్రతీ పౌరుడు ఆయనను ఆదర్శంగా తీసుకుని సమాజ హితం కోసం పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు నరాటి ప్రసాద్, కంచర్ల జమలయ్య, నాయకులు తూముల శ్రీనివాస్, పాటి మోహన్, అలీం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



## అధికారం కోల్పోయినా బిఆర్ఎస్ నేతల పద్ధతి మారలేదు

● మంచి చేస్తున్న హైడ్రా, మూసీ ప్రక్షాళనను స్వాగతించాలి ● మంత్రి కొండా సురేఖ పట్ల కెటిఆర్ అనుచిత వైఖరి సిగ్గుచేటు ● సిపిఐ రాష్ట్రనేత బట్టు దయానంద రెడ్డి



**ప్రజాపక్షం/గజ్వేల్ :** అహంకార ధోరణి, అణచివేత వైఖరితో బిఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయినప్పటికీ ఆ పార్టీ నేతల్లో ఎలాంటి మార్పు లేదని, పద్ధతి మార్చుకోలేదని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యు లు బట్టు దయానందరెడ్డి పేర్కొన్నారు. బుధవారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న వర్షానికే జంట నగరాలను నీటితో ముంచెత్తుతున్న దృష్ట్యా హైడ్రా, మూసి ప్రక్షాళన వంటి మంచి పనులు చేపడితే సహకరించాల్సిన కెటిఆర్, హరీష్ రావులు ప్రజల ను రెచ్చగొడుతూ మాట్లాడం సిగ్గుచేటని నిలదీశా రు. ఆలాగే వారు వాడుతున్న భాష సమంజసంగా లేదని, సభ్యసమాజంలో తలెత్తుకునేలా ఆదర్శం గా నిలవాల్సిన వారు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నట్లు ఆక్షేపించారు. చేనేత కార్మికులను ప్రో త్సహించే విధంగా మంత్రి కొండా సురేఖ మాల వేసుకుంటే దానిని రాద్ధాంతం చేయడం, సోషల్ మీడియాలో ట్రోలింగ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారం ఎవరికి శాశ్వతం కాదని, అయి తే సున్నితమైన అంశాలను రాజకీయ లబ్ధి కోసం రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలని చూడడం తగదని స్పష్టం చేశారు. బాధ్యత గల ముఖ్యమంత్రిని తూలనాడడం తగదని, సమాజ శ్రేయస్సు దృష్ట్యా కఠినంగా వ్యవహరిస్తే మద్దతు ఇవ్వాలని అన్నా రు. గత పదేండ్ల కాలంలో చేసిన పొరపాట్లను బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం సమీక్షించుకోవాలని, స్వయంకృతాపరాధాన్ని ఇతరులపై నెట్టడం కా కుండా ప్రజా సమస్యల పరిష్కారంలో భాగస్వాములు కావాలని చెప్పారు. మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల నిర్మాణంతో ఎంతోమంది నిరాశ్రయులైన విషయాన్ని మర్చిపోవద్దని, వారిని ఆదుకునేందుకు దృష్టి పెట్టాలని తెలిపారు. నిర్వాసితులను అన్ని రకాలుగా ఆదుకునేందుకు సిఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని, ఏ పార్టీ వారైనా రాజకీయ విలువలను దిగజార్చవద్దని వివరించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ఇన్చార్జి శివలింగ కృష్ణ, గజ్వేల్ పట్టణ బాధ్యులు స్వర్గం రాజేశం, జగదేవ్ పూర్ మండల సిపిఐ కార్యదర్శి తోందూరు నర్సింహరెడ్డి, తీగుల్ గ్రామ సిపిఐ కార్యదర్శి బిక్షపతి పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీలను బిజెపి ఎప్పటికీ నెరవేర్చలేదు

### కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శ



**చండీగఢ్ :** ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో బిజెపి ఘోరంగా విఫలమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పడంలో నిష్ణాతులని ఆరోపించారు. నేడు మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి అని, గాంధీ మనకు వాస్తవాలు, అహింసను బోధించారన్నారు. నేడు అధికారంలో ఉన్న వారు ఎన్ని నిజాలు మాట్లాడుతున్నారు, ఎన్ని అబద్ధాలు చెబుతున్నారో తాను చెప్పదల్చుకోలేదన్నారు. బుధవారం ఖర్గే చర్ఖిదాద్రిలోని బధ్రలో నిర్వహించిన ర్యాలీలో కాంగ్రెస్ చీఫ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీలో హర్యానా మాజీ సిఎం భూపిందర్ సింగ్ హుడా, జమ్ము కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ నమ్మకాన్ని విచ్ఛిన్నం చేసే వారికి మోదీ నాయకుడన్నారు. ఆయన అనేక అబద్ధాలు, హామీలు ఇచ్చారో మీకు తెలిసిందేనన్నారు. గత పదేళ్లలో మోదీ అనేక హామీలు గుప్పించారని, వాటికి హద్దే లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రతి ఒక్కరి ఖాతాల్లో రూ. 15 లక్షలు వేస్తామని ఎన్నికలకు ముందు ఊదరగొట్టారన్నారు. పదేళ్లుగా ప్రధానిగా ఉన్న మోదీ అబద్ధాలు చెప్పవచ్చా అని ప్రశ్నించారు. ఈ విధంగా మాజీ ప్రధానులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వ్యవహరించలేదని ఖర్గే చెప్పారు. కాంగ్రెస్ నాయకులు విదేశాల్లో తమ నల్ల డబ్బులను దాచుకున్నారని, వాటిని తీసుకువచ్చి ప్రతిత ఒక్కరి ఖాతాల్లో రూ. 15 లక్షల వేస్తానని పచ్చి అబద్ధాలు చెప్పాలని మండిపడ్డారు. అదే విధంగా ప్రతి ఏడాది 2 కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ హామీనిచ్చారని, గత పదేళ్లలో వారిచ్చిన 20 కోట్ల ఉద్యోగాలు ఏవీ అని నిలదీశారు. ఇప్పుడేమో హర్యానాలో ఎన్నికల సందర్భంగా ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని బిజెబి చెబుతుందని, ఖాళీగా ఉన్న 1.60 లక్షల ఉద్యోగాలనే భర్తీ చేయలేకపోయిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న వారు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. తొమ్మిదిన్నర సంవత్సరాలుగా మనోహర్‌లాల్ ఖట్టార్ ముఖ్యమంత్రిగా ఉన్నారని, కానీ అతన్ని మార్చారన్నారు. ఎందుకంటే ఇంజిన్ విఫలమైందని ఎద్దేవా చేశారు. ఆయన పనితీరు సక్రమంగా ఉంటే, ఇచ్చిన వాగ్దానాలను అమలు చేసి ఉంటే మార్చాల్సిన అవసరం వచ్చేదే కాదన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో విఫలమయ్యారు కాబట్టే మార్చారని ఖర్గే చెప్పారు. భూపిందర్ సింగ్ హుడా హయాంలో చేసిన పనులు ప్రజలకు ఇప్పటికీ గుర్తున్నాయని, తమ పార్టీ చెప్పినట్టే చేస్తుందని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. అందుకే బిజెపిని 'ఝూఠోన్‌కీ సర్దార్' అని, మోడీ అబద్ధాలు చెప్పడంలో నిష్ణాతుడని నేను పదే పదే చెబుతున్నానన్నారు. ఆయను చూసి ఎవరూ భయపడరన్నారు. ప్రధానమంత్రులు అయిన కాంగ్రెస్ నేతలు ఎప్పుడూ తమ దేశం కోసమే పోరాడారని ఖర్గే అన్నారు. లాల్ బహదూర్ శాస్త్రి జై జవాన్, జై కిసాన్ అనే నినాదం ఇచ్చారన్నారు. వారికి జవాన్ల గురించి, కిసాన్‌ల గురించి తెలియదని, వారికి ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా మాత్రమే తెలుసు.. ఆర్‌ఎస్‌ఎస్‌లోనో, బిజెపిలోనో ఎవరూ రైతు కాదు.. అందుకే వారికి రైతుల బాధలు అర్థం కావడం లేదని అన్నారు.

# అన్యాయం, దుర్మార్గంపై పోరాటం

### కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ



**చండీగఢ్ :** అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిని నామరూపం లేకుండా చేయాలని కాంగ్రెస్ నేత ప్రియాంకాగాంధీ హర్యానా ప్రజలకు పిలుపునిచ్చారు. దుర్మార్గం, అన్యాయం, అసత్యంపై పోరు సాగుతుందన్నారు. జూల్నా కాంగ్రెస్ అభ్యర్థి వినేష్ ఫొగట్‌కు మద్దతుగా నిర్వహించిన బహిరంగ సభలో ప్రియాంక పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నెలకొన్న నిరుద్యోగం, మిలిటరీ నియామాక పథకమైన అగ్నివీర్, రైతుల సంక్షేమం సహా ఇతర సమస్యలపై బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వంపై మండిపడ్డారు. అధికార పార్టీ ప్రతి దశలోనూ ప్రజలకు మోసం చేస్తుందని విమర్శించారు. కురుక్షేత్రం వంటి యుద్ధం చేసే అవకాశం మరొకసారి వచ్చిందని, బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. అయితే నేడు మీరు చేస్తున్నది అన్యాయానికి, దుర్మార్గానికి, అవాస్తవానికి వ్యతిరేకమన్నారు. దీనిపై గట్టిగా నిలబడాలని, తరువాత ఏం జరుగుతుందో చూద్దామన్నారు. మోదీ ప్రభుత్వం కొద్దిమంది పారిశ్రామికవేత్తల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని పేర్కొంటూ, బిజెపి నేతృత్వంలోని కేంద్రం 'అంతా అంబానీ, అదానీలకు' కట్టబెట్టినందున ఉపాధి అవకాశాలను కల్పించలేకపోయిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మండిపడ్డారు. ఓడరేవులు, భూములు, పరిశ్రమలు, విమానాశ్రయాలు అన్నీ బడా పారిశ్రామికవేత్తలకు ఇచ్చారని ఆమె అన్నారు. నేడు చిన్న వ్యాపారాలు , వ్యవసాయ రంగం నుండి ఎటువంటి ఉపాధి అవకాశాలు సృష్టించబడలేదని గాంధీ అన్నారు. బిజెపి ఎప్పుడు కూడా ఉపాధి కల్పించే పనిని చేయదని, ఎందుకంటే దాని విధానాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయన్నారు. అగ్నిపథ్ పథకాన్ని ప్రస్తావిస్తూ, అగ్నివీరులకు ఎలాంటి పింఛను లభించదని, నాలుగేళ్ల సర్వీసు తర్వాత మళ్లీ ఉపాధి కోసం వెతకాల్సి ఉంటుందని గాంధీ పేర్కొన్నారు. మోదీజీ మీకు ఇచ్చిన కానుక ఇదేనన్నారు. 'పరివార్ పెహచాన్ పత్ర' పథకంపై బిజెపి ప్రభుత్వం ప్రజలను అనేక ఇబ్బందులకు గురి చేసిందని ప్రియాంక విమర్శించారు. పదేళ్లుగా మిమ్మల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని.. పదేళ్లుగా రైతులు, జవాన్లు, రెజ్లర్లు, మహిళలకు అన్యాయం జరుగుతోందని ఆమె అన్నారు. రద్దు చేసిన మూడు వ్యవసాయ చట్టాలను ప్రస్తావిస్తూ వాటివల్ల రైతు సమాజానికి అన్యాయం జరిగిందని అన్నారు. 'ఢిల్లీ సరిహద్దుల్లో కూర్చొని నిరసన తెలుపుతున్న రైతులను కలిసేందుకు మోడీకి ఐదు నిమిషాలు సమయం లేకపోయిందన్నారు. రైతులపై ప్రతికూల ప్రభావ చూపే వ్యవసాయ చట్టాలను తీసుకురాబోతున్నారని, ఆ వ్యవసాయ చట్టాల వల్ల పెద్ద పారిశ్రామికవేత్తలు మాత్రమే ప్రయోజనం పొందుతారని ఆయనకు తెలుసునని విమర్శిమంచారు. వాటి వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదన్నారు. 24 పంటలకు ఎంఎస్‌పి ఇస్తామన్న బిజెపి ప్రభుత్వ వాదనను ఆమె ఎద్దేవా చేస్తూ వాటిలో 10 హర్యానాలో కూడా పండంలేదని అన్నారు. వారు ఎవరిని మోసం చేస్తున్నారో దేశం మొత్తం చూస్తోందని గాంధీ అన్నారు. ఈ ప్రభుత్వాన్ని మార్చండి.. బిజెపిని తరిమికొట్టండి' అని విజ్ఞప్తి చేశారు.

# అధికారంలోకి రాగానే గంటలో మద్యపాన నిషేధం ఎత్తివేత'

### రాజకీయ పార్టీని ప్రారంభించిన ప్రశాంత్ కిషోర్



**పాట్నా :** రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ పొలిటికల్ పార్టీని ప్రారంభించారు. బీహార్ పాట్నాలోని వెటర్నరీ కాలేజీ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఆయన తన పార్టీ జన్ సురాజ్‌ను అధికారికంగా ప్రకటించారు. కేంద్ర మాజీ మంత్రి దేవేంద్ర ప్రసాద్ యాదవ్, మాజీ దౌత్యవేత్త పవన్ వర్మ, మాజీ ఎంపీ హస్సన్ సమక్షంలో ప్రారంభించిన ప్రశాంత్, మాజీ ఐఎఫ్‌ఎస్ అధికారి మనోజ్ భారతిని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించారు. విద్య, ఉపాధి అవకాశాల ప్రాధాన్యాల గురించి బిహారీలకు వివరించి ఓట్లు అడుగుతామని ప్రశాంత్ కిశోర్ తెలిపారు. జన్ సురాజ్ పార్టీ అధికారంలోకి వస్తే బీహార్‌లో మద్యపాన నిషేధాన్ని ఎత్తివేస్తామని పికె ప్రకటించారు. బీహార్‌ను ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు రానున్న పదేళ్లల్లో రూ.5 లక్షల కోట్లు అవసరమని చెప్పారు. ఈ మద్యపాన నిషేధం ఎత్తివేయడం ద్వారా వచ్చిన సొమ్మును బడ్జెట్‌కు, నేతల భద్రత, రోడ్లు, నీళ్లు, విద్యుత్‌కు మళ్లించమని తెలిపారు. బీహార్ విద్యా వ్యవస్థ నిర్మాణానికి మాత్రమే ఖర్చు చేస్తామని హామీ ఇచ్చారు. మద్యపాన నిషేధం వల్ల ఏటా రూ.20 వేల కోట్ల ఖజానాకు నష్టం వాటిల్లుతోందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే గంటలో మద్యపానంపై ఉన్న నిషేధాన్ని తొలగిస్తామని ప్రశాంత్ కిశోర్ తెలిపారు. జన్ సురాజ్ పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించినట్లు వెల్లడించారు. బిజెపితో కలిసి తమ పార్టీ పనిచేస్తుందంటూ కొన్ని విపక్షాలు చేస్తున్న ఆరోపణలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. రెండేళ్ల క్రితం బీహార్‌లో 'జన్ సురాజ్' యాత్రను ప్రశాంత్ కిశోర్ ప్రారంభించారు. 1917లో మహాత్మాగాంధీ మొదటి సత్యాగ్రహ ఉద్యమాన్ని ప్రారంభించిన చంపారణ్ జిల్లా నుంచే 3,000 కి.మీ పాదయాత్రను చేపట్టారు. సరిగ్గా పాదయాత్రను ప్రారంభించిన రెండేళ్ల తర్వాత పార్టీని ఇప్పుడు ప్రారంభించారు.

# వ్యవసాయ వ్యర్థాల దగ్ధంపై నివేదిక పరిశీలించనున్న సుప్రీం

**న్యూఢిల్లీ :** వ్యవసాయ వ్యర్థాలను దగ్ధం చేయడంవల్ల దేశ రాజధాని ఢిల్లీ—ఎన్‌సిఆర్ ప్రాంతంలో గాలి కాలుష్యం అదుపులో ఉందా? లేదా? అనే విషయంపై సిఎక్యుఎం (గాలి నాణ్యతా నిర్వహణ కమిషన్) సమర్పించిన నివేదికను సుప్రీం కోర్టు గురువారంనాడు పరిశీలించనున్నది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిన్‌లతో కూడిన ధర్మాసనం ఈ నివేదికను పరిశీలిస్తుంది. ఢిల్లీ—ఎన్‌సిఆర్ ప్రాంతంలో గాలి కాలుష్యాన్ని తగ్గించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై ఈ ధర్మాసనం విచారణ చేస్తున్నది. ఢిల్లీకి పొరుగున ఉన్న రాష్ట్రాలలో పంటలు పండించిన తర్వాత వ్యర్థాలను దగ్ధం చేయడంవల్ల ఆ గాలి కాలుష్యం ఢిల్లీ నగరాన్ని చుట్టుముడుతున్నది. ఈ వ్యర్థాలవల్ల వచ్చే కాలుష్యాన్ని అదుపు చేయడంలో సిఎక్యుఎం విఫలమైందని, పొరుగు రాష్ట్రాలలో వ్యవసాయ వ్యర్థాలను దగ్ధం చేయకుండా ప్రత్యామ్నాయ మార్గాలు అమలు చేయడంలో కమిషన్ సరైన చర్యలు తీసుకోలేదని సుప్రీంకోర్టు సెప్టెంబరు 27న సిఎక్యుఎంను తీవ్రస్థాయిలో తప్పుపట్టింది. దీనిపై నివేదిక ఇవ్వాలని కోరింది. ఈ నేపథ్యంలో గురువారంనాడు సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తం చేస్తుందనే విషయానికి తీవ్ర ప్రాధాన్యం ఏర్పడింది. సిఎక్యుఎం తీసుకున్న చర్యలపట్ల సుప్రీంకోర్టు వారం రోజుల క్రితం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. తక్షణం రంగంలోకి దిగి మరిన్ని మేలైన చర్యలు తీసుకోవాలని ధర్మాసనం హెచ్చరించడంతో గురువారంనాటి కోర్టు ఆదేశాలపై అందరూ దృష్టి కేంద్రీకరించారు.

# గాంధీ, శాస్త్రికి పలువురు నివాళి



**న్యూఢిల్లీ :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో మహాత్ముడికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ నివాళులు అర్పించారు. సత్యం, సామరస్యం, సమానత్వంపై ఆధారపడిన ఆయన జీవితం, ఆదర్శాలు ఎల్లప్పుడూ దేశ ప్రజలకు స్ఫూర్తిగా నిలుస్తాయని మోదీ అన్నారు. తరువాత స్వతంత్ర భారత రెండో ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా ఆయనకు ప్రధాని మోదీ విజయ్‌ఘాట్‌లో నివాళులు అర్పించారు. లాల్ బహదూర్ శాస్త్రి ఇచ్చిన జై జవాన్, జై కిసాన్ నినాదం భావి తరాలకు కూడా ప్రేరణగా నిలుస్తుందని ఆయన అన్నారు. దేశ స్వాభిమానం కోసం ఆయన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా గాంధీ మహాత్మునికి, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రికి ఘనంగా నివాళులు అర్పించారు. ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖర్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఎల్‌జి సక్సేనా, ఢిల్లీ ముఖ్యమంత్రి ఆతిశీ, సహా పలువురు కేంద్ర మంత్రులు కూడా గాంధీజీకి, లాల్ బహదూర్ శాస్త్రికి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ పాఠశాల విద్యార్థులతో కలిసి స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో ప్రజలు సైతం పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. 'నేను, నా యువ స్నేహితులతో కలిసి స్వచ్ఛత అభియాన్‌లో భాగమయ్యాను. మీరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరుకుంటున్నాను. ఈ చొరవ స్వచ్ఛభారత్ స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుంది' అంటూ మోదీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. ప్రధాని మోదీ పిలుపుమేరకు పలువురు రాజకీయ నాయకులు స్వచ్ఛ అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు జెపి నడ్డా, కిషన్ రెడ్డి, రాజీవ్ రంజన్, ముకేశ్ మాండవీయతో పాటు యుపి సిఎం యోగీ ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# వికటించిన మధ్యాహ్న భోజనం

### 45మంది విద్యార్థులకు అస్వస్థత

**థానే :** మహారాష్ట్రలో మధ్యాహ్నభోజనం విషాహారంగా మారి 45మంది విద్యార్థులు అస్వస్థతకు గురై ఆసుపత్రుల పాలయ్యారు. థానే నగరం సమీపంలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో ఈ సంఘటన జరిగింది. దీంతో ఆ పాఠశాల యాజమాన్యంపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారని బుధవారం అధికారవర్గాలు తెలిపాయి. ఈ ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం మధ్యాహ్నం భోజన సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నది. 'మిడ్ డే మీల్' చేస్తున్న సమయంలో విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో వారు తమకు తలతిరగడం, కడుపులో వికారం, తలనొప్పి, పొత్తికడుపులో నొప్పి లక్షణాలు ఉన్నట్లు తెలియజేశారు. తొలుత 8నుంచి 11సంవత్సరాల మధ్య వయసున్న 38మంది విద్యార్థులు పాఠశాల యాజమాన్యానికి ఈ ఫిర్యాదు చేశారు. వెంటనే వారిని కల్వ పట్టణంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు చికిత్స కోసం తరలించారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో మరో ఏడుగురు విద్యార్థులు కూడా ఈ లక్షణాలతో బాధపడుతుండగా ఆ విద్యార్థులను కూడా వెంటనే వైద్య చికిత్స కోసం హాస్పిటల్‌కు తీసుకెళ్లగా వైద్యులు వారిని అడ్మిట్ చేసుకుని చికిత్స అందించారు. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కల్వ పోలీసులు పాఠశాల యాజమాన్యం, ఆహార సరఫరాదారుడిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 125 మరియు ఎఫ్‌డిఎ నిబంధనల కింద కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారని అధికారులు తెలియజేశారు. అయితే ఇంతవరకు ఈ కేసులో ఎలాంటి అరెస్టులు జరగలేదని పోలీసులు తెలిపారు.

# మహాత్మాగాంధీ జీవితం నాకు ధైర్యం, బలం, ఆశను ప్రసాదించింది

### 155వ గాంధీ జయంతి సందర్భంగా భారీ ప్రదర్శనను ఉద్దేశించి ప్రసంగించిన కర్నాటక సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** మైసూరు ప్రాదేశిక అభివృద్ధి సంస్థ (ముడా) కుంభకోణంలో లోకాయుక్త పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తును ఎదుర్కొంటున్న కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తనపై జరుగుతున్న రాజకీయ కుట్రలను ఆక్షేపించారు.ప్రస్తుత పోరాటంలో మహాత్మాగాంధీ జీవితం మరియు ఆలోచనలు తనకు ఎంతో ధైర్యం, బలం, ఆశను కల్పిస్తున్నాయన్నారు. బుధవారం మహాత్మాగాంధీ 155వ జయంతి సందర్భంగా ఇక్కడి విధానసౌధ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్దకు నిర్వహించిన భారీ ప్రదర్శనను ఉద్దేశించి సిఎం సిద్ధరామయ్య ప్రసంగించారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ గాంధీభవన్ నుంచి ప్రారంభించిన ప్రదర్శన గాంధీ విగ్రహం వద్దకు చేరుకోవడంతో ముగిసింది. ఆన్‌లైన్‌లో చేసిన ఒక పోస్టులో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు.'ఈ ప్రపంచం పూర్తిగా మతతత్వం, నియంతృత్వం, హింసతో నిండి ఉన్నది. సత్యం యొక్క స్వరూపం, శాంతి, అహింస మనల్ని చేయి పట్టుకుని ముందుకు నడిపిస్తోంది' అని సిద్ధరామయ్య తెలిపారు. ఈ దేశ ప్రజలందరికీ 'హ్యాపీ గాంధీ జయంతి' అంటూ ఆయన లోకాయుక్త పోలీసుల విచారణ, ఇడి మనీ ల్యాండరింగ్ కేసు విచారణను ప్రస్తావించకుండానే తన సందేశం ఇచ్చారు. కాగా గాంధీ జయంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె.శివకుమార్ మహాత్మాగాంధీకి పూలనివాళి అర్పించారు. తెల్లటి వస్త్రాలు ధరించిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి శివకుమార్ తమ మంత్రులు న్యాయ శాఖ మంత్రి హెచ్‌కె.పాటిల్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మీ హెబ్బాల్కర్‌తో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొని గాంధీ ఫిలాసఫీని చాటిచెప్పారు. ఈ సందర్భంగా గట్టి భద్రత నడుమ వీరితోపాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు జాతీయ పతాకాలను చేతబూని 'భారత్ మాతా కీ జై' 'వందేమాతరం' అంటూ నినాదాలు చేస్తూ 'గాంధీ వాక్'లో నడిచారు.

**అన్ని కోర్టులకంటే 'మనస్సాక్షి కోర్టు' గొప్పది : సిఎం సిద్ధరామయ్య**

జాతిపిత మహాత్మాగాంధీ ప్రవచించినట్లుగా 'అన్ని కోర్టులకంటే మనస్సాక్షి న్యాయస్థానమే గొప్పది' అనే విషయాన్ని తాను విశ్వసిస్తానని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పేర్కొన్నారు. 'ముడా' కేసులో లోకాయుక్త, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దర్యాప్తులను ఎదుర్కొంటున్న సిద్ధరామయ్య గాంధీ జయంతి సందర్భంగా మహాత్మా గాంధీ ప్రవచనాలను స్మరించుకున్నారు. మనస్సాక్షి కోర్టు అనేది కోర్టులు అన్నింటిలోకెల్లా మిన్న అని గాంధీ సిద్ధాంతాలను తాను బలంగా నమ్ముతున్న విషయాన్ని గుర్తుచేశారు. బుధవారం 'గాంధీ స్మారక నిధి'అనే సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఉపన్యసించారు. ఇతరులు ఇష్టపడుతున్నారా లేదా అని ఆలోచించకుండా మనస్సాక్షి ఏది చెబితే అదే చేయాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రభోదించారు. ఇతరులు మన ఆలోచనను వ్యతిరేకిస్తారా? లేదా ప్రశంసిస్తారా ? అనే విషయాన్ని మనం ఏమాత్రం పట్టించుకోకుండా మన పని మనం చేసుకుపోవాలన్నారు. కులం, అసమానతల గురించి తాను తన ప్రసంగాలలో ప్రస్తావించదలచుకోలేదన్నారు. కులం అనేది అంత తొందరగా రూపుమాపబడేది కాదన్నారు. మహాత్మాగాంధీ కులం, అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడినా అది ఇంకా అనేక ప్రాంతాలలో ఉన్నదన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కూడా ఇదే రోజు కావడంతో సిద్ధరామయ్య శాస్త్రి సేవలను కూడా గుర్తుచేశారు. దేశంలోనే ఆయన అత్యంత నిజాయితీపరుడైన రాజకీయనాయకుడని కీర్తించారు.

# యువకులను కాపాడడంలో మణిపూర్ ప్రభుత్వం విఫలం



**ఇంఫాల్ :** అపహరణకు గురైన ఇద్దరు యువకులను కాపాడడంలో మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కె.మేఘనాచంద్ర విమర్శించారు. గత నెల 27వ తేదీన కాంగ్‌పోక్పీ జిల్లాలో ముగ్గురు యువకులను సాయుధులు అపహరించగా, అందులో ఒకరు తప్పించుకొని వచ్చారు. మిగతా ఇద్దరు యువకులను రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు కాపాడడం లేదనే అంశం తమను గందరగోళానికి గురిచేస్తోందని, హోం శాఖ ఎందుకు నిస్సహాయంగా ఉందని మేఘనాచంద్ర ప్రశ్నించారు. మణిపూర్‌లో ఏడాదిన్నరగా గందరగోళనం నెలకొందని, పరిస్థితి మెరుగవుతున్నట్లుగా కనిపించడం లేదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి ఎన్.బీరెన్ సింగ్, ఎంఎల్‌ఏలతో ఏర్పాటు చేసిన సంయుక్త సమావేశంలో రాజ్యాంగాన్ని అమలు పరచాలని కోరినట్లు ఆయన తెలిపారు.

# మహాయుతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఛార్జిషీట్'



**ముంబై :** త్వరలో మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అధికారంలో ఉన్న మహాయుతి ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'ఛార్జిషీట్'ను ఎన్‌సిపి (శరద్‌పవార్) విడుదల చేసింది. మహారాష్ట్ర నుంచి పరిశ్రమలు తరలిపోతున్నాయని, శాంతి భద్రతలు లేకుండా పోయాయని పేర్కొంది. ఎన్‌సిపి (ఎస్‌పి) ఎంపి సుప్రియా సూలే, మహారాష్ట్ర అధ్యక్షుడు జయంత్ పాటిల్ ఛార్జిషీట్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మంత్రాలయ(సచివాలయం)లోని మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి విగ్రహం నుంచి హుతాత్మ చౌక్ వరకు పాదయాత్ర చేస్తూ ఛార్జిషీట్ ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు. ప్రధానంగా మహారాష్ట్రలో ఆర్థిక క్షీణత, పరిశ్రమలు, మహిళల భద్రత అంశాలు సహా పది అంశాలపై ఛార్జ్ షీట్‌లో పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా మహారాష్ట్ర హక్కుల కోసం డిమాండ్ పేరుతో ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జయంత్ పాటిల్ వెల్లడించారు. ఇందులో అడ్వర్టయిజ్‌మెంట్‌లు, వివిధ మాధ్యమాలలో పాటలు, వీడియోల ద్వారా ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం ఉంటుందన్నారు. ఏ విధంగా మహారాష్ట్రలో నిరుద్యోగం పెరిగి, గుజరాత్‌కు కీలక ప్రాజెక్టులు తరలిపోతున్నాయనే అంశాన్ని ప్రత్యేకంగా వివరించనున్నట్లు తెలిపారు.

# వరద నీటిలో ఐఎఎఫ్ హెలికాప్టర్ అత్యవసర ల్యాండింగ్..



**ముజఫర్‌పూర్:** వరద సహాయక సామాగ్రిని పంపిణీ చేస్తున్న భారత వైమానిక దళానికి (ఐఎఎఫ్) చెందిన అడ్వాన్స్‌డ లైట్ హెలికాప్టర్ బీహార్‌లోని ముజఫర్‌పూర్ జిల్లాలో బుధవారంనాడు అత్యవసర ల్యాండింగ్ అయింది. విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో జలదిగ్బంధంలో ఉన్న ప్రాంతంలోనే విమానం దిగింది. దీంతో ఒకింత ఆందోళనకర పరిస్థితి తలెత్తింది. అయితే, విమానంలోని ఇద్దరు పైలట్లు సహా ముగ్గురు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఐఎఎఫ్ హెలికాప్టర్ దర్భంగా నుంచి రిలీఫ్ మెటీరియల్‌ను డ్రాప్ చేసి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్టు సీనియర్ ఎస్‌పి రాకేష్ కుమార్ తెలిపారు. జలదిగ్బంధంలో ఉన్న ఆరియా బ్లాక్‌లో హెలికాప్టర్ అత్యవసరంగా ల్యాండింగ్ అయినట్టు చెప్పారు. అధికారులు అక్కడికి చేరుకోవడానికి ముందే స్థానికులు ఐఎఎఫ్ సిబ్బందిని బయటకు తెచ్చినట్టు తెలిపారు. హెలికాప్టర్‌లోని ముగ్గురూ సురక్షితంగా బయటపడ్డారని, ముందు జాగ్రత్తగా స్థానిక ఆసుపత్రికి చికిత్స కోసం తరలించామని జిల్లా మెజిస్ట్రేట్ సుబ్రత్ కుమార్ సేన్ తెలిపారు. కాగా, భారీ వర్షాలు, వరదలతో కోసి వంటి పలు నదులు సామర్థ్యానికి మించి ప్రవహిస్తుండటంతో బీహార్‌లోని పలు జిల్లాలు జలదిగ్బంధంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం చురుకుగా సహాయక కార్యక్రమాలు కొనసాగిస్తోంది. సుమారు 16 జిల్లాల్లోని 10 లక్షల మంది వరద ప్రభావినికి గురైనట్టు తెలుస్తోంది.

# పదేళ్లలో ప్రజా ఉద్యమంగా స్వచ్ఛ భారత్

### దేశ శ్రేయస్సుకు ఇదొక కొత్త మార్గం



**న్యూఢిల్లీ :** గత పదేళ్లలో స్వచ్ఛ భారత్ మిషన్ విజయవంతమైన అతి పెద్ద ప్రజా ఉద్యమంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దీనిని ప్రజలు వ్యక్తిగత లక్ష్యంగా చేసుకున్నారని తెలిపారు. ఇలాంటి నిరంతర ప్రయత్నాల ద్వారా మనం దేశాన్ని పరిశుభ్రంగా మార్చగలమని పేర్కొన్నారు. స్వచ్ఛ్ భారత్ మిషన్ ప్రారంభించి 10 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దేశ రాజధాని ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నేషనల్ మిషన్ ఫర్ క్లీన్ గంగా, గోవర్ధన్ యోజనకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. 'స్వచ్ఛ భారత్ కార్యక్రమం పరిశుభ్రత ఉద్యమం మాత్రమే కాదు. ప్రజా శ్రేయస్సుకు ఇదొక కొత్త మార్గం. దేశ ప్రజలు, పారిశుద్ధ్య కార్మికులు, మత పెద్దలు, క్రీడాకారులు, సెలబ్రిటీల, స్వచ్ఛంద సంస్థలు, మీడియా అందరూ కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసినందుకు నేను అభినందిస్తున్నా. మీరంతా కలిసి దీనిని ప్రజా ఉద్యమంగా మార్చారు. మాజీ, ప్రస్తుత రాష్ట్రపతులు, ఉపరాష్ట్రపతులు కూడా ఈ స్వచ్ఛతా కార్యక్రమానికి సహకరించారు. ఇక స్వచ్ఛతకు సంబంధించిన రూ.10వేల కోట్లు విలువైన ప్రాజెక్టులు ప్రారంభమయ్యాయి. మిషన్ అమృత్ ద్వారా దేశంలోని అనేక నగరాల్లో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి. నమామి గంగా పనులైతేనేమి, వ్యర్థాలతో బయోగ్యాస్ తయారీ గోవర్ధన్ ప్లాంట్ల వంటి పనులు స్వచ్ఛభారత్ మిషన్‌ను ఉన్నతస్థాయికి తీసుకెళ్లనున్నాయి. స్వచ్ఛభారత్ మిషన్ ఎంత విజయవంతమైతే అదే స్థాయిలో దేశకీర్తి పెరుగుతుంది. 1000 ఏళ్ల తర్వాత కూడా ప్రజలు 21వ శతాబ్దపు భారతదేశం గురించి మాట్లాడినప్పుడు కచ్చితంగా స్వచ్ఛ భారత్ మిషన్‌ను గుర్తుకు తెచ్చుకుంటారు' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గత ప్రభుత్వాలు ఎప్పుడూ మురుగు నీటిని, మరుగుదొడ్లు లేకపోవడాన్ని జాతీయ సమస్యలుగా పరిగణించలేదని ప్రధాని మోదీ విరమర్శించారు. 'ఫలితంగా ప్రజలు అపరిశుభ్రమైమ పరిస్థితుల్లోనే జీవించాల్సి వచ్చింది. నేను ఎర్రకోట నుంచి స్వచ్ఛ భారత్‌కు పిలుపునిచ్చినప్పుడు ఎగతాళి చేశారు. ఇప్పటికీ చేస్తున్నారు. కానీ ఈ రోజు ఫలితాలను చూస్తే అర్థమవుతుంది. 10 సంవత్సరాల క్రితం 60శాతం కంటే ఎక్కువ జనాభా బహిరంగ మలవిసర్జన చేయాల్సి వచ్చేది. ఇది మన గౌరవానికి విరుద్ధం, అవమానించడమే అవుతుంది. ముఖ్యంగా మహిళలకు అసౌకర్యాన్ని కలిగించేది' అని మోదీ అన్నారు. ఏటా స్వచ్ఛ భారత్ మిషన్ 60 వేల నుంచి 70 వేల మంది పిల్లల ప్రాణాలను కాపాడుతుందని అంతర్జాతీయ నివేదికలు తెలిపాయని ప్రధాని మోదీ అన్నారు. మరుగుదొడ్ల నిర్మాణం వల్ల 90శాతం మంది మహిళలు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. స్వచ్ఛ భారత మిషన్ పారిశుద్ధ్య కార్మికులకు గౌరవం తీసుకొచ్చిందని, వారి పట్ల ప్రజల వైఖరిలో కూడా మార్పు వచ్చిందని అన్నారు.

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
గురువారం, అక్టోబరు 03

## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

పశ్చిమాసియాలో సంవత్సరకాలంగా ఇజ్రాయెల్ సాగిస్తున్న దురాక్రమణపూరితమైన దుందుడుకు చర్యలు, గాజా ప్రాంతంపై నిరంతరం గురిపెట్టిన బాంబుదాడులతో సాగిస్తున్న మారణహోమం, విధ్వంసం ప్రపంచ దేశాలను కలవరపరుస్తున్నా దాని ముక్కుకు త్రాడువేసే నాథుడు లేడు. ప్రపంచానికి పెద్దన్నని చెప్పుకునే అమెరికా సంయుక్త రాష్ట్రాల నుండి అందుతున్న ఆయుధాలు, సైనిక తోడ్పాటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ యుద్ధ విస్తరణ పన్నాగాలకు ఊతమిస్తున్నది. ఇరాన్‌ను యుద్ధంలోకి లాగటానికి ఎన్ని కవ్వింపు చర్యలకు ఒడిగడుతున్నా అది పాటిస్తున్న సంయమనం మంగళవారం రాత్రి కట్టలు తెంచుకుంది. ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్‌కు చెందిన సైన్యం ఇజ్రాయెల్‌పైకి 180 బాలిస్టిక్ మిస్సిలీలు ప్రయోగించింది. దీన్ని అమెరికా వెనువెంటనే ఖండించింది. ఇజ్రాయెల్‌కు తాము ఎల్లవేళలా అండగా ఉంటామంది. బ్రిటన్ తదితర దేశాల నేతలు అధ్యక్షుడు బైడన్‌ను అనుసరించారు. తీవ్రమైన ప్రతీకార చర్యలు తప్పవని ఇరాన్ ను ఇజ్రాయెల్ హెచ్చరించింది. ఇరాన్ దాడి ఇజ్రాయెల్ దుశ్చర్యలకు ప్రతీకారమని, ఇరుపక్షాలు సంయమనం పాటించి సంఘర్షణను ఇంతటితో నిలుపుచేయాలని విజ్ఞప్తి చేసేవారు కానరారు. ఇజ్రాయెల్ భూభాగంపై ఇరాన్ క్షిపణి దాడులు జరుగుతుండగానే, గాజాపై ఇజ్రాయెల్ సైన్యం బాంబుదాడిలో 50మందికిపైగా అమాయకులు అసువులు బాశారు. వారి స్వదేశంలో వారి ప్రాణాలకు విలువలేదా?

గాజాపై ఇజ్రాయెల్ వినాశక దాడులు మొదలై మరో నాలుగు రోజుల్లో సంవత్సరం పూర్తి అవుతుంది. హమస్ తీవ్రవాదులు అపహరించిన తమ పౌరులను విడిపించుకునే నెపంతో గత సంవత్సరం అక్టోబర్ 7న ఇజ్రాయెల్ బాంబుదాడులు ప్రారంభించింది. ఇప్పటికి హతుల సంఖ్య 40వేలు దాటింది. హమస్ తీవ్రవాదులతోపాటు లెబనాన్‌లోని హిజ్బుల్లాలు, ఎమెన్‌లోని హైతీలను, ఇంకా సిరియా, ఇరాక్‌లలోని పాలస్తీనా తీవ్రవాద గ్రూపులను – ఏరివేసే దురుద్దేశంతో ఇజ్రాయిల్ ఏకపక్ష యుద్ధాన్ని విస్తృతం చేసింది. ఈ గ్రూపులకు ఇరాన్ ఆశ్రయమిచ్చిం ది, అన్నివిధాల సహాయం చేస్తున్నది. మాతృదేశం నుండి తరిమివేయబడి వివిధ అరబ్ దేశాల్లో ఆశ్రయం పొందిన పాలస్తీనియన్‌లనుండి పుట్టుకొచ్చినవే ఈ తీవ్రవాద గ్రూపులు. పాలస్తీనా స్వరాజ్య సమస్య పరిష్కారమైతే ఈ గ్రూపుల ఉనికి అవసరం కోల్పోతుంది. ఈ మూలసమస్యను పరిష్కరించే ప్రయత్నాలు చేయని అమెరికా దాని తొత్తు రాజ్యాలు పశ్చిమాసియాలో తమ స్వార్థ ప్రయోజనాలు, ఆధిపత్యం నిలుపుకునేందుకు ఇజ్రాయెల్‌ను ఉపయోగించుకుంటున్నాయి. ఇరాన్‌ను ఎలాగైనా యుద్ధంలోకి లాగి గతంలో పరాజయానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న కక్ష అమెరికాకు ఉంది. అణుకార్యక్రమం పేరుతో ఇరాన్‌పై ఆర్థిక ఆంక్షలు విధించినా ఆ ఇస్లామిక్ మత రాజ్యాన్ని అణచివేయటం, తమ చెప్పుచేతల్లోకి తెచ్చుకోవటం అమెరికా సామ్రాజ్యవాదులకు సాధ్యం కాలేదు. కాబట్టి దాన్ని కవ్వించే నిమిత్తం, హిజ్‌బొల్లా తీవ్రవాదులకు ఆశ్రయం ఇస్తున్నదన్న సాకుతో గత మార్చినెలలో డమాస్కస్(సిరియా)లోని ఇరాన్ కాన్సలేట్‌పై ఇజ్రాయిల్ యుద్ధ విమానాలతో దాడి చేయించింది. గత జులైలో టెహరాన్ (ఇరాన్ రాజధాని)లో హమస్ ముఖ్యనేత ఇస్మాయిల్ హనీయాను ఇజ్రాయిల్ హత్యచేసింది. కొద్దిరోజుల క్రితం బీరూట్(లెబనాన్)లో హిజ్‌బొల్లా నాయకుడు హసన్ నస్రుల్లాను, అతనితోపాటు ఇరాన్ గార్డ్స్‌కు చెందిన జనరల్ అబ్బాస్ నిల్‌ఫోరోషన్‌ను ఇజ్రాయిల్ గూఢచారి దళాలు హతమార్చాయి. దీనితో ఇరాన్ తమ మతాధిపతి, సుప్రీం నాయకుడు అయతుల్లా ఖమేనీని వారి నివాసం నుండి మరింత భద్రమైన ప్రదేశానికి తరలించాల్సి వచ్చింది. ఇజ్రాయెల్ దుశ్చర్యలతో ఆరునెలలుగా తాము పాటిస్తున్న సహనాన్ని ఇరాన్ కోల్పోయింది. హెచ్చరికగా మంగళవారం రాత్రి ఇజ్రాయిల్ నగరాలపై బాలెస్టిక్ మిస్సిలీలు ప్రయోగించింది. అమెరికా, ఇజ్రాయిల్‌లకు జ్ఞానోదయమైతే ఈ పరస్పరదాడులు ఇంతటితో ఆగాలి. పాలస్తీనా సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధి పూర్వకంగా సంప్రదింపులకు చొరవచూపాలి. అలాకాకుండా పాలస్తీనా తీవ్రవాదులను అణచివేయటమే తమ ప్రథమ కర్తవ్యంగా తమ యుద్ధోన్మాదాన్ని సమర్థించుకుంటూ దుందుడుకుతనం కొనసాగిస్తే పశ్చిమాసియా రావణాకాష్టమవుతుంది.

## బతుకుపాట

బతుకమ్మ బతుకు పాటలు
గ్రామీణ కన్నీటి గొంతు ధారలు
బతుకునే వన దేవతగా చేసి..
పాడేవే పూల పండుగ గీతాలు
ఈతి బాధల్లో నలిగిన నాలుకలు
సంస్కృతీ సంప్రదాయ ఏకరువులు
సహజ అమాయకత్వ గొంతుల్లో..
శతాబ్దాలుగా తల్లడిల్లి పెకిలిన గళాలు
సామాజిక గోసల సమ్మిళిత అల్లికలు
కన్నీటి గాథల ఆర్ద్రత ఆలాపనలు
రజాకార్ల దొరల గడీల్ని ఢీకొట్టే తూటాలు
వెతలను వెల్లబోసుకునే జనపదాలు
కష్టాల బతుకు పొలాల్లో మొలిచిన..
ఊరడింపులే బతుకమ్మ పూల పాటలు !
తీరు మారిన బతుకమ్మ పాటలు
డిజిటల్ అకాలంలో డిస్కో గీతాలు
కళ తప్పిన కృత్రిమ రాగ పోకడలు
సహజత్వాన్ని సమాధి చేసే బాణీలు
టీవీ చానెళ్ల ఎగుడు దిగుడు పాటలు
సభ్యత మరిచిన గోల గోల క్రీడలు
డిజే మోతలో బెదురుతున్న బతుకమ్మలు
ప్లాస్టిక్కు పేర్చిన పూల బతుకమ్మలు
వ్యాపారమైన బతుకమ్మ పాటల గోలలు
నవ్య నాగరికత చొచ్చిన పూల వేడుకలు
ప్రకృతి పాటల పండులకే ఆటంకాలు

# గర్వకారణమైన కమ్యూనిస్టు కామ్రేడ్ బర్ధన్

సురవరం సుధాకరరెడ్డి
సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి

కామ్రేడ్ బర్ధన్ (అర్ధేందు భూషణ్ బర్ధన్) చాలా నిరాడంబర జీవి. ఆయనా, నేను ఇద్దరం వివిధ రాష్ట్రాలలో పర్యటన చేస్తున్న సందర్భంగా పట్నాలో మన పార్టీ శాసనసభ్యుడి ఇంట్లో ఉండేవారం. అక్కడ మేము పార్టీ ఆఫీస్‌కి వెళ్లి తిరిగి సాయంకాలం వచ్చి వారి ఇంట్లో విశ్రాంతి తీసుకునేవారం. ఆ సందర్భంగా బర్ధన్ అనేకమంది ఇతర కమ్యూనిస్టు నాయకుల్లాగా తన బట్టలు తనే ఉతుక్కునేవారు. మేమిద్దరం బట్టలు ఉతుక్కుని ఆరేసి వెళ్లి వచ్చేవారం. ఒకసారి బర్ధన్ గారి బనియన్ కనబడలేదు. ఆయన వాళ్ళ అమ్మాయిని అడిగారు. వారి అమ్మాయి, 'బనియన్ పడేశాను, చినిగిపోయిన బనియన్లు ఎన్ని రోజులు పెట్టుకుంటారు? ''అంకుల్ ఇది నాకేమీ బాగోలేదు మార్కెట్‌కు వెళ్ళి ఒక మూడు కొత్త బనియన్లు కొనుక్కొని వచ్చాను'' అని తీసుకొచ్చి ఇచ్చింది. అలాగే మేము ఢిల్లీలో ఉన్నప్పుడు, బర్ధన్‌కి అవసరమైన బట్టలు కొన్ని నా భార్య డాక్టర్ బి.వి.విజయలక్ష్మి తీసుకొచ్చి ఆయనకు ఇచ్చేది. ఎందుకమ్మా ఇవన్నీ తెస్తారు 'ఇవన్నీ ఇంకా బాగున్నాయి, పాత బట్టలను పడేయాల్సిన అవసరం లేదు' అని ఎప్పుడూ అనేవారు. మా కుటుంబాలతో ఆయన చాలా ఆప్యాయంగా వుండేవారు. మా కుమారుల వివాహానికి హైదరాబాద్ వచ్చి ఆయన, చంద్రబాబు సాక్షి సంతకాలు చేశారు.

బర్ధన్ జన్మించి 100 సంవత్సరాలు అయింది. వారి కుటుంబం రెండు తరాల ముందు బంగ్లాదేశ్ నుంచి ఆనాటి మధ్యభారత్‌లోని నాగపూర్‌కు వచ్చి అక్కడ స్థిరపడ్డారు. విద్యార్థిగా ఉండగానే బర్ధన్ కమ్యూనిస్టు పార్టీవైపు ఆకర్షితులయ్యారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు, నాగపూర్ పట్టణ పార్టీ కార్యదర్శి హెచ్.కె.వ్యాస్ నుంచి పార్టీలో సభ్యత్వం పొందారు. బర్ధన్ నాగపూర్ యూనివర్సిటీ నుంచి ఎంఎ ఎకనామిక్స్, లా డిగ్రీ మొదటి శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జాతీయ నాయకుడిగా పనిచేశారు. అనేక దశాబ్దాల పాటు ఆయన కమ్యూనిస్టు ఉద్యమంలో, ట్రేడ్ యూనియన్ ఉద్యమంలో పనిచేశారు. లోతైన సిద్ధాంతపరమైన పరిజ్ఞానం కలిగిన కమ్యూనిస్టు నాయకుడు. ఆయన అద్భుతమైన వక్త. ఆయన ప్రసంగాలు ప్రజలను ప్రభావితం చేసేవి. మహారాష్ట్ర శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు, పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యసభకు వెళ్లమని కోరినప్పుడు ఆయన నిరాకరించారు. జీవితమంతా పార్టీకి అంకితం చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.

బర్ధన్‌తో దాదాపు 20 సంవత్సరాలపాటు కలిసి పనిచేసే అవకాశం నాకు కలిగింది. ఆయన భార్య చనిపోయిన తర్వాత, పూర్తి కాలం అజయ్ భవన్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలోనే ఉండేవారు. ఆయన కుమార్తె డాక్టర్ అల్కా, అల్లుడు అహ్మదాబాదులో ఐఐటి డైరెక్టర్. కుమారుడు అశోక్ బర్ధన్ ప్రొఫెసర్. ఒకసారి ఆయనకు ఆపరేషన్ జరిగినప్పుడు పార్లమెంట్ సభ్యుడిగా నాకు ఉన్న క్వార్టర్స్‌లో ఉండమని కోరితే ఆయన అంగీకరించారు. దాదాపు ఐదారు సంవత్సరాలు మేము కలిసి ఉన్నాం. నేను వి.పి.హౌస్‌లోకి సింగిల్ రూముకు మారేవరకు కలిసే వున్నాం. ఆయన ఎంత నిరాడంబర జీవితం గడుపుతారో ఆ రోజుల్లో బాగా అర్థమైంది. మేము కార్యాలయంలోనూ, సాయంకాలం ఇంట్లోనూ సైద్ధాంతిక రాజకీయ సమస్యలపై నిరంతరం చర్చించుకునేవాళ్లం. ఆయన దగ్గర నేను అనేక విషయాలను నేర్చుకున్నాను. ఆయన మార్క్సిజం, భారత రాజకీయాల గురించి నాకు అనేక విషయాలు వివరించేవారు.

''భారతీయ జనతా పార్టీకి అధ్యక్షుడిగా ఎన్నికైన నితిన్ గడ్కరి ఒక రోజు, హఠాత్తుగా మా ఇంటికి వచ్చారు. ఆర్.ఎమ్.ఎల్. హాస్పిటల్ ఎదురుగా మాకు కేటాయించిన ఎం.ఎస్.ఫ్లాట్స్‌లోని ఇంట్లో నేను ఆశ్చర్యపోయి చూస్తుండగా, ఆయన 'నేను బర్ధన్ గారికి శిష్యుడ్ని. భారతీయ జనతా పార్టీ అధ్యక్ష పదవిని స్వీకరించిన తర్వాత ఆయన ఆశీర్వాదం తీసుకోవడానికి వచ్చాను'' అని అన్నారు. ఆయన బర్ధన్ గారికి పాదాభివందనంచేసి, ఆశీర్వాదం తీసుకున్నారు. దాదాపు ఒక గంటసేపు విభిన్న విషయాలపై చర్చించారు. ఆయన వెళ్తూ నాకు కొన్ని పుస్తకాలు ఇచ్చారు. ఈ విధంగా, బర్ధన్ గారు విభిన్న రాజకీయ పార్టీల నాయకుల గౌరవాన్ని పొందినటువంటివారు. ఎన్‌సిపి నాయకులు శరద్ పవార్ ఆయనకు సన్నిహిత మిత్రులు. చాలా సరదాగా అనేక జోక్స్ చెప్పుకునేవారు.

కామ్రేడ్ సూర్జిత్ సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు వారిద్దరూ చాలా సన్నిహితంగా ఉండేవారు. ఆయనకు మరొక స్నేహితుడు మాజీ ప్రధానమంత్రి వి.పి.సింగ్. వి.పి.సింగ్‌ను కలవడానికి అనేకసార్లు బర్ధన్ నన్ను కూడా వెంట తీసుకెళ్లేవారు. యుపిఎ ప్రభుత్వాన్ని సిపిఐ, సిపిఎం బయట నుండి బలపరుస్తున్న రోజుల్లో, ఆయన మతోన్మాదం నుంచి దేశాన్ని రక్షించడానికి వామపక్ష, సెక్యులర్ ప్రజాతంత్ర పార్టీల ఐక్యత అవసరమని వివరించి యుపిఎ ప్రభుత్వాన్ని బలపరిచేందుకు పార్టీని ఒప్పించారు. వామపక్షాల ఐక్యత కోసం ఆయన తీవ్రమైన కృషి చేశారు. సిపిఐ(ఎం) నాయకులు ప్రకాశ్ కరాత్, సీతారాం ఏచూరి, ఇతర నాయకులు కూడా ఆయనను చాలా గౌరవించేవారు. అనేక సమస్యలపై ఆయనతో చర్చించి సలహాలు తీసుకొనేవారు. 2004లో మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు వామపక్షాలు బయట నుంచి మద్దతిచ్చాయి. దానికి షరతు కనీస ఉమ్మడి కార్యక్రమం. ఉభయ కమ్యూనిస్టు పార్టీల తరపున బర్ధన్, సీతారాం ఏచూరి, ప్రకాశ్ కారత్, డి. రాజా ఆ కమిటీలో ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు కూడా కమిటీలో ఉన్నారు. ముసాయిదా తయారుచేయడంలో బర్ధన్, సీతారాం ఏచూరి ప్రధాన పాత్ర వహించారు. అందులో కొన్ని ముఖ్యమైనవి గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు, గృహహింస నిరోధక చట్టం, అటవీ హక్కుల చట్టం తదితరాలు. దానివల్ల యుపిఎ ప్రభుత్వ గౌరవం పెరిగింది.

రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో ఎవరైనా మహిళపేరు సూచించమని సోనియా గాంధీ వామపక్షాలను కోరారు. సిపిఐ(ఎం) ఆ బాధ్యత బర్ధన్ మీద పెట్టింది. ఆయన రెండు, మూడు పేర్లు సూచించారు. ఆఖరికి ఆయన సూచించిన ప్రతిభా పాటిల్ పేరును సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్ అంగీకరించారు.

కేరళలో పార్టీ రాష్ట్ర మహాసభలకు వెళ్లినప్పుడు, మా ఇద్దరికీ, ఒక స్టార్ హోటల్లో గదులు ఇచ్చారు. ఒక రాత్రి ఉన్న తర్వాత ఆయన మహాసభ ప్రతినిధులు ఉన్న బసకు మార్చమని కోరారు. ఆ హోటల్ గదులు ఉచితంగా ఇచ్చారని చెప్పినా, అది మరీ విలాసవంతంగా ఉందని బస మార్పించారు. అజయ్ భవన్ గేటు ముందు మంగలితో క్షవరం చేయించుకునేవారు. గేటు పక్కన చెప్పులు కుట్టుకునే కామ్రేడ్ తార వచ్చి పార్టీ ఆఫీస్ క్యాంటీన్‌లో మాతోపాటు భోజనం చేసేవాడు. అతడు పార్టీ సభ్యుడు. అతను షూస్ కుడితే అందంగా, మన్నికగా ఉండేవి. సాయంకాలం పూట బర్ధన్ అజయ్ భవన్ గ్రౌండ్ ఫ్లోర్లో రెడ్ గార్డులతో కూర్చొని టీ తాగుతూ మాట్లాడేవాడు వారి కుటుంబ ఫంక్షన్లకు బర్ధన్, పల్లబ్, నేను వెళ్లే వారం. బర్ధన్ అనేక సంవత్సరాలపాటు పార్టీ ప్రధాన కార్యదర్శిగా పని చేసిన తర్వాత, హైదరాబాద్‌లో 2008లో జరిగిన పార్టీ మహాసభలో నన్ను ఉప ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. అంతకుముందు గిరిప్రసాద్ ఆ బాధ్యతలు నిర్వహించారు. అప్పటినుంచి మేము కలిసి పని చేశాం.

అంతకుముందు, నేను పార్టీ సెక్రటేరియట్‌లో దాదాపు పది సంవత్సరాలు పనిచేశాను. 2012లో పట్నాలో జరిగిన పార్టీ మహాసభ సందర్భంగా, ఆయన నన్ను ప్రధాన కార్యదర్శి పేరుకు ప్రతిపాదించినప్పుడు, నా ఆరోగ్యం రీత్యా, తర్వాత నాకు ఉన్నటువంటి పరిమితుల దృష్ట్యా బాధ్యత నెరవేర్చలేనని ఆయనతో చెప్పాను. కానీ, ఆయన, ''నేను నీ సలహా అడగలేదు, నీ అనుమతి అడగలేదు'' అని అన్నారు. సహజంగా, నాకంటే సీనియర్లు పార్టీ నాయకత్వంలో ఉండేవారు. వారందరినీ ఒప్పించి, ఆయన నన్ను ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేసి, ఆ తర్వాత నేను నా బాధ్యతలు కొనసాగించేందుకు అవసరమైన నిరంతర సహాయం చేసేవారు. ఇతర కామ్రేడ్స్‌ను వ్యాసాలు, బుక్‌లెట్స్ రాయమని ప్రోత్సహించేవారు. డి.రాజాతో దళిత సమస్యలపై, షమీమ్ ఫైజితో మైనారిటీ సమస్యలపై బుక్‌లెట్స్ రాయించారు. వివిధ అంశాల మీద వ్యాసాలు రాయమని నాకు సలహా ఇచ్చేవారు. ఆయన బెంగాలీ, హిందీ, ఇంగ్లీష్, మరాఠీ భాషలు అనర్గళంగా మాట్లాడేవారు. పార్టీ ఆఫీసులోనే మేము పక్కపక్క గదుల్లోనే ఉండేవారం. ఆయనతో చర్చించే చాలా విషయాలు నిర్ణయించేవారం. కొంతకాలం తర్వాత, ఆయన నిర్ణయాలు ప్రతిసారి నాతో చర్చించాల్సిన అవసరం లేదు. అత్యవసరమైనప్పుడే నాతో చర్చించండి, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకోండి అని చెప్పారు. అయితే, మా కోరిక మీద ఆయన పార్టీ కేంద్ర కార్యదర్శి వర్గంలో కొనసాగారు.

ఆ తర్వాత, పార్టీ ప్రోగ్రాం కమిషన్ శాశ్వత చైర్మన్‌గా ఆయనను ఎన్నుకున్నాం. వాస్తవానికి, కమ్యూనిస్టు పార్టీకి చాలాకాలం పార్టీ ప్రోగ్రాం మీద ఒక సమస్య ఉండేది. మారుతున్న పరిస్థితులను బట్టి, పార్టీ కార్యక్రమం పదేళ్లకు ఒకసారి లేదా 15 సంవత్సరాలకు ఒకసారి మారాలి.

హైదరాబాద్‌లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో పార్టీ ప్రోగ్రాంకు సంబంధించిన ఒక డాక్యుమెంట్‌ను మాత్రమే తయారుచేశాం, కానీ పూర్తి ప్రోగ్రాం తయారు కాలేదు. పార్టీ కార్యవర్గం కోరిక మేరకు బర్ధన్ పార్టీ ప్రోగ్రాం తయారుచేసి, దానిని కార్యవర్గం, కౌన్సిల్ ముందుంచా రు. ఆఖరికి పుదుచ్చేరిలో జరిగిన జాతీయ మహాసభలో కూలంకషంగా చర్చించి, దాన్ని అంగీకరించారు. నేను, ఈడ్పుగంటి నాగేశ్వరరావు, డి.రాజా, అతుల్ కుమార్ అంజన్, పలవ్ సేన్ గుప్తా ప్రోగ్రాం కమిషన్‌లో వున్నప్పటికీ ప్రధాన డ్రాఫ్ట్ బర్ధన్ తయారుచేశారు. ఈ ప్రోగ్రాం కమ్యూనిస్టు పార్టీకి మరింత స్పష్టతను తెచ్చింది. బర్ధన్ పార్టీకి చేసిన కాంట్రిబ్యూషన్‌లో ఇదొక ప్రధానమైన అంశం.

ఉత్తర భారతదేశంలో పార్టీ నిర్మాణం మీద ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. బిహార్ ఒకప్పుడు భారత కమ్యూనిస్టు పార్టీకి ఒక బలమైన కేంద్రం. అయితే, విభిన్న కారణాలవల్ల, ముఖ్యంగా కుల రాజకీయ పార్టీల వల్ల పార్టీ బలహీనపడింది. ఆయన బిహార్‌లో పార్టీ మహాసభ జరుపుదామని నిర్ణయించారు. బిహార్‌లో పార్టీ నిర్మాణం బాగోలేదని, చేయగలమా అని అందరికీ అనుమానం కలిగింది. సంవత్సరం పాటు ఆయన నెలకు ఒక వారం పది రోజులు బిహార్ వెళ్లి, జిల్లాల్లో కూడా పర్యటించి స్థానిక నాయకులకు మార్గనిర్దేశం చేసి, వారికి ఆత్మవిశ్వాసం కలిగించారు. బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలలో ఆయన జిల్లాలకు బస్సుల్లో, మోటార్ సైకిల్ మీద ప్రయాణం చేసేవారు. ఒక పర్యాయం ఢిల్లీ నుంచి మేము రైలులో మధుబని వెళ్లేందుకు స్టేషన్‌కు వెళ్తే మా ట్రైన్ రద్దయింది. ఎండాకాలం 43 డిగ్రీల వేడి. తర్వాత రైలుకు వెళ్దామనీ, రిజర్వేషన్ లేకపోయినా పర్లేదు అని ఆయన పట్టుబట్టారు. కాసేపటికి వడగాలికి ఆయన స్పృహ తప్పారు. నేను చాలా భయపడ్డాను. కొద్ది నిమిషాల్లోనే తేరుకున్నారు. అయినా ప్రయాణం చేయాలన్నారు. ఆ రైల్లో రద్దీవల్ల ఎక్కలేకపోయాం. ఆయనను గుర్తుపట్టిన ఒక ఫాదర్ చక్రాల కుర్చీ తెప్పించి బయట టాక్సీలో ఆఫీస్‌కు పంపించారు. ఆ రాత్రి విమానంలో పట్నా వెళ్లాం. 2012 సంవత్సరంలో పట్నాలో పార్టీ కాంగ్రెస్ విజయవంతంగా జరిగింది. 1967లో జరిగిన పట్నా మహాసభలకు ధీటుగా ప్రజలు లక్షల సంఖ్యలో బహిరంగ సభలో పాల్గొన్నారు. పార్టీ నిర్మాణం మెరుగుపడింది. ఆ మహాసభల్లోనే ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శి పదవినుంచి రిలీవ్ అయ్యారు. దళితులు, గిరిజనుల సమస్యల మీద ఆయన ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. పట్నాలో మహాసభ తర్వాత, ఆయన సూచన మేరకు, నాగపూర్‌లో దళితుల సమస్యలమీద ఎస్సీ కాంపోనెంట్ గురించి జాతీయసదస్సు ఏర్పాటు చేశాం. గిరిజనుల సమస్యలమీద ఆయన చాలా మంచి పుస్తకాలు రాశారు. మైనారిటీల సమస్యల మీద ఆయన రాసిన పుస్తకాలు పార్టీ కార్యకర్తలకు శిరోధార్యం అయ్యాయి. గిరిజన సంఘాన్ని పునరుద్ధరించారు. బర్ధన్ లాంటి నాయకులు పార్టీకి నాయకత్వం వహించడం గర్వకారణం. ఆయన కోరుకున్న శక్తిమంతమైన కమ్యూనిస్టు పార్టీ, వామపక్ష పునర్ ఐక్యత సాధించడానికి మనం ఈ శతాబ్ది ఉత్సవం సందర్భంగా మరోసారి ప్రతిజ్ఞ చేద్దాం.

**కామ్రేడ్ బర్ధన్‌కు రెడ్ సెల్యూట్!**


కామ్రేడ్ బర్ధన్‌తో సురవరం సుధాకరరెడ్డి (ఫైల్ ఫోటో)

# తెలంగాణ మహిళల 'పూల పండుగ' బతుకమ్మ

తెలంగాణ సాంస్కృతిక స్ఫూర్తి సూచిస్తుంది బతుకమ్మ పండుగ. బతుకమ్మ తెలంగాణలో మహిళల పూల పండుగ. ఈ పండుగ ప్రతి సంవత్సరం శాలివాహన క్యాలెండర్ ప్రకారం భాద్రపద అమావాస్య నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు. దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మ పండుగతో ముగుస్తుంది. బతుకమ్మ ఒక అందమైన పూల బంధం, వాటిలో ఔషధ విలువలతో, ఆలయ గోపు రం ఆకారంలో ఏడు కేంద్రీకృత పొరలలో వివిధ ప్రత్యేక కాలానుగుణ పుష్పాలతో అలంకరిస్తారు..'బతుకమ్మ' అంటే 'సజీవ మాతృ దేవత' అని అర్థం. మహాగౌరి బతుక మ్మ రూపంలో పూజలందుకుంటుంది. స్త్రీలకు మహా గౌరీదేవి ప్రధాన దేవత



బతుకమ్మ ఉత్సవం వెనుక ఒక పెద్ద చారిత్రక కథ ఉంది. వేములవాడ చాళుక్యులు రాష్ట్రకూట రాజుల ఉప సామంతులు. చోళ రాజులు, రాష్ట్రకూటుల మధ్య జరిగిన యుద్ధాలలో చాళుక్యులు రాష్ట్రకూటముల పక్షాన నిలిచారు. క్రీ.శ 973లో రాష్ట్రకూట ఉపసామంత చాళుక్య ప్రభువు తైలపుడు2 రాష్ట్రకూట రాజుల చివరి రాజు కర్కుడు2ను ఓడించి స్వతంత్ర కళ్యాణి చాళుక్య రాజ్యాన్ని స్థాపించా డు. ప్రస్తుత తెలంగాణా ప్రాంతం అప్పుడు ఆయన అధికారంలో ఉండేది. క్రీ.శ.997లో తైలపుడు2 మరణానంతరం అతని కుమారుడు సత్యాశ్రయుడు రాజరికం చేపట్టాడు. పూర్వపు వేములవాడ రాజ్యంలో (ప్రస్తుత కరీంనగర్ జిల్లా), రాజరాజేశ్వర దేవాలయం ప్రసిద్ధి చెందింది. రాజరాజేశ్వరుడు ప్రజల ఆరాధ్య దైవంగా పూజలు అందుకున్నాడు.

చోళ రాజు, పరాంతక సుందర చోళుడు రాష్ట్రకూట రాజుల దాడిని రక్షించే సమయంలో ఇబ్బందుల్లో పడగా, కష్టాల్లో ఉన్నవారికి రాజరాజేశ్వరుడు సహాయం చేస్తాడని తెలుసుకున్న పరాంతక చోళుడు ఆయన భక్తుడిగా మారిపోయాడు. కొడుకుకు రాజా రాజా అని పేరు పెట్టినట్లు అరికేసరి శాసనం ద్వారా తెలుస్తుంది. క్రీ.శ.985–1014 మధ్య రాజరాజ చోళుడు పాలించాడు. అతని కుమారుడు రాజేంద్ర చోళుడు సైన్యాధ్యక్షుడిగా దాడిచేసి సత్యాశ్రయం పై విజయం సాధించాడు.

ఆ విజయానికి చిహ్నంగా ఆయన రాజేశ్వరుని ఆలయాన్ని ధ్వంసం చేసి, బృహత్(భారీ) శివలింగాన్ని తండ్రి కి బహుమతిగా ఇచ్చాడు. క్రీ.శ.1006లో రాజరాజ చోళుడు ఈ భారీ శివలింగానికి (బృహదీశ్వరుడు) ఆలయాఒన్ని నిర్మించడం ప్రారంభించి,1010లో లింగ ప్రతిష్ఠాపన చేసాడు. ఈ బృహదీశ్వరాలయాన్ని వేములవాడ చాళుక్య రాజ్యంపై దాడిలో దోచుకున్న సంపదతో నిర్మించినట్లు చోళ రాజులు తమిళ శాసనాల్లో ప్రకటించారు. ఇప్పటికి కూడా వేములవాడ భీమేశ్వరాలయంలోని శివలింగానికి, తంజావూరు బృహదీశ్వరాలయంలోని శివలింగానికి పోలికలు కనిపిస్తాయి.

వేములవాడ నుంచి తంజావూరుకు శివలింగాన్ని తీసుకెళ్లడం తెలంగాణ ప్రజలను కృంగదీసింది. ఇక్కడి ఆలయంలో పార్వతి (బృహదమ్మ)ని ఓదార్చడానికి బతుకమ్మను మేరు పర్వతం వంటి పూలతో ఏర్పాటు చేస్తారు. దాని పైభాగంలో పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి, తొమ్మిది రోజులు పాటలు, ఆటలతో గణిస్తారు. ఆమెను నీటిలోకి పంపడం, ఆమెను తిరిగి పిలవడం ఒక పండుగ రూపం దాల్చింది. బతుకమ్మ పేరు బృహదమ్మ నుండి వచ్చిందట. బతుకమ్మ పండుగ 1000 సంవత్సరాల నుండి పాటిస్తున్న సామాజిక ఖండన ఉద్యమం. శివుడు లేని మాతృమూర్తి పార్వతి పేరుతో పాటలు మాత్రమే పాడతారు.

ఒకప్పుడు చోళ వంశానికి చెందిన ధర్మాంగద రాజు దక్షిణ భారతదేశాన్ని పరిపాలించేవాడు. అనేక ప్రార్థనలు ఆచారాల తరువాత, ఆయన భార్య లక్ష్మీ దేవికి జన్మనిచ్చింది. ఎన్నో ప్రమాదాల నుంచి బాలిక లక్ష్మి బయట పడింది. అందువల్ల, తల్లిదండ్రులు ఆమెకు బతుకమ్మ అని పేరు పెట్టారు. అప్పటి నుంచి తెలంగాణలోని యువతులు బతుకమ్మ పండుగను జరుపుకుంటున్నారు.

మొదటి ఐదు రోజుల్లో మహిళలు గృహ ప్రాంగణా న్ని శుభ్రంచేసి అలంకరిస్తారు. మొదటి ఐదు రోజులు ఆవు పేడతో బతుకమ్మను తయారుచేస్తారు. శఖు ఆకారం లో ఐదు చిన్న ముద్దలు అమరుస్తారు. ఇంట్లో పురుషులు బతుకమ్మ పువ్వులు (సెలోసియా, సెన్నా, మేరిగోల్డ్, క్రిసాన్తిమం, ఇండియన్ లోటస్, సీతాఫలం ఆకులు మొదలైన వాటిని)సేకరిస్తారు, ఇవి బంజరు మైదానాలలో ఈ కాలంలో వివిధ రంగులలో వికసిస్తాయి.

బతుకమ్మను సిద్ధంచేయడం ఒక జానపద కళ. మహిళలు మధ్యాహ్నం నుంచి బతుకమ్మను సిద్ధం చేస్తారు. తొమ్మిది రోజులు సాయంత్రం వేళల్లో, మహిళలు ముఖ్యంగా యువతులు తమ బతుకమ్మలతో తమ ప్రాంతంలోని బహిరంగ ప్రదేశాల్లో పెద్ద సంఖ్యలో చేరుకుని బతుకమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేసి, చప్పట్లు కొట్టి, చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడటం అహ్లాదకరంగా ఉంటుంది. .

ఆంధ్రప్రదేశ్లో విశాఖపట్నం వంటి కొన్ని నగరాల్లో కూడా ఈ వేడుక జరుపుకుంటారు. మహిళను సన్మానించుకోవడం ఇందులో ప్రాధాన్యత. ఈ పండుగ సమయం లో మహిళలు సంప్రదాయంగా చీర, ఆభరణాలు ధరిస్తా రు. యువతులు బాలికలు లంగాఓణి/చోళీని ధరించి, ఆభరణాలతో సంప్రదాయక వేషధారణలో కనిపిస్తారు. అవివాహితులకు తమ కోరిక మేరకు భర్తలు లభిస్తారని, అత్తమామలను, భర్తను ఎలా చూసుకోవాలో, వివరించడం ఈ పండుగ ఉద్దేశం. స్త్రీలు గౌరవనీయులు కావాలని, తమ కుటుంబానికి ఆరోగ్యం శ్రేయస్సు కోసం దేవతను ప్రార్థించడానికి పండుగ జరుపుకుంటా రు.

నందిరాజు రాధాకృష్ణ,
వయోధిక పాత్రికేయుడు, 98481 28215)

# తెలంగాణ భగత్ సింగ్, రజాకర్లపై తిరగబడ్డ వీరుడు నారాయణ రావు పవార్



నారాయణ రావు పవార్ 1926, అక్టోబరు 3న వరంగల్‌లో జన్మించారు. నాలుగేళ్ల వయసులోనే తల్లిని కోల్పోయాడు. ఈయన తండ్రి పండరీనాథ్ బీదర్ జిల్లా నుంచి వరంగల్‌కు వలస వచ్చాడు. పవార్ ఎనిమిదో తరగతిలో ఉండగానే ఆర్య సమాజానికి దగ్గరయ్యాడు. పండిత్ రుద్రదేవ్, పండిత్ నరేంద్రజీలను తన గురువులుగా ప్రకటించుకున్నాడు. 1944లో ఇంటర్ పాసై లా కోర్సు చేయాలని అందులో చేరినా ఆర్థిక పరిస్థితుల కారణంగా దాన్ని కొనసాగించలేదు. రేషన్ డిపార్ట్‌మెంటులో ఎన్యుమరేటర్‌గా చేరి కొంత ఆర్థికంగా నిలదొక్కుకొని లా కోర్సు చేయడానికి హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ కొంతమంది యువకులను చేరదీసి 'యువ క్రాంతి దళ్' ఏర్పాటు చేశారు. దానికి కొండా లక్ష్మ ణ్ బాపూజీ సలహాదారుగా వుండి కొంత ఆర్థిక సహాయం కూడా చేసేవారు. ఆ విధంగా ఆర్య సమాజ కార్యక్రమాలలో పాల్గొంటూ న్యాయవాద విద్యను కొనసాగించాడు. 'లా' కోర్సులో భాగంగా ప్రతి రోజు హైకోర్టులో జరిగే వకాలత్ కోర్సులకు వెళ్లేవాడు. ఒకనాడు వకాలత్ కోర్సుకు వెళుతుండగా నారాయణ రావు మిత్రుడు వకాలత్ క్లాసులు ఎలా వుంటాయో చూడాలని వెంట వచ్చాడు. ఆలా వారు వెళుతుండగా నయాపూల్ వంతెన వద్ద పోలీసులు వాహనాల రాకపోకలను ఆపేశారు. ప్రతి రోజు నిజాము నవాబు దారుల్ షిఫాలోని తన తల్లి సమాధిని దర్శించుకోడానికి వెళ్లివస్తుంటాడు. నిలబడి వున్న నారాయణ రావు మిత్ర బృందం కారులో వెళుతున్న నిజామును చూశారు. అప్పుడు మిత్రబృందంలోని ఒకడు అనాలోచితంగా, హఠాత్తుగా తన మిత్రులతో 'నిజామును చంపుదామా....' అన్నాడు. అందరు సరేననుకొని ప్రణాళికను రూపొందించుకున్నారు. వీరందరూ సుభాష్ చంద్ర బోస్ ఉపన్యాసాలను శ్రద్ధగా చదివేవారు. అందులో అతని నినాదం 'మీరు మీ రక్తాన్నివ్వండి...నేను మీకు స్వాతంత్రం ఇస్తాను...' అన్న మాటలు వీరందరినీ ఉర్రూతలూగించింది. నారాయణరావు, పండిత విశ్వనాథ్ బొంబాయి వెళ్లి బాంబులు కొనాలని బయలు దేరారు. మార్గమధ్యంలో షోలా పూర్ వద్ద లక్ష్మ ణ రావు బాపూజీ వీరికి కనబడ్డాడు. అప్పటికే లక్ష్మ ణ రావు ప్రముఖ క్రిమిల్ లాయరు. బాంబు లెందుకని లక్ష్మ ణ రావు అడగగా రజాకార్లను చంపడానికని అబద్ధం చెప్పారు. దాంతో అతను నిజామునె ఎందుకు చంప కూడదు? అని సూటిగా అన్నాడు. దాంతో వీరు అసలు సంగతి చెప్పేసారు. దాంతో లక్ష్మ ణరావు వీరికి ఆరు వందల రూపాయలిచ్చి జాగ్రత్తలు చెప్పి పంపా డు.

హైదరాబాద్ వచ్చి వివరంగా ఒక ప్రతిజ్ఞా పత్రాన్ని తయారు చేశారు. వీరు నిజాంను ఎందుకు చంపాలను కున్నది? దాని సారాంశం ఒక పత్రంలో రాసి, ఆ రాసిన నకలును నారాయణ స్వామి వద్ద వుంచారు. పథకం అమలు చేసిన రోజు నారాయణ స్వామి బెజవాడ వెళ్లి ఆ నకలు పత్రాన్ని, ముగ్గురు మిత్రులు కలిసి తీసుకున్న పోటోను, పత్రికల వారికి, రేడియో వారికి అందజేయాలని ముందె నిర్ణయించుకున్నారు. ప్రతిజ్ఞాపత్రంపై ముగ్గురు మిత్రులు అనగా నారాయణ రావు పవార్, జగదీష్, గండయ్య తమ రక్తంతో సంతకం చేశారు. డిసెంబరు నెల నాల్గవ తారీఖు 1947 సాయంకాలం నాలుగు గంటల సమయం... కింగ్ కోటి రోడ్డు, నిజాం నివాసముందు. రోడ్డు పై ముగ్గురు మిత్రులు దూర దూరంగా అక్కడక్కడా నిలబడాలి, మొదటి వ్యక్తి విఫలమైతే రెండో వాడు పని కానిచ్చాలి, అక్కడా తప్పితే మూడో వాడు పథకాన్ని అమలు కానివ్వాలి. ఇది వారి పథకం. కింగ్ కోఠి రోడ్డులో ప్రతి చౌరస్తా వద్ద ఒక పోలీసు మరొక జవాను ఉన్నారు. కానిస్టేబుల్ ట్రాపిక్ ను నియంత్రిస్తే జవాను ఆ చుట్టు పక్కల తిరుగుతున్న జనాలపై నిఘా పెడుతున్నాడు. నారాయణ రావు గల్లీలోంచి రోడ్డు పైకి వచ్చి తన సైకిల్‌ను గోడకు ఆనించాడు. ఇది జవాను గమనించాడు. అప్పటికే నిజాము కారు రెండో కానిస్టేబులు వద్దకు వచ్చింది. ఇంతలో నారాయణరావు సంచిలో నుండి బాంబును బయటి తీసి దాని 'పిన్' లాగి నిజాం వస్తున్న కారు పైకి విసిరాడు. అది పెద్ద శబ్దంతో పేలిపోయింది. కారు మాత్రం తప్పించుకుంది. నారాయణ రావు జేబులో చేయి పెట్టి రివాల్వర్ తీసే లోపే జవాను వచ్చి అతని చెయ్యి పట్టుకున్నాడు. అతను విషం మింగే అవకాశం కూడా లేదు. బాంబు శబ్దం విన్న మిగతా ఇద్దరు పథకం సఫలం అయిందని అక్కడి నుండి తప్పుకున్నారు. లేకపోతే నిజాముకు ఇదే ఆఖరి రోజు అయ్యేది. నారాయణ రావును పోలీసులు చుట్టుపక్కల వున్న ప్రజలు విచక్షణా రహితంగా కొట్టారు.

పోలీసు స్టేషనులో విచారణ సమయంలో నారాయణ రావుని నీవు హిందువువా ముస్లింవా, నీ పేరేమిటని అడగ్గా హిందు/ ముస్లిం తేడా తెలియకుండా వుండడానికి తన పేరు 'బాబు' అని అన్నాడు. ఆ మరు దినం ఎదురు సెల్ గదిలో గండయ్య ఉన్నాడు. పోలీసులు వరంగల్లు వెళ్లి నారాయణ రావు ఇంటిని శోధించారు. నారాయణ రావు తండ్రి తన కొడుకు అంత సాహసికుడు కాదన్నాడు. నిజ నిర్ధారణకు, అతడిని హైదరాబాదు తీసుకొచ్చి ఖైదీని చూపగా అతడు తన కొడుకే నని ఒప్పుకున్నాడు. ఆ తండ్రి తన కొడుకు ఇంత పనిచేశాడని కోప్పడలేదు, కొట్టలేదు, అసహ్యించు కోలేదు. విచారణ సమయంలో నారాయణ రావు తండ్రి వచ్చినప్పుడు మిఠాయి తెచ్చి ఇచ్చేవాడు. చివరకు అత్యున్నత న్యాయస్థానం నారాయణ రావు పవార్‌కు ఉరి శిక్ష విధించింది. 1948 సంవత్సరం, సెప్టెంబరు 17 న నిజాము నవాబు వల్లబాయి పటేల్ ముందు లొంగిపోగా, హైదరాబాద్ స్టేట్ స్వతంత్ర భారత్‌లో విలీనం అయిపోయింది. హైదరాబాద్ సంస్థానం విముక్తి తర్వాత మిలిటరీ గవర్నర్ మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి వారి ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చాడు. కాని వివిధ సంస్థల ఆందోళనతో 1949 ఆగస్టు 10న జనరల్ చౌదరి వీరిని విడుదల చేశారు. నారాయణరావు పవార్ 85 యేళ్ళ వయసులో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో, 2010, డిసెంబర్ 8న కన్నుమూసాడు.

**(అక్టోబర్ 3న నారాయణరావు పవార్ జయంతి సందర్భంగా)**

కామిడి సతీష్ రెడ్డి, 9848445134.

# విచారణ జరిగేనా..?



## సిఎంఆర్ కుంభకోణంలో అధికారులదే కీలకపాత్ర

### చర్యలు తీసుకోండి : సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/ఖమ్మం :** కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) కుంభకోణం ఇప్పుడు రాష్ట్రవ్యాప్త చర్చకు దారి తీసింది. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో గుర్తింపు పొందిన రైస్ మిల్లులకు ధాన్యం సరఫరా చేస్తుంది. రైస్‌మిల్లుల యాజమాన్యం ఆ ధాన్యాన్ని మర ఆడించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. దీనినే కస్టమ్స్ మిల్లింగ్ రైస్ అంటారు. ఇందుకు సంబంధించి ధాన్యాన్ని పొందిన రైస్ మిల్లులు ధాన్యం విక్రయించి ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేయటం లేదు. బియ్యం సరఫరా చేయనప్పుడు రైస్ మిల్లుల ధాన్యం నిలువ ఉండాలి, కాని బియ్యం రాక ధాన్యం లేకపోవడంతో అధికార యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. గడిచిన పదేళ్ల కాలంలో రైస్ మిల్లర్స్ లేవి ఇవ్వకుండా ఉండడం అయినా ఆ రైస్ మిల్లులకే మరుసటి ఏడాది కూడా ధాన్యం ఎగుమతి చేయడం అధికారులకు అలవాటుగా మారింది. లేవి ఇవ్వని రైస్ మిల్లులపై చర్యలు ఎందుకు తీసుకోవటం లేదన్న ప్రశ్నకు అధికారుల వద్ద సమాధానం లేదు. కోట్ల రూపాయల కుంభకోణంలో రైస్ మిల్లర్లతో పాటు అధికారులు కీలకపాత్ర పోషించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. లేవి ఎగవేసినందుకుగాను మిల్లర్ల నుంచి అధికార యంత్రాంగానికి భారీగానే ముడుపులు ముట్టినట్లు సమాచారం. మమ్మల్ని వదిలి వేసేందుకు భారీగా ముట్టజెప్పామని, ఇప్పుడు లేవి జరిమానాలు అంటే ఎలా అని కొందరు రైస్ మిల్లర్స్ ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. సిఎంఆర్ కుంభకోణంలో తొలుత అధికారుల నుంచే విచారణ ప్రారంభిస్తే మొత్తం కుంభకోణం వెలుగు చూసే అవకాశం ఉందని రైస్ మిల్లర్లు అంటున్నారు. కొణిజర్ల మండలంలోని ఒక రైస్ మిల్లులోనే రూ.81 కోట్ల సిఎంఆర్ ధాన్యం మాయమైతే మిగిలిన ప్రాంతాలలో ఉన్న రైస్ మిల్లుల్లో కొన్ని కోట్ల రూపాయల మేర కుంభకోణం జరిగి ఉండవచ్చునన్న చర్చ సాగుతుంది.

**అమాత్యుల ఆదేశాలు ఫలించేనా...** జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు సిఎంఆర్ అవకతవకలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి కారకులను శిక్షించాలని వేర్వేరు ప్రకటనలు జారీ చేశారు. సిఎంఆర్‌కు సంబంధించి ప్రకటన ఇవ్వకపోతే ఎక్కడ వెనకబడిపోతామో అన్న భావన కలిగేలా ప్రకటనలు వెలువడ్డాయి. సిఎంఆర్ వ్యవహారంలో ఇన్ని ప్రకటనల తర్వాతనైనా కారకులపై చర్యలు తీసుకుంటారా అంటే ఎందుకో అనుమానం కలుగుతుంది. అశ్వారావుపేటలో ఇదే రకమైన కుంభకోణం వెలుగుచూసినప్పటి నుంచి ఆరంభ శూరత్వం అన్నట్లు హడావుడి ప్రకటనలు చేయడం తర్వాత వదిలి వేయడం అలవాటుగా మారింది. కోట్లాది రూపాయల అవినీతికి సంబంధించి ఈ వ్యవహారంలోనైనా ఫలితం వస్తుందని ఆశిద్దాం.

**విచారణ జరిపి చర్యలు తీసుకోండి :** సిఎంఆర్ కుంభకోణంలో రైస్ మిల్లుల యజమానులు, అధికారులపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ డిమాండ్ చేశారు. ప్రతి యేటా అధికారులు, రైస్ మిల్లర్లు కలిసి కోట్లాది రూపాయల ప్రజా ధనం దుర్వినియోగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వంలో ఉన్న ఎవరినో ఒకరిని ఆశ్రయించి ముడుపులు చెల్లించి యథేచ్ఛగా లేవి ఎగవేస్తున్నారని ప్రసాద్ తెలిపారు. ఖమ్మం జిల్లాలో కోట్లాది రూపాయల అవినీతి జరిగినా, సిఎంఆర్ కుంభకోణాలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలని, కారకులైన వారిని తగు రీతిలో శిక్షించాలని లేని పక్షంలో సిపిఐ పక్షాన ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

# పోరాటాలతో హక్కుల సాధన

### సిపిఐ భద్రాచలం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/భద్రాచలం :** పోరాటాలతోనే అసంఘటితరంగ కార్మికుల హక్కులు పరిరక్షించబడతాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి, ఎఐటియుసి గౌరవ అధ్యక్షుడు ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. చుంచుపల్లి మండల పరిధిలోని విద్యానగర్ కాలనీలో ఎఐటియుసి అనుబంధ జిల్లా మార్బుల్స్ టైల్స్,అండ్ గ్రానెట్స్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు ఎఐటియుసి పోరాటాల ఫలితమే అన్నారు. సమిష్టి నిర్ణయాలతో సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, నాయకులు వాసిరెడ్డి మురళీ, పోగుల కోటేశ్వరరావు, సంఘం నాయకులు టి మల్లేష్, ఎం.చిన్న, ఆర్.రాజు, ఎస్‌కే ఛాంద్, ఏ.సారయ్య, ఎల్.బలరాం, రవిచందర్, కిరణ్, హత్తిరామ్, రాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ కార్మికులను ఆదుకోండి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** రెక్కాడితే కానీ డొక్కాడని పంచాయతీ కార్మికులను ఆదుకోవాలని సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్ అన్నారు. బుధవారం ఏదులాపురం గ్రామంలో పంచాయతీ కార్యదర్శికి కార్మికులపై జరుగుతున్న కుట్రపై సిపిఐ ఆధ్వర్యంలో విన్నవించారు. పంచాయతీ కార్మికులు అంటే ప్రజలందరికీ జవాబుదారితనంగా పనిచేస్తారని, అంతేకానీ రాజకీయ నాయకులకు కాదన్నారు. కార్మికులు రాజకీయాలు చేసి ప్రజల మధ్య అంతరాలు సృష్టిస్తే తప్పకుండా చర్యలు తీసుకోవాలని, అంతేకానీ స్వార్థపూర్వకంగా వ్యవహరిస్తూ నాయకులుగా చలామణి అవుతున్న కార్మిక వ్యతిరేకుల అసత్య ఆరోపణలు నమ్మి పంచాయతీ కార్మికులను ఇబ్బందులు పెట్టవద్దని ఆయన కోరారు.

# పెన్షన్లు సకాలంలో అందజేయాలి

### సిపిఐ మండల కార్యదర్శి ఆనందరావు




**ప్రజాపక్షం/ బోనకల్:** వృద్ధులు, వికలాంగులు, వింతువులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బిడి కార్మికులకు సకాలంలో పెన్షన్‌లు అందజేయాలని సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు డిమాండ్ చేశారు. మండలంలోని చిరునోముల గ్రామంలో గుంపుల జయరాజు అధ్యక్షతన సిపిఐ గ్రామ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా సకాలంలో పెన్షన్ అందజేయకపోవడం బాధాకరమన్నారు. కొంతమందికి మూడు నెలలు కావస్తున్నా పెన్షన్లు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు తూము రోషన్‌కుమార్, మండల సహాయ కార్యదర్శులు జక్కుల రామారావు, ఆకెన పవన్, ఏనుగు రవికుమార్, కొంగర భాస్కర్‌రావు పాల్గొన్నారు.

# ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

### ఇద్దరి పరిస్థితి విషయం

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలయిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఎట్టి రామస్వామి కుమారుడు ఎట్టి ప్రణయ్ తేజ్, కుంజ లక్ష్మయ్య కుమారుడు కుంజ ప్రవీణ్ మండల పరిధిలోని అనంతోగులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో తిర్లాపురం సమీపంలో మకలకట్టే వర్రె దగ్గర ఆర్టీసీ బస్సు ఢీ కొని ఇద్దరు తీవ్రగయాలతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. క్షతగాత్రులను 108కు సమాచారం అందించగా మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం తరలించారు. జిల్లా కేంద్రానికి వెళ్లే రహదారి సింగిల్ రోడ్డు కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అధికారులు రోడ్డు మంజూరు చేసి ప్రమాదాల బారి నుండి రక్షించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఎస్‌ఐ రతీష్ ఘటన స్థలికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# లారీ బోల్తా పడి డ్రైవర్ మృతి

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అయ్యన్నపాలెం మూలమలుపు వద్ద మిషన్ భగీరథ పైపులు లోడుతో వస్తున్న లారీ అదుపు తప్పి బోల్తా కొట్టడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోచోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రేణిగుంట నుండి కొత్తగూడెం వెళ్తున్న లారీ మంగళవారం అర్ధరాత్రి అదుపు తప్పి బోల్తా కొట్టింది. ప్రమాదంలో లారీ డ్రైవర్ ఏనుగు నవీన్‌కుమార్(32) అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ స్వప్న కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# రోడ్డు ప్రమాదాలపై సిపి కౌన్సిలింగ్

**ప్రజాపక్షం/కారేపల్లి:** మండల పరిధిలోని బొద్రాస్ కుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, ఒకరు చికిత్స పొందుతున్నారు. కాగా ఆక్సిడెంట్ జరిగిన ప్రదేశాన్ని బుధవారం లా అండ్ ఆర్డర్ అడిషనల్ సిపిప్రసాదరావు సందర్శించి, ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొని, పలు సూచనలు చేశారు. అనంతరం వాహనాల తనిఖీలు నిర్వహించి, వాహనదారులను ఉద్దేశించి రోడ్డు ప్రమాదాలపై కౌన్సిలింగ్ చేశారు. కార్యక్రమంలో కారేపల్లి రూరల్ సిఐ బి తిరుపతిరెడ్డి, ఎస్‌ఐ ఎన్.రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి తోలకాలను నిలిపివేయండి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జాతీయ రహదారి నిర్మాణం కోసం గుట్ట మట్టిని తీయటం వెంటనే నిలిపివేయాలని బుధవారం జరిగిన గ్రామ సభలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామ అవసరాలకు మట్టి లేకుండా ఉన్నదంతా తీసుకెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మట్టి రహదారులు చాలా ఉన్నాయన్నారు. గ్రామం అవసరాల కోసం మట్టి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లలేమని..మా భూమి..మా మట్టి మాకే కావాలని గ్రామస్తులు ముక్తకంతంతో తెల్చి చేప్పారు. గ్రామసభకు సంబంధిత కంపెనీ వారిని పిలిపించి పనులు నిలిపివేశారు. కార్యక్రమంలో ఈవూరి శ్రీనివాసరెడ్డి, ఆకుల వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, యడవల్లి శ్రీను, సూరేపల్లి రవి, ఆకులు సుధాకర్, గెల్లా హరి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనుల సమగ్రాభివృద్ధికి పథకాలు

### అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గిరిజనుల సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి జన జాతీయ ఉన్నత గ్రామ అభయాన్ పథకాన్ని ఖమ్మంజిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పిఎంజెయుజిఏ సంబంధించి రూపొందించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సామాజిక, ఆర్థిక పరిస్థితులను మెరుగుపరుస్తూ వారి జీవన ప్రమాణాలు పెంచేందుకు ప్రభుత్వం పిఎంజెయుజిఏ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ ఉపసంచాలకులు ఎన్.విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు కె.సత్యనారాయణ, గిరిజన సంక్షేమశాఖ కార్యాలయ ఎఒ ఎ.నారాయణరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ పాల్గొన్నారు.

# కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలి

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు మంజూరు చేయాలని మాజీ ఎంపిటిసి యన్నం వెంకటేశ్వర్లు అన్నారు. ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మండల పర్యటనలో భాగంగా మోరంపల్లిబంజర్‌లోఆయనను కలిసి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ ఆఫీస్ మణుగూరు సెంటర్ పాయింట్ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. కార్మికులు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులకు దరఖాస్తు చేసుకుని సంవత్సరం గడుస్తున్నా కార్డులు రాలేదన్నారు. కార్మికులు ఇన్సూరెన్స్ క్లైమ్ కోసం దరఖాస్తు పెట్టుకొని సంవత్సరాలుగా వేచి చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు. లేబర్ ఆఫీసర్ కార్మికులను ఇబ్బంది పెడుతున్నారని ఎమ్మెల్యేకు ఫిర్యాదుచేశారు.కార్యక్రమంలో పలువురు భవన నిర్మాణ సంఘం కార్మికులు పాల్గొన్నారు.

# అహింసా సిద్ధాంతాన్ని చాటిన మహనీయుడు గాంధీ



### ఘనంగా మహాత్మాగాంధీ జయంతి

**ప్రజాపక్షం/భద్రాచలం :** జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల లు వేసి నివాళులర్పించారు. అశ్వాపురం మండలం ఆయుర్వేద ఆస్పత్రిలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి అహింసా సిద్ధాంతాన్ని చాటిచెప్పిన మహనీయుడు గాంధీ అన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ఐటిడిఎలో...** అహింసా మార్గాన్ని చూపిన మార్గదర్శి మహాత్మాగాంధీ అని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని ఐటిడిఎలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ స్వరాజ్య స్థాపన కోసం బ్రిటీష్ వారిని శాంతియుత కార్యక్రమంలో ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

**ఖమ్మం అర్బన్ :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీ మార్గదర్శకాలను మనమంతా పాటించాలని కలెక్టర్ తెలిపారు.



**మహాత్మాగాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శం...** మహాత్మా గాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శమని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తెలిపారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**సిపి కార్యాలయంలో...** మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్ర పటానికి పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపిలు నరేష్‌కుమార్, ప్రసాదరావు, ఎఒ అక్తరున్నీసాబేగం, ఆర్‌ఐ కామరాజు, సెక్షన్ సూపరింటెండెంట్ జానకిరాం, ఐటి కోర్ టీమ్, మినిస్ట్రీల్ స్టాఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### మహాత్ముడి ఆశయాలను ముందుకు తీసుకెళదాం

**భద్రాచలం :** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ముందుకు తీసుకెళదామని ఎమ్మెల్యే డా.తెల్లం వెంకట్రావు అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆయన క్యాంపు కార్యాలయంలో బాపూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.






# గ్రామ సభలతో సమస్యలు పరిష్కారం

### అదనపు కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** గ్రామ సభలు నిర్వహించుకోవడం ద్వారా సమస్యల పరిష్కారానికి అవకాశం కలుగుతుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి. శ్రీజ తెలిపారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన రఘునాథపాలెం గ్రామ పంచాయతీలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. తొలుత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి అదనపు కలెక్టర్ శ్రీజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలే దేశానికి పట్టుకొమ్మలని గాంధీజీ తెలిపారన్నారు. గ్రామ స్వరాజ్యం కోసం గాంధీజీ కలలు కన్నారన్నారు. గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభలు నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ సభలలో అధికారులు కూడా పాల్గొంటారు కాబట్టి ప్రజలు లేవనెత్తిన సమస్యలను సత్వరమే పరిష్కరించే అవకాశం కలుగుతుందన్నారు. గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటు ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలన్నారు.అనంతరం స్వచ్ఛత హీ సేవ ప్రతిజ్ఞ చేశారు. పల్లె దవాఖానాలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి నాగలక్ష్మి, ఎంపిడిఒ అశోక్‌కుమార్, ఎంపిఒ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వి.వెంకటాయపాలెం గ్రామ పంచాయతీలో నిర్వహించిన గ్రామసభలో గ్రామ ప్రత్యేకాధికారి, డిఎల్‌పిఒ రాంబాబు పాల్గొన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించారు. ఉపాధి హామీ పనుల గుర్తింపు నిర్వహించారు. గ్రామ పంచాయతీ సిబ్బందిని సన్మానించి ఇన్సూరెన్స్ బాండ్స్ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కృష్ణ, మాజీ సర్పంచ్ రావెళ్ల మాధవి, ఎంపిటిసి యరగర్ల హన్మంతరావు, కిలారు వెంకటరమణ, చంద్ర సత్యంబాబు, జంగాల శ్రీను, కుతుంబాక సీతారాంతో పాటు పలువురు అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి సహకారం అందిస్తా

### వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**ప్రజాపక్షం/కారేపల్లి:** కారేపల్లి మండలంలోని రేలకాయలపల్లిలో రూ.35 కోట్లతో నిర్మాణం చేపట్టిన ఇఎంఆర్‌ఎస్ భవనాన్ని ప్రధాని నరేంద్ర మోడీ 'దార్తి జన జాతీయ గ్రామ్ ఉత్కర్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా బుధవారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, ఐటిడిఇ పిఒ రాహుల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూదానం చేసిన రైతులను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ 2022వ సంవత్సరంలో భూమి పూజ చేయడం జరిగిందని, నేడు అన్ని సౌకర్యాలతో ప్రారంభించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తానన్నారు. ఐటిడిఏ పిఒ బి.రాహుల్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్మెట్రిక్ హాస్టల్లో ప్రీమెట్రిక్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు మెనూ ప్రకారం చక్కటి భోజనంతో పాటు వారి చదువు పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. గిరిజన విద్యార్థిని విద్యార్థులు చదువు పట్ల ఎక్కడా తక్కువ కాకుండా 24గంటలు ఐటిడిఏ అధికారులతో పాటు హెచ్‌ఎంలు, వార్డెన్లు, ఉపాధ్యాయులు పిల్లలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యాబుద్ధులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గురుకులాల అడిషనల్ సెక్రటరీ చంద్రశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, తహసీల్దార్ సంపత్, ఇన్‌చార్జ్ ఎంపిడిఒ వై.రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నకిలీ డెత్ సర్టిఫికెట్‌లతో రిజిస్ట్రేషన్

### 20 సంవత్సరాల క్రితం చనిపోయిన వారి పేరు మీద డెత్ సర్టిఫికెట్

### హైదరాబాద్ ఇమేజ్ హాస్పిటల్‌లో చనిపోయినట్టు సృష్టి

### వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్

### డాక్యుమెంట్ రైటర్ నిర్వాకం




**ప్రజాపక్షం/వైరా :** వైరా మున్సిపాలిటీ పరిధిలోని పల్లిపాడు గ్రామానికి చెందిన భార్యభర్తలు గోపయ్య, మరియమ్మ దంపతులు ఇద్దరు సుమారు 20 సంవత్సరాల క్రితం పల్లిపాడు గ్రామంలో రెండు సంవత్సరాల వ్యవధిలో మరణించారు. భార్యాభర్త లిద్దరూ రెండు సంవత్సరాల వ్యవధిలో మరణిస్తే ఆ ఇద్దరు హైదరాబాద్‌లోని ఇమేజ్ హాస్పిటల్‌లో 2017లో ఒకరు, 2019లో ఒకరు మరణించినట్టు హైదరాబాద్ మున్సిపాల్ కార్పొరేషన్‌లో వారిద్దరి పేరు మీద డెత్ సర్టిఫికెట్ ఇచ్చినట్టు సృష్టించి వైరా సబ్ రిజిస్టార్ కార్యాలయంలో ఓ డాక్యుమెంట్ రైటర్ రిజిస్ట్రేషన్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ డాక్యుమెంట్ రైటర్ మరో ఇద్దరూ కలిసి గ్రేటర్ హైదరాబాద్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ లో ఐఎఎస్ క్యాడర్ సమానమైన అధికారి జారీ చేసినట్టు అధికారుల పేరుతో ఫోర్జరీ పత్రాన్ని తయారు చేసి ఫేక్ డెత్ డాక్యుమెంట్ సృష్టించి రిజిస్ట్రేషన్‌కి తెరలేపారు. రిజిస్ట్రార్ ఆఫీసులో ఇచ్చిన డెత్ సర్టిఫికెట్‌లో క్యూఆర్ కోడ్ కనపడకుండా బ్లర్ చేయడంతో పాటు డెత్ సర్టిఫికెట్ జారీ చేసిన అధికారి డిజిటల్ సంతకం కనిపించకుండా చేయడం జరిగింది. రిజిస్ట్రేషన్‌కి పెట్టిన డెత్ సర్టిఫికెట్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ నెంబర్ కొడితే వేరే వాళ్ళ పేర్లు ఆన్‌లైన్‌లో కనబడటం జరుగుతుంది. అంటే ఒక ప్రభుత్వ శాఖలో కీలకమైన అధికారి జారీ చేసినట్టు తప్పుడు డెత్ సర్టిఫికెట్ జారీ చేయడం జరిగింది. జులై 2024 రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్ట్రేషన్ సమయంలో రూ.18వేలు ఖర్చు అయితే సుమారు లక్ష పైన ఖర్చు అయినట్టు వారితో చెప్పి ఎంటి ప్రాంసరీ నోట్ చెక్కులపై సంతకాలు చేసుకున్నట్టు సమాచారం. అయితే ఇటీవల రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి చదువు రాకపోవడంతో మరో వ్యక్తితో సంభాషణ జరిగినప్పుడు జరిగిన విషయాన్ని చెబితే అంత డబ్బులు ఎందుకు అవుతాయి అని అంటూ అడగడంతో విషయం బయటకు వచ్చింది. ఆ వ్యక్తి డాక్యుమెంట్ రైటర్‌ను ఇద్దరు దళారులను నిలదీయడంతో డాక్యుమెంట్ రైటర్ వారి వద్దకు వెళ్లి బతిమిలాడి కాళ్ళ బేరానికి వచ్చి తీసుకున్న ప్రామిసరీ నోటు చెక్ వాళ్ళకి ఇచ్చి రాజీ కూర్చొన్న సంఘటన జరిగినట్లు సమాచారం. అయితే ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించి మరణ జనన రిజిస్ట్రేషన్ శాఖలోని ఎంతో కీలకమైన బర్త్ డెత్ సర్టిఫికెట్లను జారీ చేయాలంటే పకడ్బందీగా అన్ని చూసిన తర్వాత నిర్ధారించుకున్న తర్వాతనే జారీ చేస్తారు. కాని వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద ఉంటున్న డాక్యుమెంట్ రైటర్ అధిక సంపాదన కోసం వైరా మండలం వల్లాపురం, ఇతర ప్రాంతాల్లో దళారులను ఏర్పాటు చేసుకొని ఆ దళారులతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేస్తూ అందినకాడికి దండుకుంటూ అవసరాన్ని బటి టలోన్ ఇప్పిస్తామంటూ రిజిస్ట్రేషన్‌కి చాలా ఖర్చువుతుందని అవసరమని పెట్టుకుంటామని ఎంటి ప్రాంసరీ నోట్లు చెక్కులు అమాయక ప్రజల వద్ద తీసుకుంటున్నట్లు భారీగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఆ డాక్యుమెంట్ రైటర్ ఇప్పటికే పెద్ద ఎత్తున తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి కొంతమంది అధికారులతో పార్టీలు పేరుతో చిందులు వేయడం జరుగుతుంది. సాయంత్రం అయితే పార్టీలు దళారులతో దావతులు ఉదయాన్నే రిజిస్ట్రేషన్లు ఇలా తప్పుడు ఫోర్జరీ చేసిన సర్టిఫికెట్లను వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పర్వాన్ని కొనసాగిస్తున్నాడు. గతంలో ఇక్కడ పనిచేసి వెళ్లిపోయిన సబ్ రిజిస్ట్రార్ సమయంలో ఈ తప్పుడు డెత్ సర్టిఫికెట్లతో పెద్ద ఎత్తున రిజిస్ట్రేషన్లు చేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ఒక ప్రభుత్వ శాఖకు సంబంధించిన సర్టిఫికెట్లు ఫోర్జరీ చేయడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు వైరా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జరుగుతున్న ప్రతి రిజిస్ట్రేషన్‌పై ప్రత్యేక దృష్టి పెడితే జరిగిన అవినీతి పెట్టిన తప్పుడు సర్టిఫికెట్లు ప్రతీది బయటకు వస్తాయి.






## ఫ్యామిలీ డిజిటల్ కార్డ్ కోసం వివరాలు పక్కాగా సేకరించాలి

**ప్రజాపక్షం /జనగామ ప్రతినిధి:** ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం వివరాలు పక్కాగా సేకరించాలి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్ ఆదేశించారు. డిజిటల్ సర్వేపై బుధవారం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 3వ తేదీ నుండి 7వ తేదీ వరకు సర్వే ఉంటుందన్నారు. సర్వే కోసం నోడల్, స్పెషల్ అధికారుల నియామకం, పైలట్ ప్రాజెక్టు కింద కుటుంబాల ఎంపిక చేయడం జరిగిందన్నారు. రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, మెడికల్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టిన కుటుంబ డిజిటల్ కార్డు సర్వే సమర్ధవంతంగా జరగాలన్నారు. జనగామ మండలంలోని ఎర్రగొల్లపహాడ్ పెద్దతండాలో 138 కుటుంబాలను ఎంపిక చేసి ఎంపిడిఒ, పంచాయతీ సెక్రెటరీ, ఫీల్డ్ అసిస్టెంట్, ఆశా, అంగన్వాడీ వర్కర్‌తో కూడిన టీంను ఏర్పాటు చేశామన్నారు. జనగామ మున్సిపాల్టీ పరిధిలో 24వ వార్డు పాతబీటు బజారు, కుర్మవాడ, నాగుల కుంటలో 423 కుటుంబాల సర్వే జరగనుందన్నారు. నోడల్ అధికారిగా ఆర్‌డిఒ కొమురయ్య వ్యవహరిస్తారన్నారు. అలాగే స్టేషన్ ఘనపూర్ రఘునాథపల్లి మండలంలోని కన్నాయపల్లిలో 196 కుటుంబాలు, మాదారం గ్రామంలో 178 కుటుంబాలు, ఎంపిక చేయడం జరిగిందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని పాలకుర్తి మండలం రాఘవాపురంలో 165 కుటుంబాలు, ఎంపిక చేశామన్నారు. ఫ్యామిటీ డిజిల్ కార్డ్ కోసం జరిగే సర్వే పక్కాగా, పకడ్బందీగా జరిపించాలన్నారు.

## కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా గాంధీ జయంతి



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** మహాత్మాగాంధీ చూపిన అహింసా, శాంతి మార్గం ద్వారా ఎలాంటి సమస్య నైనా జయించొచ్చని కలెక్టరేట్ పరిపాలన అధికారి ఖాజా అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మహాత్మాగాంధీ 155వ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి గన నివాళులర్పించారు. అనంతరం ఏవో ఖాజా మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, అహింస సిద్ధాంత పితామహుడు అయిన మహాత్మా గాంధీ ఆదర్శాలు ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. ప్రధానంగా, అహింసా సిద్ధాంతాన్ని, స్వచ్ఛతా ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే విధంగా గాంధీ విశేషంగా కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. గాంధీ ఆశయాలను నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలని నేటి సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం విస్తరించేలా చేయడంలో యువత ముఖ్య పాత్ర వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



**ప్రజాపక్షం/పర్వతగిరి:** పర్వతగిరి మండల కేంద్రంలో ఇటీవల జంగ వీరమల్లు, వడ్లకొండ గ్రామానికి చెందిన అలుగనూరి సమ్మయ్య, ఇల్లందుల అంకూస్ మృతిచెందగా వారి కుటుంబాలను మాజీ గ్రామీణాభివృద్ధి పంచాయతీ, మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మాజీ సర్పంచులు చింతపట్ల సోమేశ్వర్‌రావు, గోనె సంపత్, మాజీ ఎంపీటీసీ మాదుగుల రాజు, చిదురాల వేణుగోపాల్, వడ్లకొండ మాజీ సర్పంచ్ ఆమడగాని రాజు, ఉప సర్పంచ్ ఉప్పలయ్య, సంపత్‌రావు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

## పాలకుర్తిలో ఘనంగా నల్ల నర్సింహులు జయంతి వేడుకలు



**ప్రజాపక్షం/పాలకుర్తి:** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు జయంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో నల్ల నర్సింహులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి వారసులు అరుణక్క, పద్మశాలి సంఘం నాయకులు మాచర్ల సారయ్య, చిలుకమారి వెంకన్న, కాటబత్తిని రమేష్, మేడారపు సుధాకర్, కామారపు సునీల్, బైరు భార్గవ్, బిర్రు సోమేశ్వర్, పోగు శ్రీనివాస్, కృపాకర్, చిలుకమారి నాగేశ్వర్, శ్రీనివాస్, చిదురాల ధనుంజ య, శ్రీధర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి సాంబయ్య, నాయకులు సత్యనారాయణ,లక్ష్మి నారాయణ,రజిత, సోమల్లయ్య, వెంకటేశ్వర్లు, సోమయ్య, మల్లయ్య, కళింగరాజు, సారయ్య, సుదర్శనం పాల్గొన్నారు.

## ఘనంగా బతుకమ్మ ప్రారంభం

**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** తొమ్మిది రోజుల పాటు పూల పండుగను జరుపుకునేందుకు సిద్ధమైన ఆడపడుచులు బుధవారం ఎంగిలిపూల బతుకమ్మతో పండుగను ఘనంగా ప్రారంభించారు. దీంతో బుధవారం నుండే పట్టణాలు, గ్రామాలలో పండుగ వాతావరణం వచ్చేసింది. ఎవరి నోట చూసినా బతుకమ్మ పండుగ మాటలే వినిపిస్తున్నాయి. పండుగ బట్టల కొనుగోలు కోసం వరంగల్, హన్మకొండలోని వస్త్ర దుకాణాలు మహిళలతో కిటకిటలాడుతున్నాయి. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మతో ప్రారంభం అయిన ఈ పండుగను తొమ్మిది రోజుల పాటు అత్యంత వైభవంగా జరుపుకోనున్నారు. తెలంగాణ రెండో రాజధానిగా పేరున్న వరంగల్ ప్రాంతంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించచడంలో ముందుంటుంది. వరంగల్‌లోని ఉర్సు రంగలీలా మైదానం, కాశీబుగ్గ, దుర్గేశ్వర స్వామి దేవాలయం, హన్మకొండ వేయిస్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయం, వడ్డేపల్లి చెరువు, వరంగల్ భద్రకాళి దేవాలయంతో పాటు వరంగల్ నగరంలో అన్ని ప్రాంతాల్లోని దేవాలయాల వద్ద మహిళలు ప్రతి సంవత్సరం బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నారు. మొదటి రోజు ఎంగిలిపూల బతుకమ్మను వరంగల్ నగరంలోని కొత్తవాడ తోట మైదానంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ సత్య శారధ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు మహిళలతో కలిసి ఘనంగా జరుపుకున్నారు.

## వెంకటాపూర్‌లో భారీ వర్షం

**ప్రజాపక్షం/వెంకటాపుర్:** వెంకటాపూర్ మండలంలో బుధవారం సాయంత్రం గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఈదురు గాలులతో కూడిన వర్షం మూలం గా వెంకటాపూర్ నుండి పాలంపేట గ్రామాల మధ్య లో రహదారి వెంట గల భారీ వృక్షములు నేలమట్టం అయ్యాయి. ఈ క్రమంలో రహదారి వెంట వెళ్లే వాహనా దారులకు ఎలాంటి నష్టం కలుగ పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే సమాచారం అందుకున్న వెంకటాపూర్ ఎస్ఐ జక్కుల సతీష్ తన సిబ్బంది తో కలసి సంఘటన స్థలాల వద్ద కు చేరుకొని రహదారి పై కూలిన చెట్లను తొలగించారు. దీంతో వాహనదారులు, మండల ప్రజలు ఎస్ ఐ సతీష్ కి అభినందనలు తెలియజేసారు.

### ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

## గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధికి

# మహిళా శక్తి క్యాంటీన్లు



**ప్రజాపక్షం/మహాదేవపూర్/కాటారం:** గ్రామీన ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు కలల్పించడమే లక్ష్యంగా మహిళా శక్తి క్యాంటీన్లు అని రాష్ట్ర టి,పరిశ్రమలు శాసనా సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా శక్తి క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు.అనంతరం మహిళలు తయారు చేసిన వంటకాలను రుచి చూసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతంలోని మహిళల ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహిచమే కాకుండా సమాజంలో మహిళా శక్తిని ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను కల్పించచడంలో పెద్ద మైలు రాయిగా నిలుస్తాయని అన్నారు.దీంతో మహిళలు స్వయం ఉపాధి పొందుతూ స్థానిక ఆహార ఉత్పత్తులను ప్రోత్సహిచడానికి దోహదపడతాయని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మహిళా శక్తి క్యాంటీన్లు మహిళల జీవితాల్లో మార్పును తీసుకొస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. మహిళలు ఆర్థికంగా ఎదగడానికి మహిళా శక్తి క్యాంటీన్లు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు,మహిళలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ఐత ప్రకాష్ రెడ్డి,కాటారం సబ్ కటెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ అక్ష్మి, డిఆర్ఓఒ అవినాష్, డిపిఒ నారాయణ రావు,తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపిడిఒ వెకటేశ్వర్లు, సిడిపిఒ రాధిక, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాపు, ప్రాథమిక వ్యవసాయ సహాకార సంఘం చైర్మన్ చల్ల తిరుపతి రెడ్డి, మాజీ ఎంపిపి రాణి బాయి, జడ్పిటిసి గుడాల అరుణ,మాజీ ఎంపిటిసి ఆకుతోట సుదాకర్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అక్బర్ ఖాన్,యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కట్కం అశోక్,తదితరులు పాల్గొన్నారు.

### మహిళల ఆర్థికస్వావలంబనకు...



మహిళల ఆర్థిక స్వావలంబనకు సమాజంలో మహిళా వక్తిని ముందుకు తీసుకెళ్లడమే ముఖ్య ఉద్దేశ్యంగా మహిళా శక్తి క్యాంటీన్లను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు బుధవారం కాటారం మండలం కొత్త పెల్లి వద్ద జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన మహిళీ శక్తి క్యాంటీన్ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ప్రారంభించారు.అనంతరం మహిళలు తయారుచ చేసిన వంటకాలను రుచి రూసారు కాటారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారి పైఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆయన వి శ్కరించారు..జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మా ట్లాడుతూ క్యాంటీన్ల ప్రాముఖ్యత మహిళల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే విధంగా మహి ళా శక్తి పెంపుదలకు ఈ కార్యక్రమం తోడ్పడుతుందని అన్నారు జిల్లాలోని మహిళలు మహి ళా శక్తి కార్యక్రమాన్ని వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ కార్పోరేషన్ చైర్మెన్ ఐత ప్రకాష్ రెడ్డి,కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయ లక్ష్మి, డిఆర్డిఓ అవినాష్,డిపిఓ నారాయణ రావు, తహసీల్దార్,ఎంపిడిఓ పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుడు గాంధీ

### ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** జాతిపిత మహాత్మాగాంధీ ఆశయాలను ఆదర్శాలను అందరూ స్పూర్తిగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. బుధవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన గాంధీ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శాంతి, అహింస, సత్యాగ్రహం ఆయుధాలుగా సత్ మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడు మహాత్మగాంధీ అని కొనియాడారు. వారు చూపిన మార్గంలో పయనించి దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్ళాలని అన్నారు. అనంతరం ములుగు ఏరియా ఆసుపత్రిలోని పేషెంట్లకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్, లోకల్‌బాడీ సంపత్‌రావు, ములుగు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ జగదీష్, కలెక్టరేట్ పరిపాలన అధికారి అల్లం రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఒకే రాష్ట్రం.. ఒకే కార్డు.. తెలంగాణ ఫ్యామిలీ కార్డు

### వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి :** ఒకే రాష్ట్రం ఒకే కార్డు అనే నినాదాన్ని ముందుకు తీసుకెళ్లుటకు తెలంగాణ ఫ్యామిలి డిజిటల్ కార్డు కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించుటకు మార్గదర్శకాలను ఇవ్వడం జరిగిందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో అక్టోబర్ 3 నుండి 7వరకు ఫ్యామిలి డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం రోజున సంబంధిత శాఖల అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ జి. సంధ్యారాణిలు పాల్గొని ఫ్యామిలి డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్టు మార్గదర్శకాలను పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపిడివోలు, ఎంపిఓలు, తహసీల్దార్‌లు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా కీలకమన్నారు. ఈకార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయం

### మున్సిపల్ చైర్ పర్సన్ ఎస్ వెంకట రాణి సిద్ధు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని భూపాలపల్లి మున్సిపల్ చైర్ పర్స న్ ఎస్ వెంకటరాణి సిద్ధు కొనియాడారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2వరకు స్వచ్ఛత హీ సేవ స్వభావు స్వచ్ఛత సంస్కార స్వచ్ఛత కార్యక్రమాలో ముగింపు వేడుకలను మున్సిపల్ కార్యాలయంలో శానిటేషన్ పారిశుద్ధ్య పనులలో భాగంగా కార్యాలయం ఆవరణంలోని పరిసరాలు శుభ్రం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ సేగ్గం వెంకటరాణి సిద్ధు, మున్సిపల్ కమిషనర్ టి.రాజేశ్వర్ మాట్లాడుతూ, భూపాలపల్లి పట్టణంలో వి ధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను కొనియాడారు. పారిశుద్ధ్య కార్మికులు నడిచే దేవుళ్లని అన్నారు. మన అందరి ఆరో గ్య బాధ్యతలు వారే మోస్తున్నారన్నారు. పరిశుభ్రతకు మనవంతు సహకారం అందిస్తేనే వారి కష్టాన్ని కొంతైనా తగ్గించగలిగిన వారమవుతామన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే చెత్త ఉంచాలని, అలాగే ఇళ్ల లోని చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందజేయాలన్నారు. మన ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ఆలోచన చేయాలన్నారు. 22వ వార్డు కౌన్సిలర్ ముంజల రవీందర్, ఇతర కౌన్సిలర్లు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ పి. సునీల్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వై.అశోక్ కుమార్, కార్యాలయపు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పక్కా సమాచారం



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పక్కాల సమాచారం సేకరించాలని బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే అ న్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి ప్రజలకు ఫ్యామిలీ డిజిటల్ హెల్త్ కార్డులు అందచేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ఈనెల 3 నుంచి సర్వే నిర్వహించనున్నారని, ఇందుకోసం బుధవారం బల్దియా ప్రధాన కార్యాక్రమంలోని కౌన్సిల్ హాలులో అధికారులు, సర్వే బృందాలకు ఏర్పాటుచేసిన సమావేశానికి కమిషనర్ హాజరై సమర్థవంతంగా నిర్వహించడానికి తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా కాజీపేట డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్ సర్వే నిర్వహణ తీరును, సిబ్బందికి దృశ్య మాద్యమం ద్వారా వివరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. ఈనెల 3 నుంచి 7 వరకు బల్దియా పరిధి హన్మకొండలో 10, 48 డివిజన్లలో వరంగల్‌లోని 12, 38 డివిజన్లలో పైలెట్ ప్రాతిపదికన సర్వే నిర్వహించడం జరుగుతుందని ఇందుకోసం అధికారులు సిబ్బందిని సమన్వయం చేస్తూ ప్రత్యేక బృందాలను ఏర్పాటుశామన్నారు. ఇరు జిల్లాలకు జీడబ్ల్యూఎంసీకి చెందిన డిప్యూటీ కమిషనర్లు సంబంధిత హన్మకొండ, వరంగల్ ఆర్డీవోలు, నోడల్ అధికారులుగా వ్యవహరిస్తూ పర్యవేక్షిస్తారని, ప్రతీ బృందానికి సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంటు స్థాయి అధికారి టీం లీడర్‌గా వ్యవహరిస్తారన్నారు. ప్రతీ రోజు 50 కుటుంబాల సమగ్ర సమాచారాన్ని ఆయా బృందాలు సేకరిస్తారన్నారు. ఈ డిజిటల్ కార్డుకు ఎలాంటి సంబంధం లేదని, రాష్ట్ర ప్రభుత్వం అందించే యూనిక్ ఐడీ అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రతీ కుటుంబానికి వచ్చేలా ఇంటింటికి వెళ్లి ప్రతీ కుటుంబం వివరాలు వాస్తవ సమగ్ర సమాచారాన్ని సేకరించి నమోదుచేయాలన్నారు. గతంలో ఇంటి యాజమాని పురుషుడు ప్రమాణికంగా తీసుకొని సర్వేలు నిర్వహించడం జరిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు మహిళను యజమానిగా తీసుకోవడం జరుగుతుందన్నారు. సదరు కుటుంబానికి చెందిన వ్యక్తుల అభిప్రాయం మేరకు మాత్రమే మహిళను యజమానిగా తీసుకొని సమాచారం నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేశ్, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, ఐటీ మేనేజర్ రమేశ్, ఆర్‌ఓలు యూసుఫోద్దీన్, శ్రీనివాస్, షహజాది బేగం, ఆర్‌ఐలు, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## ఆడపడచులకు బతుకమ్మ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** పూజల పూజిస్తూ ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించుకునే గొప్ప పండగ బతుకమ అని ఈ పండగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని మంత్రి సీతక్క ఆకాంక్షించారు. తెలంగాణ సామూహిక జీవన విధానానికి, కష్ట సుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు ఈ పండగ నిదర్శనమన్నారు. ఎంగిలిపూల నుండి సద్దుల వరకు అందరూ కలిసి పండగను జరుపుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని, వారి కష్టాలను తొలగించాలని గౌరమ్మను మంత్రి సీతక్క ప్రార్థించారు.

## గాంధీ మార్గం అనుసరణీయం

### ఎంపి డాక్టర్ కడియం కావ్య,కలెక్టర్‌లు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** మహాత్మా గాంధీ సత్యం, అహింస, సత్యాగ్రహ మార్గాలను అనుసరించి దేశానికి స్వాతంత్రం తీసుకువచ్చారని వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య అన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో గాంధీజీ విగ్రహానికి ఎంపి కడియం కావ్య, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వరంగల్ ఎంపి డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహ సిద్ధాంతాలతో దేశానికి స్వాతంత్రం సాధించి ప్రపంచానికి ఆదర్శంగా గాంధీజీ నిలిచారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

**కలెక్టరేట్‌లో గాంధీ జయంతి వేడుకలు:** హనుమకొండ: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో గాంధీ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి జిల్లా అదనపు కలెక్టర్ ఎ.వెంకట్ రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై. వి గణేష్, జడ్పీ సీఈవో విద్యాలత, జిల్లా సంక్షేమ అధికారి రాజమణి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఇతర ఉన్నతాధికారులు అధికారులు, ఉద్యోగు లు పాల్గొన్నారు.

## కెటిఆర్ కాన్వాయ్‌పై దాడి అమానుషం

**ప్రజాపక్షం/ కమలాపూర్ :** కెటిఆర్ కాన్వాయ్‌పై దాడి చేయడం అమానుషమని హుజురాబాద్ నియోజకవర్గం సోషల్ మీడియా నాయకులు మాట్లా దినేష్ అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలది కీలక పాత్ర అని గుర్తు చేశారు. మూసీ పరివాహక పర్యటనలో కెటిఆర్ కాన్వాయ్‌పై కాంగ్రెస్ నాయకులు దాడులు చేయడం సిగ్గుచేటని అన్నారు. రాష్ట్రంలో నడుస్తుంది ప్రజాపాలన కాదని, రౌడీ పాలన అని అన్నారు.

## ఏకలవ్య స్కూల్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ





**ప్రజాపక్షం/కొత్తగూడ :** బుధవారం మండలం లోని పోగుళ్లపల్లి లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాల ను జార్ఖండ్ నుండి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఏటూరునాగారం ప్రాజెక్టు డైరెక్టర్ చిత్రా మిశ్రాలు మాట్లాడుతూ, అత్యున్నత ప్రమాణాలతో సుమారు 40 కోట్ల వ్యయంతో ఏకలవ్య మోడల్ రెసిడెన్సి యల్ కో ఎడ్యుకేషన్ స్కూల్ నిర్మాణం జరిగిందని అన్నారు. (23) మంది ఉపాధ్యాయని ఉపాధ్యాయులు ఉన్నారని, ప్రస్తుతం 500 మంది విద్యార్థులకు విద్యతోపాటు, క్రీడలు, సంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల నైపుణ్యతలను వెలికి తీయడానికి అత్యుత్తమమైన విద్యా బోధనలు అందించడం జరుగుతుందన్నారు. భాగంగా విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీఒ అలివేలు, మండల ప్రత్యేక అధికారి సురేష్, జిల్లా పరిషత్ సిఇఒ నర్మద, ఆర్సిఒ హరి సింగ్, ప్రిన్సిపాల్ అజిత్ కుమార్ సింగ్, తహసీల్దార్ రమాదేవి, ఎంపిడిఒ రవీంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

# ప్రారంభానికి నోచుకోని హాస్టల్ భవనాలు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి**





జిల్లా కేంద్రంలో బిసి సంక్షేమ హాస్టల్ ల సమస్యలు పరిష్కరించాలని ఉద్దేశంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో మూడు నాలుగు సంవత్సరాల క్రితం బిసి హాస్టల్ భవనాలకు శంకుస్థాపన చేశారు. చిన్న చిన్న పనులు మినాయిస్తే హాస్టల్ భావన నిర్మాణ పనులు పూర్తయినట్లే కానీ ఈ భవనాలు ఇప్పటివరకు ప్రారంభానికి నోచు కోలేకపోతున్నాయి. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ ఎండి క్వార్టర్స్ ఎదురుగా బిసి సంక్షేమ బాలుర, బాలికల హాస్టల్ వసతి కోసం నూతన భవనాలను నిర్మాణం చేపట్టారు. ఆ భవనాలు పూర్తయి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇప్పటివరకు ప్రారంభానికి నోచుకోలేకపోతున్నాయి. ఒకపక్క జిల్లా కేంద్రంలో బిసి హాస్టల్లో అద్దె కిరాయికి ఉంటూ అనేక సమస్యలతో సతమతమవుతున్న సంబంధిత సంక్షేమ అధికారులు పూర్తయిన భవ నాలను ప్రారంభించలేక పోతున్నారని అపవాదులు మూట క ట్టుకుంటున్నారు. సంక్షేమ హాస్టలకు ఆద్దెలు కడుతున్న అధికారులు మాత్రం పూర్తి కావలసిన భవనాలపై దృష్టి పెట్టడం లేదు. ఈ హాస్టల్ భవనాలు పూర్తి అయితే సుమారు 150 నుండి 200 మంది విద్యార్థిని, విద్యార్థులకు సౌకర్యాలు మెరుగుపడతాయి. ప్రభుత్వాలు లక్షల డబ్బులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టిన ఈ భవనాలను మాత్రం లక్ష ణంగా వదిలేస్తున్నారు. ఒకపక్క కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మరో పక్క సంబంధిత అధికారుల అలసత్వం వల్ల బిల్లులు రాకపోవడంతో ఇలాంటి పరిస్థితి నెలకొన్నది. గత మూడు సంవత్సరాలుగా ఆగిపోయిన తుది దశ పనులు మిగిలిపోయి ఉన్నాయి. బిసి సంక్షేమ శాఖ అధికారులు, దీనిపై జిల్లా పాలనాధికారి స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక చొరవ చూపి నిర్మాణంలో ఉన్న భవనాల చివరి పనులు పూర్తి చేసి ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



## సమాజ సేవకులకు సన్మానం

ప్రజాపక్షం / గద్వాల : జోగులాంబ జిల్లాలో వివిధ రంగాల్లో సమాజానికి ఉత్తమ సేవలు అందించినందుకు గాంధీ జయంతి సందర్భంగా నలుగురు కార్మికులను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ శాలువాతో సన్మానించారు. సన్మానించిన వారిలో శ్రీమతి సైదమ్మ మున్సిపల్ స్వీపర్, కామాటి హరి ప్రసాద్ మున్సిపల్, శ్రీదేవి ఆశావర్కర్ అర్బల్ హెల్త్ సెంటర్,లక్ష్మీ దేవి ఔట్‌రిచ్ వర్కర్ బాలల సంరక్షణ భవనం గద్వాల,కార్మికులు ఉన్నారు.

## భగీరథ నీరురాక ఇబ్బందులు

ప్రజాపక్షం / వడ్డేపల్లి : గ్రామంలోని సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభ నిర్వహిస్తున్నామని పంచాయతి సెక్రెటరీ సాత్విక పేర్కొన్నారు. మండల పరిధిలోని జూలకల్ గ్రామంలో బుధవారం ప్రజలు,గ్రామ పెద్దలు,నాయకులతో గ్రామ సభను పంచాయతి సెక్రెటరీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సభ ద్వారా గ్రామంలోని సమస్యలను ప్రజల ద్వారా తెలుసుకొని గ్రామన్ని అభివృద్ధి చేయాలని అన్నారు. దీంతో ప్రజలు గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా నీళ్ళురాక 6 నెలలుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అలాగే మురుగు గుంతలు, వీధి దీపాల సమస్యలను అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామ సభల ద్వారానైనా పరిష్కారం అయ్యేలా చూడాలని ఆమెకు తెలిపారు. దీనికి ఆమె ఈ సమస్యలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ మహేందర్ రెడ్డి, జయశంకర్,గోపాల్,వెంకటరాజు, మధు, శేఖర్, కె.అంజనేయులు,తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ దేవాలయం నూతన చైర్మన్‌గా నాగేశ్వర్‌రెడ్డి



ప్రజాపక్షం / అలంపూర్ : ఐదవ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న అలంపూర్ జోగులాంబ అమ్మ వారి దేవాలయం నూతన ఆలయ కమిటి నూతన చైర్మెన్‌గా కొంకల నాగేశ్వర్ రెడ్డి ఎన్నిక య్యారు. సభ్యులుగా కె. జయన్న, కె.జగన్ మోహన్ నాయుడు, డి.నాగశిరోమణి, ఎం. చంద్రశేఖర్ రెడ్డి, ప్యాట్ల విశ్వనాథ్ రెడ్డి, పి.జగదీష్ గౌడు, ఎ.వెంకటేశ్వర్లు, కె.గోపాల్, సురేందర్ స్వామి, జె.సరస్వతి, జి.వెంకటేశ్వర్లు, జి.పూలేందర్, ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ నా చైర్మెన్ ఎన్నికకు సహకరించి,అవకాశాన్ని కల్పించినందుకు చత్తీస్‌ఘడ్ రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జి ,ఏఐసిసి ప్రధాన కార్యదర్శి,అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌కు ,సి.ఎం.రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.అలాగే జోగులాంబ దేవాలయం అభివృద్ధికి మనస్ఫూర్తిగా కృషి చేస్తానని అన్నారు.

## జాతిపిత మార్గం అనుసరణీయం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: స్వతంత్ర్య సాధన కోసం జాతిపిత మహాత్మ గాంధీ సూచన, శాంతిమార్గం ప్రతి ఒక్కరికి ఆచఱనీయమని ఫెయిత్ బంజారా ఆశ్రమ నిర్వాహకులు, సామాజికవేత్త ధీరావత్ హన్యానాయక్ అన్నారు. బుధవారం మహాత్మగాంధీ 155వ జయంతి సందర్భంగా పట్టణంలోని సాగర్‌రోడ్డులోగల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. గాంధీజీ సూచించిన సత్యం, శాంతి, అహింస మార్గాలను ప్రపంచ దేశాలు ఆచరిస్తున్నాయని అన్నారు. గాంధీజి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రమాబాయి, సుధారాణి, ఆశ్రమ చిన్నారులు పాల్గొన్నారు.

### తాజ్‌పూర్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా భువనగిరి మండలంలోని తాజ్పూర్ గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు డా.ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తాజ్ పూర్ గ్రామ ఇంచార్జి, ఎంపీడీఓ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి నర్సింగరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెడును వదిలి మంచి మార్గంలో పయనించాలి : జిల్లా జడ్జి హితవు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: సమాజంలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు కలిగి ఉన్నప్పుడే నిజమైన స్వాతంత్రం వచ్చినట్లు అని,అందుకోసమే గాంధీ మహాత్ముడు కృషి చేశారని ప్రిన్సిపల్ స్టేషన్స్ జిల్లా జడ్జి ఎం .నాగరాజు అన్నారు.గాంధీ జయంతి ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా జైలులో ఏర్పాటు చేసిన ఖైదీల సంక్షేమ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ముందుగా ఆయన జైలు ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి .జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి,జిల్లా ఎస్పీ శరత్ చంద్ర లతో కలసి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ దీప్తి,12 వ బటాలియన్ కమాండర్ సత్య శ్రీనివాస రావు,జిల్లా జైల్ సూపరింటిండెంట్ ప్రమోద్ జిల్లా జైలర్ బాలకృష్ణ , ఇన్చార్జి ఆర్డీవో శ్రీదేవి, తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## లాల్ బహదూర్ శాస్త్రి జయంతి

ప్రజాపక్షం / గద్వాల : లాల్‌బహదూర్ శాస్త్రి గాంధీ స్ఫూర్తితో ముందుకు సాగి దేశభక్తి, నిజాయతితో, జీవించాడని కాంగ్రెస్ పార్టీ గద్వాల జిల్లా ఇంచార్జి, మాజీ జడ్జిచైర్ పర్సన్ సరితాతిరుపతయ్య పేర్కొన్నారు. బుధవారం లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని మున్సిపల్ చైర్మెన్ బి.ఎస్.కేశవ్, మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేనులతో కలసి ఆయన విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో భారీ ఎత్తున కాంగ్రెస్ నాయకులు,శ్రేణులు పాల్గొన్నారు.

# అహింస, సత్యాగ్రహం గాంధీజీకి ఆయుధాల్లాంటివి



కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్





ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: అహింస, సత్యాగ్రహం మహాత్మ గాంధీజీకి ఆయుదాల్లాంటియని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ బిఎస్ లతతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అహింస మార్గాన్ని, సత్యాగ్రహాన్ని ఎంచుకోని గాంధీజీ ప్రజలతో మమేకమై స్వాతంత్రం సాధించిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి సిఈఓ అప్పారావు, జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం, డిటిడిఓ శంకర్, డిఈఓ అశోక్, సంక్షేమ శాఖల అధికారులు లత, నర్సింగరావు, డిపిఓ నారాయణరెడ్డి, వివిధ పార్టీల నాయకులు చకిలం రాజేశ్వర్ రావు, కోట గోపి, సవరాల సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఎంజి రోడ్డులోని మహాత్మగాంధీజీ విగ్రహానికి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**జిల్లా పోలీస్ కార్యాలయంలో:** నేటి తరం గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గంలో నడవాలని జిల్లా అదనపు ఎస్‌పి నాగేశ్వర్ రావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి జనార్ధన్ రెడ్డి, ఎఆర్ డిఎస్‌పి నరసింహ చారి, ఆర్ఐ నారాయణరాజు, నరసింహ, డిసిఆర్‌బి సిఐ పాండరి, ఆర్ఎస్ఐలు, ఎస్‌బి, డిసిఆర్‌బి ఎస్ఐలు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో:** జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో మహాత్మగాంధీజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం/సూర్యాపేట: మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఎంజిరోడ్డులోని గాంధీజీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్‌లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్, బైరు శైలేందర్, వేముల కొండ పద్మ, వాంకుడోతు లక్ష్మీ మకట్‌లాల్, పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, నాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు గాంధీపార్కులో మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.





## 100 కిలోల బెల్లం, 3 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాపక్షం/హుజూర్‌నగర్‌రూరల్: నాటుసారా, బెల్లం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకుని వారి వద్ద నుండి 100 కిలోల బెల్లం, 3 లీటర్ల నాటుసారా, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సిఐ జిన్నా నాగార్జున రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.సిఐ తెలిపిన వివరాల ప్రకారం గరిడేపల్లి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన దుగ్గి శ్రీనివాస్, హుజూర్‌నగర్ మండలానికి చెందిన షేక్ అబ్దుల్లా అనే ఇద్దరు వ్యక్తులు తమ ద్విచక్ర వాహనాలపై వివిధ ప్రాంతాల నుండి నాటుసారా, బెల్లం తరలిస్తుండగా వారిని పట్టుకుని వారి వద్ద నుండి 3 లీటర్ల నాటుసారా,100 కేజీల బెల్లం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితుల వాహనాలను సీజ్ చేసి వారిపై కేసు చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ వెన్నెల, సిబ్బంది నాగ య్య,నాగరాజు,రవికుమార్,బాలు పాల్గొన్నారు.

# నేటి నుంచి కుటుంబ డిజిటల్ కార్డు సర్వే

జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ: తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డు కై వివరాలు ఇచ్చేందుకు ప్రజలు ఆధార్ కార్డుతో( తప్పనిసరి కాదు) సహా సిద్ధంగా ఉండాలి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కోరారు. గురువారం నుండి పైలెట్ పద్ధతిన జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ఒక మున్సిపల్ వార్డు, ఒక గ్రామంలో సర్వేను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కుటుంబ డిజిటల్ కార్డు సర్వేను సర్వే బృందాలు శ్రద్ధతో, జాగ్రత్తగా నిర్వహించాలని, నిర్లక్ష్యం వహించవద్దని ఆయన కోరారు. బుధవారం నల్లగొండలోని ఉదయాదిత్య భవన్ లో ఏర్పాటుచేసిన తెలంగాణ కుటుంబ డిజిటల్ కార్డు సర్వే బృందాల శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆధార్ కార్డు ఎన్నో పథకాలకు తప్పనిసరి అయిందని,ఇది వ్యక్తికి మాత్రమే ఉపయోగపడుతున్నదని, అలా కాకుండా కుటుంబానికి కూడా ఒక కార్డు ఎందుకు ఉండకూడదు అన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పైలట్ పద్ధతిన ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు . ఈ విషయమై కుటుంబ డిజిటల్ కార్డు అమలు చేస్తున్న రాష్ట్రాలలో రాష్ట్ర స్థాయి సీనియర్ అధికారుల బృందాలు అధ్యయనం చేశాయని ఆయన తెలిపారు. ధనిక, పేద తేడా లేకుండా ప్రతి కుటుంబానికి ఒక కార్డు ఇవ్వాలని సర్వే నిర్వహించేందుకు సర్వే, టాం టాం వేయించాలని,5 రోజులు సర్వే నిర్వహిస్తామని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు.ఈ శిక్షణ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంస్థల టీ. పూర్ణచంద్ర , అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్, నల్గొండ ఇన్చార్జ్ ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్డిఓ శ్రీరాములు, చండూరు ఆర్డీవో సుబ్రహ్మణ్యం, మున్సిపల్ కమిషనర్లు ,తహసిల్దారులు, ఎంపీడీవోలు, సర్వే బృందాల సభ్యులు పాల్గొన్నారు.

## పట్టింపు లేని ప్రత్యేక అధికారుల పాలన



ప్రజాపక్షం /మునుగోడు : రాష్ట్రంలో సర్పంచుల పదవీకాలం ముగియగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పాలన కొనసాగిస్తుంది. పట్టింపు లేని ప్రత్యేక అధికారుల పాలనతో గ్రామాల్లో మురికి కాలువలు శుభ్రపరచక కంపు కొడుతున్నాయి. అనటానికి మునుగోడు మండల కేంద్రంలో పాత ఎస్‌సి కాలనీలో మురికి కాలువల పరిస్థితి అధ్వాన్నంగా తయారైంది. మురికి కాలువలు శుభ్రపరచక అపరిశుభ్రతతో చెత్తాచెదారం కాల్వలో పేరుకుపోయి కంపు కొడుతున్న మురికితో కాలనీవాసులంతా అవస్థలు పడుతున్నారు. మురికి కాల్వల శుభ్రత పట్ల గ్రామ కార్యదర్శికి గ్రామ ప్రత్యేక అధికారికి తెలియజేసిన పట్టించుకోకపోవడం వల్ల కాలనీవాసులు దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రతతో కంపు కొడుతున్న మురికి కాలువల పట్ల సంబంధిత ఉన్నత అధికారులు వెంటనే స్పందించి కాలనీవాసులు అనారోగ్యాలకు గురి కాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## లౌకిక భారతదేశాన్ని కాపాడుకోవాలి




ప్రజాపక్షం/నల్లగొండ : మహాత్మా గాంధీ కన్న కలలు లౌకిక భారతదేశం లక్ష్యాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,ఏఐపిఎస్ఓ జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్యలు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఏఐ పిఎస్ఓ ) ఆధ్వర్యంలో ఫైట్ ఫర్ గాంధీజీ డ్రీమ్ ఫర్ సెక్యులరిజం అండ్ ఫ్రీ పాలస్తీనా కార్యక్రమాన్ని స్థానిక రామగిరిలోని గాంధీ పార్క్ లో నిర్వహించి మహాత్మా గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష వర్గం కట్ట వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది అనంతుల శంకరయ్యలు మాట్లాడుతూ అహింస మార్గంలో భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన గాంధీజీ మార్గానే ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకొని ఆయన మార్గంలో నడుస్తున్నారని గుర్తు చేశారు. పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయిల్ కుట్ర పూరితంగా చేస్తున్న దాడులను ఆపాలి పాలస్తీనాను ఫ్రి పాలస్తీనాగా ప్రకటించాలన్నారు. ప్రపంచ శాంతి కోసం ఏఐపిఎస్ఓ కృషి చేస్తుందని పేర్కొన్నారు. లౌకిక భారత దేశంలో మతోన్మాదాని పెంచి పోషిస్తున్న మతోన్మాదుల నుండి భారతదేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శంకర్ నాయక్, పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, సంఘీభావం తెలపగా కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష వర్గం గుర్రం వెంకటరెడ్డి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఏ ఏ ఖాన్,ముండ్ల ముత్యాలు,షరీపోద్దీన్, వేణు గోపాల్ రెడ్డి,దశరథ,మోహిన్ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు కోసం గ్రామస్తుల ధర్నా



ప్రజాపక్షం/నూతనకల్: మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి గతంలో ఆర్‌టిసి బస్సులు వచ్చేవని ఇప్పుడు గ్రామానికి సమీపంలో 365 జాతీయ రహదారిపై ఉండడంతో బైపాస్ నుండి వెళ్లిపోతున్నాయని తమ గ్రామం నుండి బస్సులు నడపాలని డిమాండ్ చేస్తూ గ్రామానికి చెందిన యువత మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు యువకులు మాట్లాడుతూ సూర్యాపేట డిపోకు చెందిన ఎక్స్ ప్రెస్ బస్సులు హైద్రాబాద్ బంగ్లాకు వెళ్లే సుమారు 15 నుండి 20 బస్సులు గతంలో తమ గ్రామంమీదుగా వెళ్లేవని, గత కొన్ని నెలలుగా బైపాస్ నుండి వెళ్లిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎర్రపహాడ్ గ్రామ సమీపంలోని కొత్తపల్లి, చందుపట్ల, ముకుందాపురం గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడికే వచ్చే బస్సులు ఎక్కుతారని అన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు ఆర్‌టిసి అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని అన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోని వారిని సర్ధి చెప్పి ధర్నాను విరమింప చేశారు. బుధవారం ఆయా గ్రామాల ప్రజలు సూర్యాపేట డిపో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గాడుదుల లింగరాజు, నారగాని యాకస్వామి, మల్లేష్, మోజేష్, సాయి, ఉదయ్, మహేష్, మధు, ఎల్లయ్య ఉన్నారు.

## బహుజన బతుకమ్మ ఉత్సవం కాదు... ఒక మహోద్యమం

అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క



ప్రజాపక్షం/భువనగిరి: బహుజన బతుకమ్మ ఉత్సవమే కాదు మహోద్యమమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య చైర్మన్ విమలక్క అన్నారు. బహుజన బతుకమ్మ కార్యక్రమంలో భాగంగా జనగామ జిల్లా మంచుప్పల వెళ్తున్న బృందం అరుణోదయ రాష్ట్ర కమిటి సభ్యులు భాస్కర్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జగజీవన్ రామ్ విగ్రహం వద్ద ప్రజా సంఘాలు ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా, పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు, బతుకమ్మను బతికిచ్చుకునేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తూ, మహిళలపై పెరుగుతున్న అత్యాచారాలను నిరసిస్తు స్త్రీలు గౌరవంగా జీవించే హక్కులను చాటిచెబుతూ బహుజన బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం నుండి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న బహుజన బతుకమ్మ కార్యక్రమంలో బడుగు బలహీన వర్గాల ప్రజలు, ప్రకృతి ప్రేమికులు, సామాజిక ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పొత్నక్ ప్రమోద్ కుమార్, కౌన్సిలర్ వెంకట్ నర్సింగ్ నాయక్, పడిగెల ప్రదీప్, లంబడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి రాజేష్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాజు నాయక్, పీపుల్స్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ సురుపంగ శివలింగం, మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటుకల దేవేందర్ మాదిగ, ఎరుకల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుతాడి సురేష్ పాల్గొన్నారు.

## డిజె వినియోగం నిషేధం

రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు

ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మతపరమైన ఊరేగింపుల్లో డీజే సౌండ్ సిస్టమ్ వినియోగంపై నిషేధం విధిస్తూ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు ఐపీఎస్ ఉత్తర్వులు జారీ చేసిన ప్రకటనను స్థానిక ఎస్సై భాస్కర్ రెడ్డి బుధవారం తెలిపారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులకు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉండడంతో పాటు చిన్నపిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే అవకాశం ఉన్నట్టు పలు పరిశోధనలు తెలియజేస్తున్నాయి. అంతే కాక సామాన్య ప్రజలు, ముఖ్యంగా వృద్ధుల ఆరోగ్యం దెబ్బతింటుందనే కారణంతో ఇకపై రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఊరేగింపుల్లో డిజే సౌండ్ మిక్సర్లు, యాంప్లిఫయర్ బాణాసంచా ఉపయోగించడాన్ని నిషేధిస్తూ పోలీసు కమిషనర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిబంధనలు, ప్రభుత్వ అనుమతులను ఉల్లంఘిస్తే బీఎన్ఎస్ 223, 280, 292, 293, 324, బీఎన్ఎస్ఎస్ 152, పర్యావరణ పరిరక్షణ చట్టం సెక్షన్ 15 కింద కేసులు నమోదు చేస్తామని సీపీ వెల్లడించారు.

## ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం




ప్రజాపక్షం/ మిర్యాలగూడ: కుల వివక్ష పోరాట సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కోడిరెక్క మల్లయ్య సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేవీపీఆఎస్ ఏర్పడి 26 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా రాష్ట్రంలో అనేక చట్టాలను సాధించడం జరిగిందన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్, 1230 జీవో, జస్టిస్ పున్నయ్య కమీషన్ ఏర్పాటు చేయడంలో కేవీపీఎస్ పాత్ర ఎనలేనిదన్నారు. దళితులకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి ప్రజల మధ్య విద్వేషాలు సృష్టిస్తుందన్నారు. బీజేపీ పాలిత ప్రాంతాల్లో దళితులపై దాడులు జరుగుతున్నాయని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కోడిరెక్క రాధిక, జిల్లా కమిటీ సభ్యులు దైద దేవయ్య, బొల్లంపల్లి రవి, జనార్ధన్, బొంగరాల వెంకటయ్య, ఆకారపు రాములు, బొల్లంపల్లి పాపారావు, దైవ శ్రీను, ఉమేష్, పాక పిచ్చయ్య, మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు భేష్

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయంలో స్వచ్ఛతా హి సేవా 2024 పురస్కారాలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు నడిచే దేవుళ్లని, మనందరి ఆరోగ్యం, పరిసరాల శుభ్రత కోసం నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు. సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు మున్సిపాలిటిలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ సత్యారావు, కౌన్సిలర్ తాహేర్ పాషా, కోఆప్షన్ సభ్యులు సురేష్, శానిటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సురేష్, సతీష్, ఎన్విరాల్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జానీ, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



# మైనంపల్లి...నోరు అదుపులో పెట్టుకో!

**బిఆర్ఎస్ రాష్ట్రనేతలు కడవేర్గు రాజనర్సు, పాల సాయిరాం**

*** మూసీ సుందరీకరణకు బిఆర్ఎస్ వ్యతిరేకం కాదు**

*** కెటిఆర్, హరీష్‌రావులను మైనంపల్లి బెదిరించటంపై సిపికి ఫిర్యాదు**



**ప్రజాపక్షం/సిద్దిపేటప్రతినిధి :** ప్రశాంతంగా ఉన్న సిద్దిపేటలో కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మం తరావు ప్రజాస్వామ్య విరుద్ధంగా చిల్లర వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బిఆర్ఎస్ రాష్ట్రనేత, మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పాల సాయిరాంలు అన్నారు. బుధవారం సిద్దిపేట ఎంఎల్‌ఏ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ మూసీనది పరీవాహక ప్రాంతాన్ని సుందరీకరణ పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రామాలు చేస్తుందన్నారు. పెద్దపెద్ద భవనాలు జోలికి వెళ్లకుండ పేదల ఇండ్లు కూల్చి రోడ్డుల పాలు చేస్తే వారి ఉసురు తగులు తుందని హెచ్చరించారు. ఇప్పటికై హైడ్రా పేరిట మధ్యతరగతి ప్రజల భవనాలు కూల్చి వారిని రోడ్డుకు ఈడ్చారన్నారు. కనీసం సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పరామర్శించిన పాపాన పోలేదన్నారు. మూసీ సుందరీకరణకు బిఆర్ఎస్‌వ్యతిరేకం కాదని, ప్రజలను ఒప్పించి, మెప్పించి చేయాలని హితవు పలికారు.సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాకకు వస్తున్న మైనంపల్లి హన్మంత్‌రావు ఏ హోదాలో వస్తున్నారో చెప్పాలన్నారు. ఏ అధికారం, హోదా లేకున్న సిద్దిపేట పోలీస్ కమిషనర్, అధికారులు భారీగా ఎందుకు బందోబస్తు కల్పి స్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. గజ్వేల్‌కు మల్లన్నసాగర్ బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మైనంపల్లి హన్మంత్‌రావు పోలీసుల ఎదుటనే వందలాది మందితో మాజీ మంత్రులు హరీష్‌రావు, కెటిఆర్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పోలీసులు నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యవహరించటం మంచి పద్దతికాద న్నారు. మైనంపల్లి సిద్దిపేటపై అక్కసుతో హరీష్‌రావుపై వ్యక్తిగత దూషణలు చేయ టం సరికాదని హెచ్చరించారు. సిద్దిపేట,దుబ్బాక, గజ్వేల్‌లో కాంగ్రెస్ నాయకులు లేరా, మైనంపల్లి ఇక్కడకు వచ్చి గుం డాగిరి చేయటం ఏంటని, మల్కాజిగిరిలో ప్రజలు తిరస్కరించటంతో మతిభ్రమించిదని విమర్శించారు.మరోసారి హరీష రావు, కెటిఆర్‌పై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తస్మాత్ జాగ్రత్త అని హెచ్చరించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో మల్లన్నసాగర్ నిర్వాసితులను పరామర్శించిన మాజీ ఎంఎల్‌ఏ మైనంపల్లి హన్మ ంత రావు మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్ రావులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, పోలీసుల సమ క్షంలో చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఈ విషయంపై సిద్దిపేట పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ నేతలు గుండు భూపేశ్, అరవింద్‌రెడ్డి, సాయన్న గారి సుందర్,నందిని శ్రీనివాస్, కొర్తివాడ లక్ష్మ ణ్ సయ్యద్, నవీన్, నాగరాజు తదితర బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఖైదీల సంక్షేమానికి చర్యలు తీసుకుంటాం

కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా జడ్జి ప్రతిమ



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జైల్లో ఖైదీలు క్రమశిక్షణతో మెలగాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి, జిల్లా జడ్జి ప్రతిమ పేర్కొన్నారు. బుధవారం కరీం నగర్‌లోని జిల్లా కారాగారంలో ఖైదీల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ శిక్షపడ్డ వ్యక్తిని జైలులో మంచిగా మారుస్తామని, జైలు నుంచి విడుదలైన తర్వాత సమాజాన్ని ఆదరించాలన్నారు. కరీంనగర్ సిపి అభిషేక్ మహంతి మాట్లాడుతూ అక్టోబర్ 2న ఖైదీల సంక్షేమ దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ ట్రైనీ కలెక్టర్ అజయ్ కుమార్ , ఆర్‌డిఒ మహే శ్వర్, డిఎల్ఎస్ వెంకటేష్‌లు మెమొంటోలు అందిచి శాలువాలతో సన్మానించారు.

## కార్మికులందరికీ కంటి పరీక్షలు

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** జిల్లాలోని పారిశుధ్య కార్మికులకు కంటి పరీక్షలు నిర్వహించి అసవర మైన వారికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేం ద్రంలోని ప్రధాన ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. స్వచ్ఛతాహి సేవా వారోత్సవాల్లో భాగంగా జిల్లాలోని మున్సిపాలిటీ, పంచాయతీల్లో పనిచేసే సుమారు 3వేల మంది పారిశుధ్య కార్మికులందరికీ కంటి పరీక్షలు చేయించాలన్నారు. స్క్రీనింగ్ రూం పరిశీలించి డిఎంహెచ్ఓ సుజాత, ఇన్‌చార్జి ఆర్ఎంఒ నవీనను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే 600 మందికి స్క్రీనింగ్ నిర్వహించామని, కంటి సమస్యలతో బాధపడుతున్న 20 మందికి క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేయ నున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐఎఎస్ అజయ్ కుమార్, ఆస్పత్రి సూపరిండెంట్ వీరారెడ్డి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిదా, ఆప్తమాలజిస్ట్ నలిని, జయంతి, డాక్టర్ చంద్రశేఖర్, అధికారులున్నారు.

## మహాత్మాగాంధీ ఆశయాలే ఆదర్శం

మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి - రాజమల్లు



**ప్రజాపక్షం /సుల్తానాబాద్ :** మహాత్మా గాంధీ ఆశయాలే ఆదర్శమని మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు పిలుపునిచ్చారు. బుధవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పాలకవర్గంతో కలిసి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన, అనంతరం మాట్లాడుతూ శాంతియుత మార్గంలో దేశానికి స్వాతంత్రం తీసుకొచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ అని, ఆయన ఆశ య సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ బిరుదు సమత కృష్ణ, కౌన్సిలర్లు నిషాద్ రఫిక్, కూకట్ల గోపి, గొట్టం లక్ష్మి మల్లయ్య , అరుణ బాబురావు, రెవెల్లి తిరుపతి, దున్నపోతుల రాజయ్య, గుర్రాల శ్రీనివాస్,మున్సిపల్ మేనేజర్ అలీమొద్దిన్,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

## 4వ తేదీన రైతు రణభేరి ధర్నా

జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షులు నల్లరమేష్ రెడ్డి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** రైతు రణభేరి ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా రైతు ఐక్యవేదిక అధ్యక్షులు నల్ల రమేష్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో బుధవారం రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రెండు లక్షల లోపు రుణమాఫీతో వడ్లకు బోనస్ తదితర రైతులకు ఇస్తానన్న హమీలను నెరవేర్చుకోవడానికి ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకొచ్చేందుకు 4వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ఛలో కలెక్టరేట్ దర్నాకు పార్టీలక తీతంగా జిల్లాలోని రైతులు అందరూ పెద్ద ఎత్తున పాల్గొని దర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆహ్వానం



**ప్రజాపక్షం/సారంగాపూర్:** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలంలోని నాగునూర్ గ్రామంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు అంబేద్కర్ సంఘం సభ్యులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు.

## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ పంపిణీ



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** లయన్స్‌క్లబ్ ఆఫ్ గొల్లపల్లి ఆధ్వర్యంలో లయన్ సజ్జనపు శ్రీనివాస్ సహకారంతో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. జగిత్యాల జిల్లాలోని గొల్లపల్లి మండల కేంద్రంలోని విశ్వబ్రహ్మణ సంఘం భవనంలో మండల కేంద్రానికి చెందిన మారుపాక అఖిలకు కుట్టుమిషన్‌ను అందజేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుట్టు మిషన్ తో జీవన ఉపాధిని సంపాదించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో లయన్ ప్రతినిధులు లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి నరహరి, కోశాధికారి సత్యనారాయణ, సెకండ్ వైస్ ప్రెసిడెంట్ వెంకట రమణ, విశ్వబ్రహ్మణ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

## గాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శం

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** మహాత్మా గాంధీ జీవన విధా నం ప్రతి ఒక్కరికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సమావేశ మందిరంలో జాతిపిత మహా త్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్‌లాల్ తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో భాగంగా జరిగిన క్విట్ ఇండియా, విదేశీ వస్త్రాల బహిష్కరణ మొదలగు ఉద్యమాలు ఒక్కరోజులో వచ్చినవి కావని, గాంధీ మహనీయులు ప్రతి రోజూ నమ్మిన సిద్ధాంతం ప్రకారం నిరంతరాయంగా చేసిన కృషి ఫలితంగా ఉద్యమాలు సఫలీకృతం అయ్యాయని, ఒక్కరోజులో ఫలితం రాలేదని కలెక్టర్ పేర్కొన్నారు. మహాత్మాగాంధీని నేటి యువత ఆద ర్శంగా తీసుకోవాలని, నిరంతరాయంగా లక్ష్యం కోసం శ్రమిస్తే ఫలితం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం మహాత్మ గాంధీ స్మారక నిధి వారు రూపొందించిన మహాత్మ గాంధీ సూక్తుల పుస్తకాన్ని కలె క్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, డి.ఎం. అండ్ హెచ్. ఓ. డాక్టర్ ప్రమోద్ కుమార్, ఇతర జిల్లా అధికారులు, కలెక్టరేట్ సి. సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షులు బాలసాని వెంకటేశం, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పండుగలకు ఘన ఏర్పాట్లు



**- రాజన్నసిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా**

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** బతుకమ్మ,దసరా,దీపావళి పండుగలకు అన్ని ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని రాజన్నసిరిసిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం లో జిల్లా పంచాయతీ అధికారి ఇన్‌చార్జి శేషాద్రి, వీర్నపల్లి, ముస్తాబాద్ ఎంపిడిఒలు, తహసీల్దార్లు, పంచాయతీ సెక్రటరీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడుతూ ఆయా మండలాల ప్రతి గ్రామం వారీగా పారిశుధ్య పనులు, ఇంటిపన్ను, ఇతర అంశాలు, కలెక్టర్ చర్చించారు. ప్రత్యేకాధికారులు, ఇన్‌చార్జిలు ప్రధాన కూడళ్ళ వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. ప్రతిరోజు శానిటేషన్, పిచ్చిమొక్కలు, రోడ్డు డ్రైనేజి వ్యవస్థ పరిశీలించాలన్నారు. వీధిలైట్లు తదితర వాటికి ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రానున్న నెల రోజుల్లో పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒలు సత్తయ్య,రాజెందర్,రఘురాం, తహసీల్దార్ రాంచంద్రం, సురేష్, మారుతిరెడ్డి, ఎంపీవోలు రాజు, బీరయ్య, వాజిద్ తదితర ప్రత్యేకాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## బిల్ కలెక్టర్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న మనోజ్ పై బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షకి అదే గ్రామానికి చెందిన బొల్లంపల్లి సంతోష్ కుమార్ గౌడ్ ఫిర్యాదు చేశారు. ఖమ్మంపల్లి బిల్ కలెక్టర్ గా విధులు నిర్వహించే మనోజ్ సమయపాలన పాటించడం లేదని, అదే విధంగా స్థిర నివాసం ఉండకుండా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ రావు మండలం తాడిచర్ల గ్రామం నుండి సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా 12 గంటలకు గ్రామపంచాయతీ కార్యానికి వచ్చి రెండు గంటల లోపే తిరిగి వెళ్లడం జరుగుతుందని, గ్రామపంచాయతీ సంబం ధించిన విద్యుత్ వైర్లు, బల్బులు, మోటర్లు, తదితర వస్తువులు మాయం అవుటలో బిల్ కలెక్టర్ పాత్ర ఉందంటూ ఫిర్యాదులు పేర్కొన్నారు. గ్రామపంచాయతీలో పారిశుధ్యం పై నిర్లక్ష్య ధోరణి తోపాటు విధుల పట్ల అలసత్వంగా ఉంటూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బిల్ కలెక్టర్ పై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి బొల్లంపల్లి సంతోష్ గౌడ్ ఫిర్యాదు చేశారు.

## మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

**వృథా అవుతున్న నీరు, ఆరు నెలల క్రితం లీకేజీ సరి చేసినా ప్రయోజనం శూన్యం**



**ప్రజాపక్షం/జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గొల్లపెల్లి జగి త్యాల మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ గొల్లపెల్లి రోడ్డు తిమ్మాపూర్ వద్ద పైపు లైన్ లీకేజీతో నీరు సం వత్సరం నుంచి వృథాగా పోతుందని తిమ్మాపూర్ గ్రామస్తులు, పరిసర గ్రామల రైతులు సంబంధింత అధి కారులకు తెలిపారు.ఈ విషయంపై అధికారులకు చాలా సార్లు ఫిర్యాదు చేయగా ఆరు నెలల క్రితం మిషన్ భగీరథ అధికారులు, సిబ్బంది స్పందించి మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీని సరి చేయగా వారం రోజులు పూర్తికాకముందే మళ్లీ ఎక్కువ లీకేజీ అయ్యింది. ప్రధాన రహదారి వెంబడి లీకేజీ నీరు వృథాగా పోతు దని తిమ్మాపూర్ గ్రామస్తులు ఫిర్యాదులు చేసిన అధికారులలో ఇప్పటికీ స్పందించకపోవడంతో నీరు నిలిచి పెద్ద కుంటగా మురికినీటి కుంటగా మారి దోమలు, ఈగలు ఎక్కువయ్యాయి. ఇంత జరుగుతున్న మిషన్ భగీరథ అధికారులలో మాత్రం ఎలాంటి చలనం లేకపోవడం అధికారుల బాధ్యతారహితంగా నిదర్శనం అని పలువురు విమర్శిస్తున్నారు.

**రాజశేఖర్,జగిత్యాల మిషన్ భగీరథ అసిస్టెంట్ ఇంజనీర్ వివరణ :**

జగిత్యాల రూర ల్ మం డ లంలోని తిమ్మాపూర్ గ్రామంలో గొల్లపెల్లి జగి త్యాల మిషన్ భగీరథ మెయిన్ పైపు లైన్ గొల్ల పెల్లి రోడ్డు తిమ్మాపూర్ వద్ద పైపు లైన్ లీకేజీ సమస్యను గురించి వివరణ కోరగా ఆ పైపు లైన్ లీకేజీ దాదాపుగా పదిహేను నుంచి ఇరవై రో జు కు మాత్రమే అవుతుందని సమాధానం ఇవ్వగా తిమ్మాపూర్ గ్రామస్తులు, పరిసర గ్రామల రైతు లు సంవత్సరం నుంచి లీకేజీతో నీరు వృథాగా పోతున్నాయని ప్రశ్నించగా రెండుమూడు రోజులల్లో లీకేజీ సమస్యను సరి చేస్తామని చెప్పారు.

## అల్ఫోర్స్‌లో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**పజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్‌లోని వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యాసంస్థల కేంద్ర కార్యాలయంలో గాంధీ జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ దృఢ సంకల్పంతో చక్క టి కార్యచరణ ప్రణాళికలతో ప్రజలను ఏకతాటిమీదకు తెచ్చి స్వాతంత్ర్యం సాధించిన అవసరం ఎంతగానో ఉందని , బ్రిటీ ష్ చెరనుంచి విముక్తి పొందదంతో చాలా గొప్పదేశంగా పిలవడం జరుగుతుందని చెప్పారన్నారు. వారి త్యాగాన్ని గుర్తించి, లక్ష్యసాధన దృష్టి లో పెట్టుకుని రవీంద్రనాథ్ ఠాగూర్ వారిని మహాత్మగా పిలిచారని చెప్పారు. ప్రజలు వారి ఆశయాలను నెరవేర్చి ఘనంగా నివాళులర్పించాలని వారు అన్నారు.

## రుణమాఫీపై బిఆర్ఎస్ నేతలు రాద్ధాంతం



**ప్రజాపక్షం/రామగిరి :** కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీపై బీఆర్ఎస్ రాద్ధాంతం చేస్తుందని కమాన్ పూర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు సింగల్ విండో చైర్మన్, భాస్కర్ రావు, మాజీ ఎంపీపీ కోలేటి మారుతీలు ఆరోపించారు. బుధవారం కమాన్‌పూర్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ నేతలు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ , మాజీ ఎమ్మెల్యేలు పుట్టమధు కొరుగంటిచందర్, దాసరిమనోహర్‌రెడ్డిలు కలెక్టరేట్‌లో వినతిపత్రం సమర్పించడం విడ్డూరంగా ఉందన్నారు. గత పది సంవత్సరాల టిఆర్ఎస్ పాలనలో రైతులను ఏనాడు పట్టించుకోలేదని రుణమాఫీ చేస్తానని కేసీఆర్ చెప్పి దశలవారీగా తూతూ మంత్రంగా చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చిన ప్రకారం రెండు లక్షల వరకు రుణమాఫీ చేసిందని, దీంతో బిఆర్ఎస్ నేతలకు మింగుడు పడక లేనిపోని ఆరోపణలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్నాయన్నారు. ఇది రైతు ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీఎంపీపీ మల్యాల రాంచందర్ గౌడ్, గాండ్ల మోహన్, బొల్లంపల్లి తిరుపతి గౌడ్, ఆకుల ఓదెలు, రవీందర్, శీలారపు మల్లయ్య, కుక్క రవి, పిడుగు నరసయ్య అరిసె ఎల్లయ్య, పిడుగు శంకర్, తూండ్ల కనకయ్య, భద్రపు శంకర్, ఇనగంటి పాపారావు, చింతపండు మధు ,అహ్మద్ పాల్గొన్నారు.

## ట్రినిటీలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**ప్రజాపక్షం/కరీంనగర్** ప్రతినిధిః కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాలలో చిన్న బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ఫౌండర్ చైర్మన్ దాసరి మనోహర్ రెడ్డి ప్రారంభించి పూలకు, ఆడవారికి అవినాభావ సంబంధం ఉందని, అమ్మవారిని కొలుస్తూ ఆడవారికి, కుటుంబానికి, వ్యవస్థకు అంతా మంచి జరగాలని అని తెలిపారు. తెలంగాణ ఆడపడచులకు బతుకమ్మ పండుగ చాలా విశిష్టమైనదని, తీరొక్క పూలతో అందమైన బతుకమ్మను పేర్చి సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మ పాటలు పాడుతూ తెలంగాణ సాంస్కృతి ప్రతిబింబించేలా ఉత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ పట్టణంలో విసిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలని, పట్టణ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని అధికారులను జిల్లా ఎస్పి అఖిల్ మహాజన్ ఆదేశించారు. స్థానికంగా ఉండే శాంతి భద్రతల సమస్యలు, రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలు ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో గల పెండింగ్ కేసులపై సమీక్షించి వాటికి గల కారణాలు అడిగి తెలుసుకొని త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ay పని చేస్తున్న సిబ్బందిని నామినల్ రోల్ ఆధారంగా సిబ్బంది ఏయే విధులు నిర్వర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. బ్లూకోల్ట్,పెట్రో కార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కు తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటనా స్థలానికి చేరకుని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిఐ వీర ప్రసాద్, ఎస్సై అంజయ్య తదితరులు ఉన్నారు.

## పని దినాల్లో అంగన్‌వాడీ కేంద్రం మూసివేత

*** ప్రతిసారి ఇదే పద్ధతి.. చర్యలు శూన్యం**

*** పట్టించుకోని ఐసిడిఎస్ అధికారులు**



**ప్రజాపక్షం/కోనరావుపేట:** అంగన్‌వాడీ కేంద్రం ఒకటికోడ్ నెంబర్ 119, కేంద్రం బుధవారం పనిదినాల రోజున బంద్ చేసిన ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో జరిగింది. గతంలో కూడా పలుమార్లు ఇదే పరిస్థితి..అధికారులు మాత్రం తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని చేతులు దులుపుకుంటున్నారు. రాష్ట్ర ప్రభు త్వం చిన్నారులకు గర్భిణీలకు బాలింతలకు వారు ఆరోగ్యంగా ఉండడానికి గుడ్లు, పాలు, కూరగాయలు విలువైన పౌష్టికాహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తుంది. కానీ కొందరు కార్యకర్తలు వాటిని పెడచెవిన పెట్టి పైఅధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పలవురు గ్రామస్థులు తెలిపారు. పలుమార్లు ఇలాంటి సంఘటనలు ఎన్నో సార్లు జరిగినా హెచ్చరించిన ఇలాంటి పొరపాట్లు మాత్రం చేయడం మానడం లేదు. సంబంధిత అధికారుల అండదండలతోనే ఇలా చేస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు మహిళలకు పోషకాహారం అందించాల్సిన సమయంలో పని దినాలలో అంగన్వాడీ కేంద్రం మూసి ఉంచడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఎన్ని సార్లు హెచ్చరించినా పద్దతి మార్చుకోని అంగన్వాడీ కార్యకర్తపై ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## వేములవాడ రాజన్న సేవలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ కుటుంబం



**ప్రజాపక్షం /వేములవాడ :** వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని బుధవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ సతీమణి లావణ్య కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద పండితులు ఆశీర్వచన మండపంలో స్వామివారి తీర్థప్రసాదాలను ఆశీర్వచనాన్ని అందజేశారు. వారి వెంట ఆలయ అధికారులు పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# క్రీడ

## భారత్ వేదికగా ఖో ఖో తొలి ప్రపంచకప్



ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చరిత్రలోనే మొట్టమొదటి వరల్ కప్ నిర్వహించనుంది. 2025లో భారత్ వేదికగానే ఖో ఖో వరల్ కప్ పోటీలు జరగనున్నాయి. అంతర్జాతీయ ఖో ఖో ఫెడరేషన్‌తో కలిసి భారత ఫెడరేషన్ ఈ వరల్డ్‌కప్ నిర్వహించనుంది. ప్రపంచవ్యాప్తంగా ఈ టోర్నీలో 24 దేశాలు పాల్గొననున్నాయి. మొత్తం 16 పురుష, మహిళా జట్లు పోటీల్లో తలపడే అవకాశం ఉంది. 2032 ఒలింపిక్స్‌లో చోటు దక్కించుకోవడమే లక్ష్యమని ఖో ఖో ఇండియా ప్రకటన చేసింది. 'భారత్‌లో తొలి ప్రపంచకప్ నిర్వహించేందుకు మేం సంతోషిస్తున్నాం. ఈ వరల్డ్‌కప్ కేవలం పోటీల కోసమే కాదు. ప్రపంచంలోని వివిధ దేశాలను ఒక్కతాటిపైకి తెచ్చి, ఈ క్రీడకు విశ్వవ్యాప్తంగా క్రేజ్ తీసుకురావడమే మా లక్ష్యం. 2023 ఒలింపిక్స్‌లో ఖో ఖో ఆటను చూడడం మా కల. ఆ కల సాకారం చేసుకోవడానికి ఈ వరల్డ్‌కప్ నిర్వహణ తొలి అడుగు' అని ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ సుదాంశూ మిత్తల్ పేర్కొన్నారు.

**50 లక్షల టార్గెట్**

అయితే ప్రపంచకప్‌కు ముందు ఈ ఆటను మరింత ఎక్కువ మందికి చేరేలా ఖో ఖో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రణాళిక రచిస్తోంది. దాదాపు 10 నగరాల్లో 200 పాఠశాలలల్లో ఖో ఖో గేమ్‌ను ప్రమోట్ చేయాడానికి ప్లాన్ చేస్తోంది. వరల్డ్‌కప్ పోటీలకు ముందు ఓ స్పెషల్ డ్రైవ్‌తో దేశంలో కనీసం 50 లక్షల సభ్యత్వాలు నమోదు చేయాలని టార్గెట్‌గా పెట్టుకుంది. ఖో ఖో క్రీడకు సంబంధించి దాని మూలాలు భారత్‌లోనే ఉన్నాయి. భారత్‌లో ఈ ఆటకు సూపర్ క్రేజ్ ఉంది. ఇక్కడ ఈ గేమ్ ఆడే అథ్లెట్లు కూడా ఎక్కువే. భారత సంస్కృతిక క్రీడ అయినటువంటి ఖో ఖో ఇప్పుడు సరిహద్దులు దాటి వివిధ దేశాలకు విస్తరించింది. ప్రస్తుతం ఖో ఖో ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల్లో ఆడుతున్నారు.

## చరిత్ర సృష్టించిన సర్ఫరాజ్ ఖాన్..

### డబుల్ సెంచరీతో విధ్వంసం



**న్యూఢిల్లీ :** టీమిండియా బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ డబుల్ సెంచరీ బాదాడు. ఇరానీ కప్ 2024లో భాగంగా రెస్టాఫ్ ఇండియాతో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై తరఫున బరిలోకి దిగిన సర్ఫరాజ్ ద్విశతకంతో చెలరేగాడు. 253 బంతుల్లో డబుల్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. 24 ఫోర్లు, 4 సిక్సర్లతో హోరెత్తించాడు. సర్ఫరాజ్ ధాటికి ముంబై 500 పరుగులను దాటింది. అయితే డబుల్ సెంచరీ సాధించిన సర్ఫరాజ్ ఖాన్ అరుదైన ఘనతలు అందుకున్నాడు. ఇరానీ కప్‌లో ద్విశతకం బాదిన తొలి ముంబై ప్లేయర్‌గా చరిత్రకెక్కాడు. అంతేగాక కనీసం 4000+ పరుగులు సాధించిన భారత ఆటగాళ్లలో అత్యధిక సగటు సాధించిన రెండో ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు. సర్ఫరాజ్ 69.8 సగటుతో పరుగులు సాధిస్తున్నాడు. అగ్రస్థానంలో విజయ్ మర్చంట్ (81.8 సగటు) ఉన్నాడు. ఈ జాబితాలో విజయ్ మర్చంట్, సర్ఫరాజ్ ఖాన్ తర్వాతి స్థానాల్లో అజయ్ శర్మ (68.7), శాంతాను సుగ్వేకర్ (63.1), విజయ్ హజారె (61.2) ఉన్నారు. కాగా, ఓవర్‌నైట్ స్కోరుతో 237/4 బుధవారం రెండో రోజు ఆట ఆరంభించిన ముంబయి ఆదిలోనే వికెట్ కోల్పోయింది. సెంచరీ దిశగా సాగుతున్న కెప్టెన్ అజింక్య రహానె 97 పరుగుల వద్ద ఔటయ్యాడు. యశ్ దయాల్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో రహానెసర్ఫరాజ్ 131 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే షామ్స్ ములాని (5) కూడా ఔటవ్వడంతో ముంబై స్వల్ప వ్యవధిలోనే రెండు వికెట్లు కోల్పోయింది.అయితే ప్రత్యర్థి జట్టు మ్యాచ్‌పై పట్టు బిగించకుండా సర్ఫరాజ్.. తనుష్ కొటియన్ (64)తో కలిసి ఇన్నింగ్స్ చక్కదిద్దాడు. తనుష్‌తో కలిసి 183 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నమోదు చేశాడు. ఈ క్రమంలో 149 బంతుల్లో శతకం సాధించాడు. మరో 104 బంతుల్లో దాన్ని ద్విశతకంగా మలిచాడు. బంగ్లాదేశ్ టెస్టు సిరీస్‌కు సర్ఫరాజ్ ఖాన్ కూడా ఎంపికైన విషయం తెలిసిందే. అయితే రెండు టెస్టుల్లోనూ తుదిజట్టులో చోటు దక్కించుకోలేకపోయాడు. కేఎల్ రాహుల్‌కు అవకాశం ఇవ్వడంతో అతను బెంచ్‌కే పరిమితమయ్యాడు. మరోవైపు ఇటీవల తన సోదరుడు ముషీర్ ఖాన్ రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ప్రాణాపాయం తప్పినప్పటికీ మెడ భాగంలో గాయాలయ్యాయి. అయినా సర్ఫరాజ్ మైదానంలో ఏకాగ్రత కోల్పోకుండా పరుగులతో సత్తాచాటుతుండటం విశేషం.

## ఐసిసి ర్యాంకింగ్‌లో బుమ్రా టాప్



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ బుధవారం టెస్టు ర్యాంకింగ్స్ విడుదల చేసింది. ఇందులో టీమ్ ఇండియా ప్లేయర్లు అదరగొట్టారు. బౌలింగ్ విభాగంలో భారత జట్టు పేసర్ జస్ప్రీత్ బుమ్రా 870 రేటింగ్స్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. అలాగే 869 పాయింట్లతో రవిచంద్రన్ అశ్విన్ రెండో ప్లేస్‌లో ఉన్నాడు. అలాగే బ్యాటింగ్ విభాగంలోనూ టీమ్ ఇండియా బ్యాటర్ యశస్వీ జైస్వాల్ రెండు స్థానాలు మెరుగుపర్చుకుని 792 రేటింగ్స్‌తో మూడో స్థానంలో నిలిచాడు. అలాగే కింగ్ కోహ్లీ ఏకంగా 6 స్థానాలు మెరుగుపర్చుకుని ఆరో ప్లేస్‌లో ఉన్నాడు.

**అశ్విన్‌ను వెనక్కినెట్టి టాప్‌లో బుమ్రా**

ఇటీవలే బంగ్లాతో జరిగిన టెస్టులో బుమ్రా ఆరు వికెట్లతో అదరగొట్టడం వల్ల అశ్విన్ ను ర్యాంకింగ్స్‌లో వెనక్కినెట్టి మొదటి స్థానాన్ని దక్కించుకున్నాడు. అలాగే టీమ్ ఇండియా ప్లేయర్ రవీంద్ర జడేజా 809 రేటింగ్స్‌తో ఆరో ప్లేస్‌లో ఉన్నాడు. అలాగే శ్రీలంక యువ సంచలనం ప్రభాత్ జయసూర్య ఒకస్థానం మెరురుపర్చుకుని 8 స్థానంలో నిలిచాడు. అయితే టాప్10లో టీమ్ ఇండియాకు చెందిన ముగ్గురు బౌలర్లు చోటు దక్కించుకోవడం విశేషం. టెస్టుల్లో టాప్10లో జస్ప్రీత్ బుమ్రా, రవిచంద్రన్ అశ్విన్, జోష్ హేజిల్ వుడ్, పాట్ కమిన్స్, కగిసో రబాడా, రవీంద్ర జడేజా, నాథన్ లయన్, ప్రభాత్ జయసూర్య, కైల్ జేమిసన్, షాహీన్ అఫ్రిదీ ఉన్నారు.

**టాప్-10లోకి దూసుకొచ్చిన విరాట్, జైస్వాల్**

బంగ్లాతో జరిగిన టెస్టు సిరీస్ లో అదరగొట్టడం వల్ల టీమ్ ఇండియా బ్యాటర్లు యశస్వీ జైస్వాల్, విరాట్ కోహ్లీ ర్యాంకులు మెరుగుపడ్డాయి. జైస్వాల్ 3, కోహ్లీ ఆరో స్థానంలో నిలిచారు. అలాగే టీమ్ ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ, రిష భ్ పంత్ వరుసగా 5,3 స్థానాలు కోల్పోయి 15, 9వ స్థానంలో నిలిచారు. టెస్టుల్లో టాప్‌లో ఇంగ్లాండ దిగ్గజం జో రూట్ ఉన్నాడు. 899 రేటింగ్స్‌తో అ గ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. 829 రేటింగ్స్ తో కేన్ విలియమ్సన్ రెండో ప్లే స్ లో ఉన్నాడు. బ్యాటింగ్ విభాగంలో కూడా ముగ్గురు టీమ్ ఇండియా ప్లే యర్లు చోటు దక్కించుకున్నారు. టెస్టుల్లో టాప్ 10 బ్యాటర్స్‌లో జో రూట్, కేన్ విలియమ్సన్, యశస్వీ జైస్వాల్, స్టీవ్ స్మిత్, ఉస్మాన్ ఖవాజా. విరాట్ కోహ్లీ, మహ్మద్ రిజ్వాన్, మార్నస్ లబుషేన్, రిషభ్ పంత్, డార్లీ మిచెల్ ఉన్నారు.

# రీల్





## 'విశ్వం'ను 75 రోజుల్లోనే ముగించేశాడు

మ్యాచో స్టార్ గోపీచంద్ నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ మూవీ 'విశ్వం' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలను క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు శ్రీను వైట్ల తెరకెక్కిస్తుండటంతో టాలీవుడ్ వర్గాల్లో ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. చాలా గ్యాప్ తరువాత శ్రీను వైట్ల మరోసారి పూర్తి ఎంటర్‌టైనింగ్ కథతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నట్లు తెలిపారు. దీంతో 'విశ్వం' మూవీ ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అదరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా హీరో గోపీచంద్ ఈ చిత్రం, దర్శకుడు శ్రీను వైట్ల గురంచి కొన్ని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. విశ్వం సినిమాను దర్శకుడు శ్రీను వైట్ల చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకున్నారని.. ఈ సినిమాను ఆయన కేవలం 75 రోజుల్లోనూ పూర్తి చేశాడని గోపీచంద్ తెలిపాడు. 'విశ్వం' సినిమాపై శ్రీను వైట్ల పూర్తి కాన్ఫిడెంట్‌గా ఉన్నాడని. ఈ సినిమాతో ఆయన తిరిగి సక్సెస్ ట్రాక్ ఎక్కడం ఖాయమని చిత్ర యూనిట్ తెలిపింది. ఇక ఈ సినిమాలో అందాల భమ కావ్య థాపర్ హీరోయిన్‌గా నటించగా, అక్టోబర్ 11న రిలీజ్ కానుంది.

## 'విజయ్ 69' సినిమాలో పూజా హెగ్డే..



కోలీవుడ్ స్టార్ హీరో దళపతి విజయ్ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం కోసం అందరికీ తెలిసిందే. మరి దర్శకుడు వెంకట్ ప్రభు ఈ చిత్రాన్ని విజయ్ కెరీర్ లో 68వ సినిమాగా చేశారు. అయితే ఈ చిత్రం తర్వాత విజయ్ తన కెరీర్ 69వ సినిమా చేసి ఇక సినిమాలు ఆపేస్తున్నట్టుగా తెలిపాడు. దీనితో తన 69వ సినిమాపై భారీ అంచనాలు నెలకొనగా ఇప్పుడు మేకర్స్ ఈ సినిమాపై ఒకో అప్డేట్ ని అందిస్తూ వస్తున్నారు. అలా రీసెంట్ గానే బాలీవుడ్ ప్రముఖ నటుడు బాబీ డియోల్ ఈ సినిమాలో ఉన్నట్టుగా మేకర్స్ అఫీషియల్ గా ప్రకటించేసారు. ఇక గత కొన్ని రోజులు నుంచి ఈ సినిమాలో స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే కూడా ఉందని పలు రూమర్స్ బయటకి వచ్చాయి. మరి వీటిని నిజం చేస్తూ మేకర్స్ అధికారిక అనౌన్సమెంట్ ఇచ్చేసారు. దీనితో విజయ్ తో పూజా రెండోసారి జత కట్టనుండటం ఖరారయింది. ఇక ఈ చిత్రాన్ని కోలీవుడ్ టాలెంటెడ్ దర్శకుడు హెచ్ వినోద్ దర్శకత్వం వహిస్తుండగా అనిరుద్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే కన్నడ నిర్మాణ సంస్థ కే వి ఎన్ ప్రొడక్షన్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.

## 'వేట్టయన్' ట్రైలర్ అదుర్స్





తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'వేట్టయన్ ద హంటర్' దసరా కానుకగా గ్రాండ్ రిలీజ్‌కి రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు జ్ఞానవేల్ డైరెక్ట్ చేయగా పవర్‌ఫుల్ కాప్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ప్రేక్షకులను అలరించబోతుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి మార్కులు పడ్డాయి. ఇక తాజాగా ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను మేకర్స్ లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ కట్ పవర్‌ఫుల్‌గా ఉండటంతో పాటు సినిమా కథను దాదాపుగా రివీల్ చేశారు. నిజాయతీగల పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా రజినీకాంత్ ఈ సినిమాలో నటిస్తున్నాడు. ఇక రజినీ తనదైన మార్క్‌తో చేసిన యాక్షన్, ఆయన చెప్పే డైలాగులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ సినిమాలో భారీ క్యాస్టింగ్ నటిస్తున్నారు. అందులో బిగ్ బి అమితాబ్ బచ్చన్, ఫహాద్ ఫాజిల్, రానా దగ్గుబాటి వంటి స్టార్ యాక్టర్స్ కూడా ఉన్నారు. వేట్టయన్ చిత్రంలో మంజు వారియర్, రితికా సింగ్, దుషారా విజయన్, అభిరామి తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ ఈ సినిమాకు సంగీతాన్ని అందించాడు. లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఈ సినిమాను సుభాస్కరన్ ప్రొడ్యూస్ చేశారు. దసరా కానుకగా ఈ చిత్రం అక్టోబర్ 10న గ్రాండ్ రిలీజ్‌కి రెడీ అయ్యింది.

## ప్రపంచ శాంతికి మహాత్మాగాంధీ చేసిన కృషి దేశానికే ఆదర్శం : ఐప్సో





**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ప్రపంచ శాంతికి మహాత్మాగాంధీ చేసిన కృషి దేశానికే ఆదర్శమని పలువురు వ్యక్తులు కొనియాడారు. అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు మంగళవారం ఐప్సో తెలంగాణ రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో చైతన్యపురిలో రాష్ట్ర ఐప్సో ప్రధాన కార్యదర్శి డా. కాచం సత్యనారాయణ అధ్యక్షతన గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగని ప్రభాకర్, అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్, జిహెచ్ఎంసి హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ తిప్పర్తి యాదయ్య, రాష్ట్ర కార్యదర్శులు డా. సమతా రోష్నీ, జె.కె. శ్రీనివాస్, పోలగాని రవి కిశోర్, రామచంద్రా రెడ్డి, యర్రమాద కృష్ణా రెడ్డి, బొమ్మగాని నాగభూషణం, అరుణ్ కుమార్, చిన్నోజు సాగర్, దాము మహేందర్, సాయి, పరమేష్, మహేష్, రామచంద్రారెడ్డి, సత్యనారాయణ, వెంకట్, శ్రీకాంత్, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొమ్మగని ప్రభాకర్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ ఏకపక్ష దాడులతో పాలస్తీనా, గాజ ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్నగా, సోమవారం నుంచి ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం మొదలు కావడం పట్ల ప్రపంచ శాంతికి తీవ్ర వి ఘాతమన్నారు. యుద్ధ ప్రమాదాన్ని, నష్టాన్ని ఈ ప్ర పంచం అనుభవించి ఆ జ్ఞాపకాలను ఇంకా మ రిచిపోలేదన్నారు. పాలస్తీనా కోసం, లౌకిక భారతదే శం కోసం గాంధీ కృషి ఆదర్శనీయమన్నారు. రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కెవిఎల్ మా ట్లాడుతూ అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం దేశ వ్యాపితంగా మంగళవారం గాంధీ జయంతులను నిర్వహిస్తూ, యుద్ధాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేస్తోందని చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాచం సత్యనారాయణ మాట్లాడుతూ సామ్రాజ్యవాద, యుద్ధోన్మాద ఆలోచనలు ఈ ప్రపంచాన్ని యుద్ధంతో దోచుకుంటున్నాయని అన్నారు.

## పేదల ఇళ్లను కూల్చితే స్వయంగా అడ్డుకుంటా



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** మూసీప్రక్షాళణ పేరుతో ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చే పరిస్థితి వస్తే తానే స్వయంగా అడ్డుగా ఉంటానని బిజెపి అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి మూసీ నిర్వాసిత బాధితులకు భరోసా ఇచ్చారు. హైడ్రా, మూసీ కూల్చివేతల అంశంలో గురువారం బిజెపి కార్యచరణను ప్రకటిస్తుందని ఆయన వెల్లడించారు. మూసీ సుందరీకరణలో భాగంగా నిర్వాసితులయ్యే బాధితులను ఆదుకునేందుకు రేపట్నుంచే తమ పోరాటం ఉంటుందని ఆయన తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాలు ముసారాంబాగ్, అంబేద్కర్ నగర్, తులసి నగర్, కృష్ణానగర్ తదితర బస్తీలల్లో బుధవారం కిషన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి నిర్వాసిత కుటుంబాల బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఇళ్లు కూల్చే పరిస్థితి వస్తే తానే అడ్డుగా నిలబడి కాపాడతానని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఎవరూ అధైర్య పడొద్దని, మీ అందరికీ బిజెపి తోడుగా ఉంటుందని భరోసా కల్పించారు.హైడ్రా కూల్చివేతలపై బిఆర్ఎస్ కార్యానిర్వాహక అధ్యక్షులు కెటిఆర్ ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియదని ఇళ్ల కూల్చివేతలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, ఇళ్ల కూల్చడంతో కేంద్రానికి ఏం సంబంధమో ఆయనే చెప్పాలి.

## 'ఆరెక్స్ బెనిఫిట్స్' సామర్థ్య కేంద్రం ఏర్పాటుతో 300 మందికి ఉద్యోగాలు

### రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఆరెక్స్ బెనిఫిట్స్ అనే సంస్థ దేశంలోనే మొదటిసారి హైదరాబాద్ లో గ్లోబల్ సామర్థ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆరెక్స్ బెనిఫిట్స్‌సంస్థ ప్రతినిధులు మంత్రి శ్రీధర్‌బాబుతో భేటీ అయ్యారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వచ్చే రెండేళ్లలో ఆరెక్స్ బెనిఫిట్స్ ఈ సామర్థ్యం ఏర్పాటు ద్వారా300 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని, రాష్ట్రంలోని ప్రతిభావంతులకు మంచి అవకాశాలు దక్కుతాయని తెలిపారు. ఈ సంస్థ తనకు క్లయింట్లుగా ఉన్న ఫార్మసీలకు లాభాలు పెంచుకోవడంలో తోడ్పడుతుంది. హైదరాబాద్ నైపుణ్య కేంద్రం ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ప్రొడక్ట్ ఇంజనీరింగ్ కార్యక్రమాలను నిర్వహిస్తుందని శ్రీధర్‌బాబు వెల్లడించారు. రాష్ట్రంలో సాంకేతిక నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత అపారంగా ఉన్నందున బహుళ జాతి సంస్థలకు చుక్కానిగా మారిందని ఆయన తెలిపారు. వ్యాపార విస్తరణకు అనుకూల వాతావరణం ఉండటం, మౌలిక సదుపాయాల పరంగా ఎటువంటి సమస్యలు లేనందున ఆరెక్స్ బెనిఫిట్స్ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుందని వివరించారు. ఆధునిక సాంకేతిక, జెనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో వివిధ రంగాల్లో డిజిటల్ పరివర్తన అనివార్యంగా మారిందని చెప్పారు. సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఆరెక్స్ బెనిఫిట్స్ సిఇఓ వెండీ బార్నెస్, సిఎఫ్ ఓ థాడ్ క్వియాట్ కౌస్కి, చీఫ్ ప్రొడక్ట్ ఆఫీసర్ శేఖర్ ఖేరా, సమిట్ కన్సల్టెన్సీ సర్వీసెస్ సందీప్ శర్మ, తెలంగాణా లైఫ్ సైన్సెస్ ఫౌండేషన్ శక్తి నాగప్పన్ తదితరులు పాల్గొన్నారు.

## కూలిన హెలికాప్టర్

(మొదటి పేజీ తరువాయి)

ఏవియేషన్‌కు చెందిన హెలికాప్టర్ ఆక్స్‌ఫర్డ్ కౌంటీ గోల్ఫ్ కోర్స్ హెలిప్యాడ్ నుంచి బయలుదేరి ముంబయిలోని జుహూకు వెళ్తుండగా ఉదయం 7.40 గంటలకు కూలిపోయిందని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, గోల్ఫ్ కోర్స్‌కు సమీపంలో ఉన్న బవ్‌ధాన్ ప్రాంతంలోని కొండ భూభాగం వద్ద ఘటన జరిగింది. 'హెలికాప్టర్ ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. అగ్నిమాపక శాఖ వాహనాలతో మా బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి' అని పింప్రి చింద్వాడ పోలీస్ కమిషనర్ వినయ్కుమార్ చౌబె తెలిపారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) అధికారి కూడా ఈ ఘటన ఉదయం 7.40 గంటలకు జరిగిందని, ప్రమాదానికి గురైన అగస్టా 109 హెలికాప్టర్ హెరిటేజ్ ఏవియేషన్‌కు చెందినదని ధృవీకరించారు. ప్రమాదం తర్వాత, హెలికాప్టర్‌కు మంటలు అంటుకున్నాయని పోలీసులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది, వాటర్ ట్యాంకర్లతో ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతులను గిరీష్ కుమార్, ప్రీతమ్ సింగ్ భరద్వాజ్, పరమజీత్ సింగ్‌లుగా గుర్తించినట్లు పింప్రీ చింద్వాడ మున్సిపల్ కార్పొరేషన్ అగ్నిమాపక అధికారి అనిల్ డిమ్లే తెలిపారు. అక్స్‌ఫర్డ్ కౌంటీ గోల్ఫ్ కోర్స్‌లోని హెలిప్యాడ్ నుంచి ఉదయం 7.30 గంటలకు హెలికాప్టర్ బయలుదేరిందని పింప్రీ చించ్‌వాడ్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శశికాంత్ మహావర్కర్ తెలిపారు. ఆ ప్రాంతంలో పొగమంచు కారణంగా ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. అయితే దర్యాప్తు తరువాత కచ్చితమైన కారణం తెలుస్తుందన్నారు.

## కార్మిక చట్టాలు కాగితాలకే పరిమితమా?

(మొదటి పేజీ తరువాయి)

గోదాములకు వెళ్లి బీహార్ వలస కార్మికునికి ప్రమాదంపై ఆరా తీసి మృతుని కుటుంబ సభ్యులకు నష్టపరిహారం చెల్లించాలని, ఎలాంటి లేబర్ లైసెన్స్ లేకుండా వందలాది కార్మికులతో పనులు చేయిస్తున్న రాణి అండ్ కో గోదామును సీజ్ చేయాలని, కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని, పెద్దపల్లి కార్మిక శాఖ అధికారి దృష్టికి తీసుకురాగా ఆ గోదాం మా పరిధిలోకి రాదని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ (ఏ ఎల్ ఓ) గారు చెప్పడం విడ్డూరంగా ఉందని కార్మిక సంఘాల నాయ్యకులు వాపోయారు.ఈ తతంగంపై ప్రజాపక్షం దినపత్రికలో లేబర్ లైసెన్స్ లేకుండానే వలస కార్మికులతో వెట్టి చాకిరి,శీర్షికన మంగళవారం ప్రచురితమైన కథనంపై పెద్దపల్లి ఏ ఎల్ ఓ ని వివరణ కోరగా మృతి చెందిన కార్మికునికి నష్టపరిహారం ఇప్పించాలంటే రాణి అండ్ కో గోదాం యజమానులు ఎవరో తెలియదని, గోడౌన్ ఇంచార్జ్ సరియైన వివరాలు చెప్పడం లేదని, కాంట్రాక్టర్ పేరు తెలియకుండా మేము ఏమి చేయలేమని, ఆ గోడౌన్ కు సంబంధించిన ఎటువంటి లేబర్ లైసెన్స్ తాము ఇవ్వలేదని సమాధానం ఇచ్చారు. ఇదే విషయంపై కరీంనగర్ అసిస్టెంట్ లేబర్ కమిషనర్ (ఏ ఎల్ సి) ని వివరణ కోరగా రాణి అండ్ కో గోదాములో జరిగిన సంఘటనపై తమ సిబ్బందిని పంపించి విచారణ చేయించామని, మృతి చెందిన వలస కార్మికుని కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించాలన్న, యజమానిపై చర్యలు తీసుకోవాలన్న, గోడౌన్ యజమాని పేరు బయటకు రానీయడం లేదని బదులిచ్చారు. గోదాం కాంట్రాక్టర్ ఎవరో సాక్షాత్తు కార్మిక శాఖ కమిషనర్ కే తెలియదంటే ఆ గోదాం యజమానికి రాజకీయ నాయకుల, ప్రభుత్వంలోని సంబంధిత శాఖల ఉన్నత అధికారుల అండదండలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.కార్మిక క్షేత్రమైన పెద్దపల్లి జిల్లాలో వేలాది మంది స్థానికులు, వలస కార్మికులు గోదాములు, రైస్ మిల్లులు, మార్కెట్ యార్డులు, బజార్ దుకాణాలు వివిధ సంస్థలు స్థలాలు, ప్రదేశాలలో, పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారు.పని ప్రదేశాలలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు, పని భద్రతా లేదు, కార్మికులపై అఘాయిత్యాలు అత్యాచారాలు జరిగిన పట్టించుకునే నాథులే లేరు. ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన పరిహారం ఇప్పించే దిక్కే లేదు, ఇప్పటికైనా కార్మిక శాఖ ఉన్నత అధికారులు స్పందించి కార్మికులకు పని ప్రదేశాలలో కనీస సౌకర్యాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని పని భద్రత, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఎలాంటి లేబర్ లైసెన్స్ లేకుండా వందలాది వలస కార్మికులతో పని చేయిస్తున్న రాణి అండ్ కో గోదాములను సీజ్ చేయాలని, గోదాం యజమానులెవరో బహిర్గతం చేయాలని, మృతి చెందిన వలస కార్మికునికి నష్టపరిహారం ఇప్పించాలని కార్మిక సంఘాల నాయకులు కోరుతున్నారు.

## మూసీ సుందరీకరణ పేరుతో భయాందోళనకు గురిచేస్తున్నారు:సిపిఐ(ఎం)

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణ పేరుతో తీసుకుంటున్న చర్యలు పేద, మధ్య తరగతి ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు . ఇంతటి ప్రాధాన్యత కలిగిన అంశంలో విస్తృత సంప్రదింపులు లేకుండా ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదని, రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు తదితరులతో విస్తృతంగా సంప్రదింపులు చేపట్టి, ఏకాభిప్రాయ సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తమ్మినేని వీరభద్రం బుధవారం లేఖ రాశారు. పేద, మధ్యతరగతి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని, ఎప్పుడు బుల్‌డోజర్లు వచ్చి కూలగొడతాయోనని ప్రజలు ఆందోళనలో చెందుతున్నారని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఇంత హడావుడిగా నిర్ణయాలు తీసుకుని, ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని సూచించారు. ఉప్పల్, ఘట్‌కేసర్ ప్రాంతం నుండి మొదలై, సూర్యాపేట జిల్లా దాటేవరకు కలుషిత మూసీ జలాలను వ్యవసాయం, పచ్చగడ్డి, చేపల పెంపకం, ఎడ్లు, బర్లకే కాకుండా, ప్రజల తాగునీటికి కూడా వాడుతున్నారని, తద్వారా ఇక్కడ ఉత్పత్తి అవుతున్న వ్యవసాయ ఉత్పత్తులు పాలు, చేపలు ఉపయోగించిన ప్రజల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయని తెలిపారు. మూసీలోనూ, మూసీ గట్ల మీద నివాసాలు ఏర్పరచుకున్న పేదల ఇండ్లు, వరదల్లో ముంపునకు గురవుతున్నాయని, మూసీకి సంబంధించిన ఈ అసలైన సమస్యలను పరిష్కరించడమే కీలకమని తమ్మినేని పేర్కొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM - 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com